

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 354

శుక్రవారం 15-3-2024



కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు.


-15లో




సగ్గుబియ్యం వేసవిలో తిందాం.

-13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


SAMSUNG
Galaxy S23 FE
Holi made epic
SAMSUNG
Own now at an epic price of ₹ 39999*
Samsung Upgrade
HDFC BANK
BAJAJ FINSERV
Samsung Finance+™
samsung.com
Scan to buy now
Please dispose off e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 1800 5 7267864 for information on e-waste/plastic pick up.
Image simulated for representational purpose, actual may vary. Color as per availability. *T&C apply. Offer price shown for 1 Unit of Galaxy S23 FE 8GB | 128GB inclusive of ₹ 5000 instant cashback, ₹ 5000 upgrade bonus and ₹ 5000 bank cashback (Financier T&C apply). Final price as per dealer discretion. Instant cashback provided by brand at its sole discretion. Upgrade bonus as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. Bank cashback provided at sole discretion of HDFC Bank. Reach out to dealer for more information. Offers may be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company.
Cheil-19533/24


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 354

శుక్రవారం 15-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రంజీ' రారాజు ముంబై

42వ సారి టైటిల్ సొంతం. విదర్భపై 169 పరుగులతో విజయం -15లో



'పారామౌంట్'తో రిలయన్స్ డీల్

వయాకామ్–18లో 13శాతం పారామౌంట్ వాటాల కొనుగోలు -15లో



ఐదోసారి అధ్యక్ష పీఠం దిశగా

చాలా సంవత్సరాలుగా పుతిన్ ఏలుబడిలో ఉన్న రష్యాలో ఈరోజు నుంచి అధ్యక్ష ఎన్నికలు మొదలుకాబోతున్నాయి.

వివరాలు 6లో ▸



ఉద్యమం మరింత ఉధృతం

రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి.

వివరాలు 6లో ▸



పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గింపు

దాదాపు రెండేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థలు తెలిపాయి.

వివరాలు 2లో ▸



ఇంటి నుంచి పార్శిళ్ల సేకరణ

వినియోగదారులకు సత్వర సేవల కోసం త్వరలో ఇంటి నుంచే పార్శిళ్ల సేకరణ, డెలివరీని ఆర్టీసీ అందుబాటులోకి తీసుకురానుంది.

వివరాలు 7లో ▸

'వల'స రాజకీయం!

బీఆర్‌ఎస్ కీలక నేతలకు కాంగ్రెస్, బీజేపీ గాలం

- పార్టీల్లో చేర్చుకుని లోక్‌సభ అభ్యర్థులుగా అవకాశం
- ఇప్పటిదాకా బీజేపీ ప్రకటించిన సీట్లలో మూడో వంతు బీఆర్‌ఎస్ నుంచి వచ్చినవారికే..
- కీలక స్థానాల్లో పోటీకి బీఆర్‌ఎస్ నేతలవైపు కాంగ్రెస్ చూపు
- పోటీలో దింపకున్నా మరికొందరిని చేర్చుకునేందుకు జాతీయ పార్టీల యత్నాలు
- పార్టీ బలోపేతమైనట్టుగా చూపుకొనేందుకు ప్రయత్నాలు
- సీనియారిటీ, ఆర్థికబలం, స్థానికతకు బీఆర్‌ఎస్ మొగ్గు
- నష్టాన్ని పూడ్చుకుంటూనే దీటుగా నిలబడేందుకు కేసీఆర్ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 'వల'స రాజకీయం నడుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక బీఆర్‌ఎస్ నేతలే టార్గెట్‌గా సాగినట్టు కనిపిస్తోంది. బీజేపీ ఎంపిక చేసిన వారిలో ఎక్కువ మంది బీఆర్‌ఎస్ నుంచి వచ్చినవారే ఉండటం, అధికార కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తున్న సూచనలు ఉండటం దీనిని బలపరుస్తోంది. రెండు జాతీయ పార్టీలు కూడా ఇలా వలస నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం బీఆర్‌ఎస్ శిబిరంలో కలవరం రేపుతోంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటివరకు బీజేపీ 15, కాంగ్రెస్ 4, బీఆర్‌ఎస్ 11 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి. బీజేపీ ప్రకటించిన 15 మందిలో ఐదుగురు ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి వచ్చి చేరినవారే. కాంగ్రెస్ మలి జాబితాలో బీఆర్‌ఎస్ నుంచి చేరిన ముగ్గురు లేదా నలుగురికి టికెట్లు దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీఆర్‌ఎస్ ఈ నష్టాన్ని పూడ్చుకోవడంపై దృష్టి సారిస్తూనే దీటైన అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే 11 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. అదే సమయంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పొత్తు చర్చలు జరుపుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్

మిగతా 2వ పేజీలో ▶



జితేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన సీఎం రేవంత్. చిత్రంలో పట్నం, పొంగులేటి తదితరులు

'చే'రికల ప్లాన్

- 'గ్రేటర్' ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునే వ్యూహం
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి కలసిన సీఎం, ఇతర నాయకులు
- బీజేపీ ఎంపీ టికెట్ రానందున సానుభూతి తెలిపేందుకే రేవంత్ వచ్చారన్న జితేందర్
- కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌ను కలసిన మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబం!
- ఓ వర్సిటీని కొనే పనిపై కలిశానన్న మల్లారెడ్డి

8లో



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకేను కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మరో ఇద్దరికి కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్

మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి

- ఆదిలాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- మూడు విడతల్లో 11 మంది అభ్యర్థుల ఖరారు





ఆత్రం సక్కు



లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసే మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు అవకాశం లభించింది. దీంతో మొత్తం 17 లోక్‌సభ స్థానాలకుగాను 11 సీట్లకు బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా ఖరారైంది. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాన్ని పొత్తులో భాగంగా బీఎస్పీకి కేటాయించే అవకాశం ఉండటంతో, మరో ఐదు స్థానా లకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. అభ్యర్థు లను ప్రకటించాల్సిన నియోజకవర్గాల జాబితాలో హైదరాబాద్, సికింద్రాబాద్, నల్లగొండ, భువనగిరి, మెదక్ ఉన్నాయి. కాంగ్రెస్ జాబితా వెలువడిన తర్వాత మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార సభల షెడ్యూల్‌పైనా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఈ నెల 23న బహిరంగ సభ నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు చేస్తోంది. అభ్యర్థులు ఖరారైన చోట బహిరంగ సభలు, ప్రచార షెడ్యూల్‌పై స్థానికంగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

ఆదిలాబాద్ నేతలతో కేసీఆర్ భేటీ

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్య నేతలతో

మిగతా 2వ పేజీలో ▶



రాష్ట్రపతి ముర్ముకు నివేదిక సమర్పిస్తున్న మాజీ రాష్ట్రపతి కోవింద్. చిత్రంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, మేఘ్వాల్, డీపీఏపీ నేత ఆజాద్ తదితరులు

రెండు దశల్లో 'జమిలి ఎన్నికలు'

- లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి..
- ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థలకు..
- 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'తో దేశానికి మేలు
- రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు నివేదిక సమర్పించిన కమిటీ

- వివరాలు 6లో

మే 20 నుంచి టెట్

డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు ● జూలై 17 నుంచి 31 వరకూ డీఎస్సీ

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను మే 20 నుంచి జూన్ 3 వరకూ నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ దేవసేన గురువారం ప్రకటించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్, సమాచార బులెటిన్‌ను ఈ నెల 20న స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో వెల్లడిస్తామని తెలిపారు. కంప్యూటర్ బేస్డ్‌గా జరిగే ఈ పరీక్షకు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులు పంపుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను గత నెల 29న విడుదల చేసిన సంగతి తెలిసిందే. డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే మొదలు కాగా, ఈ గడువు ఏప్రిల్ 3తో ముగుస్తుంది. టెట్‌లో అర్హత సాధిస్తే తప్ప డీఎస్సీ రాసేందుకు అర్హత ఉండదు. దీనివల్ల టెట్ అర్హత లేని బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు డీఎస్సీ రాసే వీలు ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని టెట్‌ను డీఎస్సీకి ముందే నిర్వహించాలని, ఇందులో అర్హత సాధించిన వారికి డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించాలని



ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో డీఎస్సీ దరఖాస్తు తేదీలను కూడా పొడిగించారు. జూన్ 6 వరకూ డీఎస్సీ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు దేవసేన తెలిపారు. డీఎస్సీ పరీక్షను ఆన్‌లైన్ మోడ్‌లో జూలై 17 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్టు కమిషనరేట్ పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకూ ఇదే టెట్‌లో పాల్గొనేందుకు చాన్స్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు వెల్లడవ్వాల్సి ఉంది. టీచర్ల పదోన్నతులకు టెట్ తప్పనిసరి చేయడంతో 80 వేల మంది ఉపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉంటుంది.

నేడు రాష్ట్రానికి ప్రధాని మోదీ

సాయంత్రం మల్కాజిగిరిలో రోడ్ షో

రేపు నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... తెలంగాణలో బీజేపీ తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో వరుసగా శుక్ర, శని, సోమవారాల్లో వివిధ చోట్ల బహిరంగసభలు, రోడ్‌షోల్లో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు రానున్న మోదీ రాత్రికి రాజ్‌భవన్‌లో బసచేయనున్నారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్‌లో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. మళ్లీ 18న జగిత్యాలలో

మిగతా 2వ పేజీలో ▶



హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాసంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకిచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుంది: స్పీకర్ ప్రసాద్‌కుమార్
- హుజూర్‌నగర్‌లో మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- వివరాలు 2లో▶



సుఖ్‌బీర్ సంధూ



జ్ఞానేశ్ కుమార్

ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్

నూతన ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌లను కేంద్రం నియమించింది. వారి నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం కేంద్ర న్యాయ శాఖ విడుదల చేసింది. సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌లు 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు. సుఖ్‌బీర్ ఉత్తరాఖండ్ క్యాడర్ అధికారి కాగా జ్ఞానేశ్ కేరళ క్యాడర్ అధికారి. సుఖ్‌బీర్ గతంలో ఉత్తరాఖండ్ సీఎస్‌గా, ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌గా పనిచేశారు. జ్ఞానేశ్ గతంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా చేశారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

గ్రూప్–1 దరఖాస్తు గడువు 16 వరకు పొడిగింపు



గ్రూప్–1 ఉద్యోగ దరఖాస్తుల స్వీకరణ గడువును టీఎస్‌పీఎస్సీ మరో రెండ్రోజులు పొడిగించింది. ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు.

- వివరాలు 7లో▶

నేటి నుంచే టీజీ రిజిస్ట్రేషన్లు



రాష్ట్రంలోని వాహనాలు శుక్రవారం నుంచి టీజీ పేరుతో రిజిస్ట్రేషన్ అవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల మనోభావాలకు భిన్నంగా టీఎస్ పేరుతో రిజిస్ట్రేషన్లు చేపట్టిందని ఆరోపించారు.

- వివరాలు 7లో▶


18 ఓటీటీలపై నిషేధం



అశ్లీల కంటెంట్‌ను ప్రదర్శిస్తున్నందుకుగాను 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వాటికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఓటీటీలకు సంబంధించిన 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ ఖాతాలు దేశంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉండవని పేర్కొంది.

- వివరాలు 6లో▶

సింగరేణిలో 327 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ



సింగరేణి బొగ్గు గనుల సంస్థలో 327 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



ఇదే పార్టీలో ఉంటే టికెట్ ఇవ్వరని తెలిసే మధ్యలో రెండు పార్టీల్లోకి జంపయి మళ్లీ వస్తే గౌరవంగా ఆహ్వానించి టికెటిచ్చారు!

ఆరుకు నూరు మార్కులెప్పుడు?



అందరి నోటా 6 గ్యారంటీలు

కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటితో 100 రోజులు

- ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామన్న ప్రభుత్వం
- గడువు పూర్తి కావడంతో రాజకీయ వర్గాలు, ప్రజల్లో చర్చ
- పార్టీ మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు
- ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు షురూ
- రైతు భరోసా, విద్యా భరోసా, పింఛన్ల పెంపు తదితరాలపై దృష్టి సారించని సర్కారు
- హామీలన్నీ నెరవేరాలంటే ఏటా రూ.1.30 లక్షల కోట్లు అవసరమన్న నిపుణులు
- బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం


సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. శుక్రవారంతో కాంగ్రెస్ పాలనకు వంద రోజులు పూర్తి కానుండటంతో, ప్రభుత్వ పనితీరుపై రాజకీయ వర్గాలు, ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంత స్వల్ప వ్యవధిలో ప్రభుత్వ పనితీరును అంచనా వేయడం సరికాక పోయినా, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటన చేయడం చర్చకు తావిచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరుతో 13 హామీలను పొందుపరిచింది. ఈ 13 పథకాల అమలుకు ఏటా దాదాపు రూ.1.30 లక్షల కోట్లు అవసరమని నిపుణులు అంచనా వేశారు. కానీ ప్రభుత్వం వీటికి బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లే కేటాయించింది. దీనిపై అప్పట్లోనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా ఇప్పటివరకు ఐదు హామీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఇంకా ఎనిమిది హామీలు పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం తీవ్రమవుతున్న తాగునీరు, విద్యుత్ సమస్యలను కూడా ప్రభుత్వం అధిగమించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వంద రోజుల్లో తాను సాధించిన విజయాలను వివరిస్తూ ప్రభుత్వం గురువారం ప్రగతి నివేదిక విడుదల చేసింది.

ఎన్నికల తర్వాతే మిగతా హామీల అమలు?

అధికారంలోకి వచ్చిన రెండోరోజే డిసెంబర్ 9న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తర్వాత 50 రోజులకు పైగా సమయం తీసుకుని ఫిబ్రవరి 28న మరో రెండు పథకాలు షురూ చేసింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించింది. అనంతరం 12 రోజుల సమయం తీసుకుని మార్చి 11న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పార్లమెంటు ఎన్నికల కోడ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో, ఆరు గ్యారంటీల్లో అమలు కాకుండా

మిగతా 8వ పేజీలో ▶

సగం బాండ్ల నిధులు బీజేపీకే



- బాండ్ల రూపంలో పార్టీలకు మొత్తం రూ.12,999 కోట్ల విరాళం
- అందులో రూ.6,060 కోట్లు బీజేపీకి.. రూ.1,609 కోట్లు తృణమూల్‌కు
- టాప్–6లో బీజేపీ, తృణమూల్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేడీ, డీఎంకే
- అత్యధిక బాండ్లు విరాళమిచ్చిన టాప్–2 కంపెనీల్లో మేఘా ఇంజనీరింగ్
- తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్ రూ.1,368 కోట్లు; మేఘా రూ.1,186 కోట్లు
- సుప్రీం ఆదేశాల మేరకు తమ వెబ్‌సైట్లో వెల్లడించిన కేంద్ర ఎన్నికల కమిషన్

2లో

● ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ పరమైన పర్యవేక్షణ కోసం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'పేరుతో కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీల విధివిధానాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం విడుదల చేశారు. గ్రామ స్థాయిలోని సంఘాలు లేదా స్థానిక ఫెడరేషన్ల అధ్యక్షుడు ఈ కమిటీకి చైర్మన్‌గా, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు.

'వల'స రాజకీయం!

▶ మొదటి పేజీ తరువాయి

వెలువడుతుందనే వార్తల నేపథ్యంలో.. ప్రధాన పార్టీలన్నీ మిగతా అభ్యర్థుల ఎంపికను వేగిరం చేశాయి. దీంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వలసల రాజకీయం మరింత ఊపందుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్ అసంతృప్తులపై కాంగ్రెస్ ఫోకస్..

రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచే బీఆర్ఎస్ నేతలను చేర్చుకోవడంపై కాంగ్రెస్ దృష్టిపెట్టింది. పెద్దపల్లి లోక్‌సభ టికెట్‌ను ఆశిస్తూ సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ టికెట్ ఆశించిన గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ శ్రీలత భర్త మోతె శోభన్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల టికెట్‌ను ఆశిస్తూ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేరారు. ప్రస్తుతం వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్‌గా ఉన్న మహేందర్‌రెడ్డి భార్య సునీతకు టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనూ ఓ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేను పార్టీలోకి రప్పించి భువనగిరి టికెట్ ఇవ్వనున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ నల్గొండ ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి ఇటీవల సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీకావడం గమనార్హం. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌కు దగ్గరవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని ప్రకటించినా.. బెంగళూరు వేదికగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మల్లారెడ్డి భేటీపై చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యే నాటికి మరిన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. కేవలం బీఆర్ఎస్ నుంచే కాకుండా బీజేపీ అసంతృప్తులపైనా కాంగ్రెస్ దృష్టి సారించింది. మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో సీఎం రేవంత్ భేటీ కావడమే దీనికి సంకేతమని అంటున్నారు.

కమలం గూటికి తాజా, మాజీ గులాబీలు

ప్రస్తుత పార్లమెంటు చివరి సమావేశాలు జరుగుతున్న సమయంలో.. గత నెల మొదటి వారంలోనే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు పి.రాములు (నాగర్‌కర్నూల్) బీబీ పాటిల్ (జహీరాబాద్) కాషాయదళంలో చేరారు. రాములు కుమారుడు భరత్‌కు, బీబీ పాటిల్‌కు వెంటనే బీజేపీ ఎంపీ టికెట్లు లభించాయి. మాజీ ఎంపీలు గోడెం నగేశ్ (ఆదిలాబాద్), సీతారాంనాయక్ (మహబూబాబాద్)తో పాటు మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి (నల్గొండ)కు పార్టీలో చేరిన గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థిత్వం దక్కింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను పార్టీలో చేర్చుకుని వరంగల్ టికెట్ ఇచ్చే ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. అయితే లోకసభ అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారే బీజేపీలో చేరుతుండగా.. అసెంబ్లీ, ఆ దిగువస్థాయి నుంచి బీజేపీలోకి పెద్దగా చేరికలు కనిపించడం లేదు. ప్రధాని మోదీ చరిష్మా, రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షం బీఆర్ఎస్‌లపై ఉన్న వ్యతిరేకతకు తోడు ప్రధాని మోదీ చరిష్మా, రామ మందిర నిర్మాణం వంటి అంశాలు తమకు లాభిస్తుందని బీజేపీ లెక్కలు వేసుకుంటోంది. రాష్ట్రంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల వరుస పర్యటనలు ఉన్న నేపథ్యంలో కింది స్థాయిలోనూ ఇతర పార్టీల నుంచి చేరికలు ఉంటాయని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

అభ్యర్థుల ఎంపిక.. బీఎస్పీతో పొత్తులు

రెండు జాతీయ పార్టీలు 'వల'సలతో ఇబ్బందిపెడుతున్నా.. దీటుగా ఎదుర్కొనేలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనదైన వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తూనే.. బీఎస్పీతో పొత్తు అంశాన్ని వ్యూహాత్మకంగా తెరమీదికి తీసుకువచ్చారు. బీఆర్ఎస్‌కు ప్రస్తుతమున్న 9 మంది సిట్టింగ్ ఎంపీల్లో ఇప్పటికే ముగ్గురు పార్టీని వీడగా.. మరో ఇద్దరు రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), పసునూరు దయాకర్ (వరంగల్) పోటీకి దూరంగా ఉన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి (మెదక్) ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఎంపీ పోటీకి దూరమయ్యారు. దీనితో సిట్టింగ్ ఎంపీల్లో ముగ్గురు మన్నె శ్రీనివాస్ రెడ్డి (మహబూబ్‌నగర్), మాలోత్ కవిత (మహబూబాబాద్), నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం) మాత్రమే తిరిగి బీఆర్ఎస్ నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉండి, పలుకుబడి ఉన్న ఎంపీలు, ఇతర కీలకనేతలను కాంగ్రెస్, బీజేపీ చేర్చుకుంటుండటంతో.. ఆయా స్థానాల్లో ప్రత్యామ్నాయంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఆర్థిక స్థోమత కలిగి, పోటీకి ఆసక్తి చూపుతున్న నేతలను, సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న వారిని పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల బరిలోకి దింపుతున్నారు. సీనియారిటీ ఆధారంగా కడియం శ్రీహరి (ఆయన కుమార్తె కావ్యకు వరంగల్), బాజిరెడ్డి గోవర్ధన్ (నిజామాబాద్), కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి), బోయినపల్లి వినోద్‌కుమార్ (కరీంనగర్), ఆత్రం సక్కు (ఆదిలాబాద్)లకు టికెట్లు ఇచ్చారు. ఆర్థిక బలం, స్థానికత తదితరాల ప్రాతిపదికగా కాసాని జ్ఞానేశ్వర్ (చేవెళ్ల), గాలి అనిల్‌కుమార్ (జహీరాబాద్), రాగిడి లక్ష్మారెడ్డి (మల్కాజిగిరి)ని ఎంపిక చేశారు. ఇక పొత్తులో భాగంగా బీఎస్పీకి నాగర్‌కర్నూల్ స్థానం కేటాయించేందుకు బీఆర్ఎస్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇక పార్టీ నుంచి కొనసాగుతున్న వలసతో జరిగే నష్టాన్ని పూడ్చుకోవడంపైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకత, త్రిముఖ పోటీ కలసి వస్తుందని పేర్కొంటున్నారు.


కాంగ్రెస్‌కు అభ్యర్థులే దొరకడం లేదు

చేవెళ్ల సీటు మోదీదే రాసిపెట్టుకోండి: బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి చాలాచోట్ల అభ్యర్థులే దొరకడం లేదని, అందుకే ఇతర పార్టీల్లో టికెట్ రాని నేతల కోసం ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ముఖ్యమంత్రిని కూడా బయటనుంచి తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తనకు మంచి మిత్రుడని, ఆయనకు టికెట్ రాకపోవడం బాధాకరమన్నారు. డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ఇద్దరూ పెద్ద లీడర్లేనని, జితేందర్‌రెడ్డి పార్టీ మారతారని తాను భావించడం లేదని చెప్పారు. చేవెళ్ల సీటు మోదీదేనని రాసి పెట్టుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ తెలంగాణలోని 12, 13 సీట్లు గెలిచినా ఆశ్చర్యపోనవసరంలేదని చెప్పారు. బీజేపీలోకి బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి వస్తానన్నా తమకు అభ్యంతరం లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే తమ పార్టీపై దుష్ప్రచారం సాగుతోందని, మద్యం కుంభకోణం కేసులో చర్యలు తీసుకోకపోవడం వల్ల అలా అనుకుని ఉండొచ్చునని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కాంగ్రెస్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గింపు



న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: దాదాపు రెండేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. త్వరలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రానుండగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థలు తెలిపాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి రానున్నాయని కేంద్ర చమురు శాఖ గురువారం సాయంత్రం తెలిపింది. ధర తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.96.72 నుంచి రూ.94.72కు, డీజిల్ ధర రూ.89.62 నుంచి 87.62కు రానుంది. వారం క్రితమే కేంద్రం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 మేర తగ్గించిన విషయం తెలిసిందే.

రాష్ట్రంలో ఇలా..

స్థానిక, అమ్మకం పన్నులు కలిపి రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.2.70, డీజిల్ ధర రూ. 2.54 మేర తగ్గనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూ.109.66గా ఉన్న పెట్రోల్ ధర రూ.106.96కు తగ్గనుండగా, డీజిల్ ధర రూ.97.82 నుంచి రూ. 95.28కు తగ్గనుంది.

కాంగ్రెస్‌లో చేరిన కోనప్ప



కోనప్పకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

కాగజ్‌నగర్ రూరల్: సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క కండువా కప్పి కోనప్పను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కోనప్పతోపాటు ఆయన సోదరుడు, ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీనా సుల్తానా, వైస్‌చైర్మన్ రాజేందర్, పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ముఖ్య నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని గెలిపించడానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా



హుజూరాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, రెండుసార్లు మంత్రిగా, కార్మిక సంఘ నేతగా సేవలందించిన ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గురువారం లేఖ రాశారు. 2021 జూలై 27న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమక్షంలో పెద్దిరెడ్డి బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆ తర్వాత పార్టీకి దూరంగా ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక విషయంలోనూ తనను పార్టీ పరిగణనలోకి తీసుకోకపోవడం, ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కదనభేరి సభకు ఆహ్వానించనందుకు మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అభిమానులు, ప్రజాభీష్టం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పెద్దిరెడ్డి వెల్లడించారు.

సగం బాండ్ల నిధులు బీజేపీకే

- బాండ్ల రూపంలో పార్టీలకు మొత్తంగా రూ.12,999 కోట్ల విరాళం
- అందులో రూ.6,060 కోట్లు బీజేపీకి... రూ.1,609 కోట్లు తృణమూల్‌కు
- సుప్రీం ఆదేశాల మేరకు తమ వెబ్‌సైట్లో వెల్లడించిన కేంద్ర ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకంతో అధికార బీజేపీకి అత్యధికంగా నిధులు సమకూరినట్లు వెల్లడయ్యింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎవరెవరు ఎంతెంత బాండ్లు కొన్నారు? ఏ పార్టీలకు ఎంతెంత వచ్చింది? అనే వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేసింది. ఈసీ ఈ జాబితాలను తమ వెబ్‌సైట్లో పెట్టి బహిరంగపరచింది. దీని ప్రకారం మొత్తంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ ఎన్నికల బాండ్ల రూపంలో రూ.12,999 కోట్ల రూపాయలు బాండ్ల రూపంలో అందాయి. దీన్లో 46.7 శాతం... అంటే దాదాపుగా సగం అధికార బీజేపీ ఖాతాలోకే వచ్చాయి. రూ.6,060 కోట్ల విలువైన బాండ్లు బీజేపీ ఖాతాలోకి రాగా... ఆ తరవాతి స్థానాల్లో రూ.1,609 కోట్లతో తృణమూల్ కాంగ్రెస్, రూ.1,421 కోట్లతో కాంగ్రెస్ పార్టీ, రూ.1,214 కోట్లతో బీఆర్ఎస్, రూ.775 కోట్లతో బిజూ జనతాదళ్, రూ.639 కోట్లతో డీఎంకే వరుసగా నిలిచాయి.

సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు మేరకు గురువారం సాయంత్రం ఈసీ తమ అధికారిక వెబ్‌సైట్‌లో రెండు భాగాలుగా ఈ వివరాలను పొందుపరిచింది. మొదటి భాగంలో బాండ్లు కొనుగోలు చేసినవారి వివరాలు, వాటి విలువ, రెండో భాగంలో ఆయా బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల వివరాలు తేదీలతో సహా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ అనే సంస్థ అత్యధిక విలువైన బాండ్లు కొనుగోలు చేసి టాప్‌-1గా నిలిచింది. కోయంబత్తూరుకు చెందిన ఈ సంస్థ రూ.1,368 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా... హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ రూ.966 కోట్లు, దాని అనుబంధ సంస్థ వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ రూ.220 కోట్లు కలిపి మొత్తం రూ.1,186 కోట్ల విలువైన బాండ్లను కొని రెండో స్థానంలో నిలిచింది. రూ.వెయ్యి కోట్లను దాటి బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు ఈ రెండే కాగా... వందల కోట్ల మేర భారీగా బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, టోరెంట్ పవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, డీఎల్‌ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్, ఎస్సెల్ మైనింగ్, వేదాంత లిమిటెడ్, అపోలో టైర్స్, లక్ష్మీ నివాస్ మిట్టల్, పీవీఆర్, సూలా వైన్స్, వెల్‌స్పన్, సన్ ఫార్మా తదితర ప్రఖ్యాత సంస్థలున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన యశోద హాస్పిటల్స్, నవయుగ ఇంజినీరింగ్, దివీస్ ల్యాబొరేటరీస్, ఎన్‌సీసీ, నాట్కో ఫార్మా, అరబిందో ఫార్మా కూడా బాండ్లు కొనుగోలు చేసిన సంస్థల్లో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో అమల్లోకి వచ్చింది. వ్యక్తులు, వ్యాపార/వాణిజ్య సంస్థలు ఈ బాండ్లను కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు అందజేశాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15వ తేదీ దాకా జారీ చేసిన బాండ్ల వివరాలను సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ వెల్లడించిన సంగతి తెలిసిందే.

నేడు రాష్ట్రానికి ప్రధాని

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో ప్రసంగిస్తారు. శుక్ర, శనివారాల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చనే అంచనాల మధ్య ప్రధాని పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. మోదీ ఇప్పటికే ఈ నెల 4న ఆదిలాబాద్‌లో, 5న పటాన్‌చెరులో రూ.15వేల కోట్ల పైచిలుకు విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన సంగతి తెలిసిందే.

ఇదీ మోదీ షెడ్యూల్...

- శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు కేరళ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేటకు...
- రోడ్డుమార్గాన మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని రోడ్డుషో స్టార్టింగ్ పాయింట్‌కు...
- సాయంత్రం 5.15 గంటల నుంచి 6.15 గంటల వరకు మల్కాజిగిరిలో రోడ్డుషో
- రోడ్డుమార్గాన 6.40 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస
- శనివారం ఉదయం 11 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 11.50 గంటలకు నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారు
- మధ్యాహ్నం 12 నుంచి 12.45 గంటల దాకా అక్కడ బహిరంగసభలో పాల్గొంటారు
- ఒంటిగంటకు నాగర్‌కర్నూల్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.05 గంటలకు కర్ణాటకలోని గుల్బర్గాకు బయలుదేరుతారు.
- తిరిగి 18వ తేదీ రాష్ట్రానికి వస్తారు.

రాహుల్ గాంధీ హామీలు పెద్ద జోక్

ఎంపీ బండి సంజయ్‌కుమార్



బోయినపల్లిలో మాట్లాడుతున్న సంజయ్. చిత్రంలో రఘునందన్‌రావు తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో ప్రతి మహిళ పేరిట రూ.లక్ష చొప్పున బ్యాంకులో జమచేస్తామని, ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానంటూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న హామీలు పెద్దజోక్ అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో గురువారం జరిగిన ప్రజాహితయాత్రలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి ఎలాగూ రాలేదని అర్థమై, అడ్డగోలు హామీలు ఇస్తున్నారన్నారు. రిజర్వేషన్ల విషయం తర్వాత కానీ.. మొదట కాంగ్రెస్ పార్టీ పదవులు, లోక్‌సభ ఎన్నికల్లో 50 శాతం టికెట్లు మహిళలకు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ఇప్పటికీ దిక్కులేదని చెప్పారు. 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రానికి అధిక నిధులు తీసుకొస్తామన్నారు. బోయినపల్లి మండలకేంద్రంలో మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ బండి సంజయ్ గెలిస్తే మోదీ ప్రభుత్వంలో మంత్రిపదవి వస్తుందని పేర్కొన్నారు.

బీజేపీకి మూడోసారి అధికారం ఖాయం

మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజలతో ఓట్లు వేయించుకుని వారినే తలదన్నేలా వ్యవహరించిన బీఆర్ఎస్ అహంకారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అణచివేశారని మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ అన్నారు. తనకు మహబూబాబాద్ సీటు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేసిన సీతారాం నాయక్.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ సహా పార్టీ ఇతర నేతలకు ధన్యవాదాలు తెలిపారు. గత పదేళ్లలో దేశ అభివృద్ధి, పుణ్యక్షేత్రాల అభివృద్ధి, నీతి, నిజాయితీలతో పాలన వంటి అంశాలతో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుందని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో మాజీ ఎంపీ సీతారాం నాయక్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీ 12 ఎంపీ సీట్లలో కచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో మోదీ ఎంపీ టికెట్ ఇచ్చారని.. మహబూబాబాద్‌లో గెలిచి తీరుతానని ఆయన శపథం చేశారు. గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీగా ఉన్నపుడు అనేక అభివృద్ధి పనులు చేశానని.. ఇప్పుడు బీజేపీ నుంచి గెలిచి మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని నాయక్ స్పష్టం చేశారు. కొత్తగూడెంలో ఎయిర్ పోర్టును తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని, ఇల్లందు స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు గురించి తన వద్ద ప్రణాళిక ఉందని వివరించారు.

ప్రజాసంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకిచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుంది: స్పీకర్ ప్రసాద్‌కుమార్
- హుజూర్‌నగర్‌లో మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

హుజూర్‌నగర్, పాలకవీడు: ప్రజాసంక్షేమం.. అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గుట్ట వద్ద రూ.74.80 కోట్లతో 2,160 సింగిల్ బెడ్రూం ఇళ్ల పునర్నిర్మాణ పైలాన్ ఆవిష్కరించారు. రూ.50 లక్షలతో క్రిస్టియన్ సిమెట్రీ, రూ.కోటితో టౌన్‌హాల్‌లో అభివృద్ధి పనులు, రూ.33.83 కోట్లతో పాలకవీడు మండలం బెట్టెతండ గ్రామం వద్ద మూసీనదిపై నిర్మించనున్న ఎత్తిపోతల పనులకు మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడే ఎన్నో అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. ఇప్పుడు మరోసారి అవకాశం రావడంతో ఈ నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణి పేరుతో వేలాది కోట్ల ఆస్తులు ఎలా దోచుకుని దాచుకున్నారో..ఆ లెక్కలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం పడ్డ ఆరాటం అభివృద్ధిపై పెట్టలేదని ఆయన ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లలో అర్హుల ఎంపికకు రాజకీయాలకతీతంగా కమిటీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలకు 17 లక్షల ఇళ్లు అందించగా, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో లక్షా 12 వేల ఇళ్లు మాత్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందిస్తామని చెప్పారు. వంద రోజుల్లో ఇచ్చిన ప్రతీ హామీని తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అనేక రంగాల్లో అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో లిఫ్టులు, రహదారులు, ఆస్పత్రులు, పరిశ్రమలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. త్వరలో అర్హులైన వారందరికీ తెల్ల రేషన్‌కార్డులు అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని, ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ లత, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.


మరో ఇద్దరికి కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

నందినగర్ నివాసంలో గురువారం కేసీఆర్ భేటీ అయ్యారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరును ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆత్రం సక్కు పార్టీ అభ్యర్థన మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్న విషయాన్ని కేసీఆర్ ప్రస్తావించారు. అయితే ఈ భేటీకి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఇంద్రకరణ్‌రెడ్డి గైర్హాజరుపై కేసీఆర్ ప్రశ్నించగా, వ్యక్తిగత పనులతో రాలేకపోయినట్లు నిర్మల్ జిల్లా నేతలు వెల్లడించారు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి గైర్హాజరు వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ప్రపంచంలో అత్యుత్తమంగా హైదరాబాద్

- సీఎం రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నారన్న దానకిశోర్
- ఇంధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రణాళికలు
- మిషన్ లైఫ్ పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని భారతదేశంలోనే కాకుండా, ప్రపంచ వేదికపై అత్యుత్తమ నగరంగా నిలపాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఇంధన సామర్థ్య సాధన ద్వారా ప్రపంచంలోనే పెట్టుబడులకు సురక్షిత నగరంగా హైదరాబాద్ త్వరలో రూపాంతరం చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా మూసీ నది పునరుజ్జీవనానికి తీసుకుంటున్న చర్యలు ఇందులో భాగమని స్పష్టం చేశారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ)తో కలిసి హైదరాబాద్‌లో మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పోస్టర్‌ను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, నగర సామాజిక, ఆర్థిక, పర్యావరణ వ్యవస్థల్ని మెరుగుపరచడం కూడా ప్రభుత్వ లక్ష్యమని దానకిశోర్ చెప్పారు. ఇవన్నీ పూర్తయితే లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు.

ఈసీబీసీతో విస్తృత ప్రయోజనాలు

తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీఎస్ రెడ్కో), బీఈఈ సంయుక్త భాగస్వామ్యంతో ఇంధన శక్తి సామర్థ్య నిర్వహణ, పర్యావరణ లక్ష్యాల్ని అందుకునేందుకు దానకిశోర్ నేతృత్వంలో చర్చించి, పలు నిర్ణయాల అమలుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. నగరంలో ఇకపై ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)కు అనుగుణంగానే కొత్త ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నారు. బీఈఈ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈసీబీసీ ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు ఆర్థిక, తదిత విస్తృత ప్రయోజనాలను అందిస్తుందని భావిస్తున్నారు. బీఈఈ కార్యదర్శి మిలింద్ దేవ్‌రా, బీఈఈ డైరెక్టర్లు సౌరభ్ దీదీ, ఎస్‌కే వర్మా, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సహకార సొసైటీలు ఏర్పాటు

ఈబీసీ బోర్డు కూడా • ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కొత్తగా ఎనిమిది సహకార సొసైటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో బీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేకంగా కో-ఆపరేటివ్ సొసైటీలు, కార్పొరేషన్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాలను అమలు చేస్తూ సహకార చట్టం పరిధిలో బీసీ సంక్షేమశాఖ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును నెలకొల్పింది.

కొత్త సొసైటీలు ఏవంటే..

తెలంగాణ గంగపుత్ర సహకార సొసైటీ, మేరా సహకార సొసైటీ, లింగాయత్ సహకార సొసైటీ, పెరిక సహకార సొసైటీ, పద్మశాలి సహకార సొసైటీ, మున్నూరుకాపు సహకార సొసైటీ, యాదవ-కురుమ సహకార సొసైటీ, ముదిరాజ్ సహకార సొసైటీలను ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసింది. తాజాగా ఏర్పాటుచేసిన సొసైటీలు, బోర్డుకు సంబంధించిన నిబంధనలు, ఇతర అంశాలను ప్రత్యేకంగా విడుదల చేయనుంది.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు

ఆర్థికంగా వెనుకబడిన కమ్మ సామాజిక వర్గంలోని కుటుంబాల అభ్యున్నతి కోసం కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

తగ్గని అసంతృప్త స్వరాలు

- బీజేపీలో ఎంపీ టికెట్ల కేటాయింపులో బయటివారికి ప్రాధాన్యతపై నిరసనలు
- కొందరు నేతలు పార్టీని వీడొచ్చునంటూ ప్రచారం
- బీజేపీ నేతలపై కేసులు పెట్టించిన సైదిరెడ్డికి నల్లగొండ టికెటా?
- వరంగల్ జిల్లాలో పార్టీ కేడర్‌ను ఇబ్బందిపెట్టిన అరూరి రమేశ్‌తో సంప్రదింపులా?
- బంగారు శ్రుతి, మనోహర్‌రెడ్డి వంటివారికి భువనగిరి, నల్లగొండ సీట్లు ఇవ్వలేరా? అనే ప్రశ్నలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ అభ్యర్థులుగా బయటివారికి ప్రాధాన్యమివ్వడంపై బీజేపీలో ఇంకా అసంతృప్త స్వరాలు తగ్గడం లేదు. ఇప్పటివరకు 15 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా.. అందులో ఏడుగురు ఇటీవలే చేరినవారికి (ఒకరు పార్టీలో కూడా చేరకున్నా) టికెట్లు ఇవ్వడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వ్‌డ్ సీట్లను (మూడు ఎస్సీ, రెండు ఎస్టీ సీట్లు) పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి కాకుండా 'వలస' నేతలకే ఇవ్వడం ఏమిటని (ఇంకా వరంగల్ ఎస్సీ సీటు ఖరారు కాలేదు) ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో తమకు టికెట్ దక్కని కొందరు నేతలు అసంతృప్తితో పార్టీ మారొచ్చంటూ ప్రచారం జరుగుతోంది. మహబూబ్‌నగర్ సీటును పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేటాయించడంతో.. ఆ స్థానాన్ని ఆశించిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి నిరుత్సాహానికి గురయ్యారు. దీనికితోడు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలు గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి భేటీకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జితేందర్‌రెడ్డి పార్టీ మారుతారంటూ ప్రచారం సాగింది. అయితే ప్రస్తుతం తాను బీజేపీలోనే ఉన్నానని, పార్టీ మారే ఉద్దేశమేదీ లేదని ఆయన ప్రకటించారు.

వేధించిన వారికి టికెట్లా?

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ గుర్రంపోడు ఎస్టీల భూముల పోరు అంశంలో బీజేపీ నాయకులపై అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కేసులుపెట్టి జైలుకు పంపారని బీజేపీ వర్గాలు అంటున్నాయి. పార్టీ శ్రేణులను వేధించిన వ్యక్తిని బీజేపీలో చేర్చుకుని నల్లగొండ ఎంపీ టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. గతంలో మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోసం టికెట్ త్యాగం చేసి, తర్వాత చేరిన మరో కాంగ్రెస్ నేతకు అసెంబ్లీ టికెట్ ఇచ్చినా సహకరించిన పార్టీ నేత జి.మనోహర్‌రెడ్డికి నల్లగొండ ఎంపీ సీటు ఎందుకు ఇవ్వలేకపోయారని నిలదీస్తున్నాయి. ఇక నాగర్‌కర్నూల్ ఎంపీ సీటును బీఆర్ఎస్ ఎంపీ కుమారుడికి ఇచ్చి.. పార్టీ మాజీ జాతీయాధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ కుమార్తె బంగారు శ్రుతికి మొండిచెయ్యి చూపడం ఎంతవరకు సబబు అని బీజేపీ అసంతృప్త నేతలు ప్రశ్నిస్తున్నారు. 20ఏళ్లకుపైగా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌ను కాదని కాంగ్రెస్ నుంచి వచ్చిన శ్రీనివాస్‌కు పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇవ్వడం సరికాదని అంటున్నారు. వరంగల్ జిల్లాలో పార్టీ కేడర్‌పై కేసులకు కారణమైన అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తాం, పార్టీలోకి రావాలంటూ పిలవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. అరూరి రమేశ్‌ను పార్టీలోకి తీసుకోవద్దని, వరంగల్ ఎంపీ సీటు ఇవ్వొద్దని గురువారం రాష్ట్ర నాయకత్వానికి మాజీ మంత్రి జి.విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే జైపాల్, ఇతర ఎస్సీ వర్గ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇదే డిమాండ్‌తో వరంగల్ జిల్లా నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన కూడా చేశారు. ఇలా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఎంపీ టికెట్లు ఇవ్వడంపై.. ఆశావహులు, ఇతర నేతలు పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే టికెట్ల కేటాయింపులో తమ ప్రమేయం పెద్దగా లేదని, జాతీయ నాయకత్వమే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తోందని ముఖ్య నేతలు బదులిస్తున్నట్టు సమాచారం.

సింగరేణిలో 327 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో 327 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఎగ్జిక్యూటివ్ కేడర్ కేటగిరిలో.. మేనేజ్మెంట్ ట్రైనీ (ఈ అండ్ ఎం) పోస్టు లు 42, మేనేజ్మెంట్ ట్రైనీ (సిస్టమ్స్) పోస్టులు 7, నాన్ ఎగ్జి క్యూటివ్ కేడర్ కేటగిరీలో జూనియర్ మైనింగ్ మేనేజర్ ట్రైనీ పోస్టులు 100, అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (మెకానిక ల్) పోస్టులు 9, అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్) పోస్టులు 24, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 47, ఎలక్ట్రిషన్ ట్రైనీ పోస్టులు 98 అందులో ఉన్నాయి. ఈనెల 15 నుంచి వచ్చే నెల 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నా రు. గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు కాగా, ఎస్సీ, ఎస్టీ , బీసీ, వికలాంగ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తించనుంది. పూర్తి వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్ www.scclmines.comను సంప్రదించాలని సంస్థ యాజమాన్యం తెలిపింది.

సీఎం అభద్రతాభావంతో ఉన్నారు: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అభ ద్రతాభావంతో ఉన్నారని బీజేపీ పార్ల మెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. సొంత పార్టీ ఎమ్మె ల్యేలపైనే ఆయనకు నమ్మకం లేదని, లేకపోతే తమ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాపాడుతారని ఎందుకు అంటారని ప్రశ్నించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉండాలని తాము కోరుకుంటామని చెప్పారు. అయితే దానిని కాపాడుకుంటారో లేదో చూసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని అది తమ పాలనకు రెఫరెండమని రేవంత్‌రెడ్డి చెబుతున్న దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకు ఏమి చేశారో మోదీ చెబుతారు..

ఈనెల 15న మల్కాజిగిరి, 16న నాగర్‌కర్నూల్, 18న జగిత్యాలలో పర్యటన సందర్భంగా తెలంగాణకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రజల ముందు పెట్టబోతున్నారని లక్ష్మణ్ చెప్పారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఎన్నికలకు వెళతామంటే కుదరదని, ఎన్నికల తర్వాత అమలు చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

యాదాద్రి ఆలయ ఈవోగా భాస్కర్‌రావు

- ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు బదిలీ
- ప్రొటోకాల్ వివాదంతో ఆయనపై వేటు


భాస్కర్‌రావు

సాక్షి, యాదాద్రి: యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనర సింహస్వామి దేవస్థానం ఈవోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.భాస్కర్‌రావును ప్రభు త్వం నియమించింది. ఇక్క డ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావుపై బదిలీ వేటు వేసింది. ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట పర్యటన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విషయంలో దేవస్థానం అధికారులు ప్రొటోకాల్ పాటించలేదన్న ఆరోపణలతో ఈవోపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ చర్యలు తీసుకుంది. ఇన్‌చార్జి ఈవోను బదిలీ చేసి భాస్కర్‌రావును ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త పీటలు కొనుగోలు: వేద పండితులు ఆలయ ముఖమండపంలో వీఐ పీలకు ఇచ్చే ఆశీర్వచనం కోసం దేవస్థానం అధికారులు పది కొత్త పీటలను కొనుగోలు చేశారు. ఈ పీటలన్నీ సమాంతరంగా ఒకే ఎత్తులో ఉండేలా చూసి మరీ కొనుగోలు చేశారు.

డిప్యూటేషన్‌పై నియామకం: స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రావును దేవాదాయ శాఖకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో ఆయనను యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోగా నియమించారు.

కేంద్ర గుర్తింపు కలిగిన సంస్థతో ధరణి నిర్వహణ

- ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి
- బొమ్మరాశిపేటలో ధరణి కమిటీ సభ్యుల పర్యటన

శామీర్‌పేట్: కేంద్ర గుర్తింపు కలిగిన సంస్థతో ధరణి పోర్టల్‌ను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ కమిటీ ధరణి ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నెల 1 నుంచి 17వ తేదీ వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల పరిధిలోని బొమ్మరాశిపేట గ్రామంలో ధరణి కమిటీ సభ్యులు పర్యటించారు. అనంతరం బొమ్మరాశిపేట రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కోదండరెడ్డి, ధరణి కమిటీ న్యాయ సలహాదారు సునీల్‌లు మాట్లాడుతూ.. బొమ్మరాశిపేట గ్రామంలో ధరణిలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకొని కొందరు అధికారులు, బడా బాబులు కుమ్మక్కై భూ సమస్యలను సృష్టించినట్లు గుర్తించామని తెలిపారు. ధరణిలో ఉన్న లోపాలను గుర్తించేందుకు బొమ్మరాశిపేట గ్రామంలో నెలకొన్న భూ సమస్యను ఓ కేస్ స్టడీగా పరిగణనలోకి తీసుకొని అధ్యయనం చేస్తామన్నారు. ధరణి వెబ్‌సైట్‌లో మార్పులు చేపట్టి, సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తామని అన్నారు.


ధరణి కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న బొమ్మరాశిపేట రైతులు

రైతులెవరూ అధైర్య పడవద్దని, త్వరలోనే ప్రభుత్వం సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని వారు భరోసా ఇచ్చారు.

లొసుగులను వాడుకొని..

ధరణిలో ఉన్న లొసుగులను వాడుకొని కొందరు బడాబాబులు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బొమ్మరాశిపేట రైతులు ధరణి కమిటీ సభ్యుల ముందు వాపోయారు. 50 ఏళ్ల క్రితం 1,050 ఎకరాల భూమి కొనుగోలు చేసి సాగుచేస్తున్నామని, ఇటీవల కొందరు వ్యక్తులు వచ్చి ఆ భూమి తమదంటూ.. అధికారులతో కుమ్మక్కై భూములను బ్లాక్ లిస్ట్‌లో చేర్పించారని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. తమ భూమిపై ఎలాంటి లావాదేవీలు జరుపుకోకుండా అడ్డుపడుతున్నారని, కొంత స్థలం అమ్మి కూతుళ్ల పెళ్లిచేయాలని ప్రయత్నించినా ధరణి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

317 జీవో సమస్యల పరిష్కారం ఎలా?

- ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కేబినెట్ సబ్ కమిటీ భేటీ
- వినతులు స్వీకరించిన మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల బదిలీలకు గత ప్రభుత్వం అమలు చేసిన 317 జీవోపై తలెత్తిన వివాదం పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన కేబినేట్ సబ్ కమిటీ గురువారం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ అయింది. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి అభిప్రాయాలు సేకరించింది. కమిటీలో సభ్యులుగా ఉన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, డి శ్రీధర్ బాబు నేతల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. పీఆర్‌టీయూ టీఎస్ నేతలు పింగిళ్ల శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్, టీఎస్ యూటీఎఫ్ నేతలు జంగయ్య, చావా రవి, ఎస్‌టీయూ నేతలు పర్వత రెడ్డి, సదానందం గౌడ్, టీపీటీయూ నేతలు మట్ట పల్లి రాధాకృష్ణ, పటోళ్ళ చంద్రశేఖర్ సహా పలు టీఎన్‌జీవో, ఎన్‌జీవో నేతలు పాల్గొన్నారు. 317 జీవో వల్ల కలుగుతున్న ఇబ్బందులు, పరిష్కారాలను సూచించారు.

పలువురు అధికారులకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: పలువురు ఐఏఎస్, నాన్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

- వెయిటింగ్‌లో ఉన్న సీహెచ్.శివలింగయ్యకు ప్రణాళికశాఖ సంయుక్త కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు.
- వరంగల్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకాడే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.
- వెయిటింగ్‌లో ఉన్న బీసీ సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ మల్లయ్య బట్టును తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.
- తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.రాజేశంను యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బదిలీ చేశారు.
- వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా పోస్టింగ్ ఇచ్చారు.

భట్టి విక్రమార్కకు ఓఎస్డీగా సురేందర్‌రెడ్డి

టీఎస్ ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్/సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్ ఎం.సురేందర్‌రెడ్డిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు ఓఎస్డీగా ప్రభుత్వం నియమించింది. ఆయన ఆయిల్‌ఫెడ్ ఎండీగా సైతం అదనపు బాధ్యతల్లో కొనసాగాలని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు వచ్చిన కొద్దిసేపటికే ఉద్యానవన శాఖ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డికి టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో అదనపు బాధ్యతల నుంచి సురేందర్‌రెడ్డిని ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

ఎవడైతే, తన ముఖాన్ని అల్లాహ్‌కు సమర్పించుకొని సజ్జనుడై ఉంటాడో, అలాంటివాడు నిస్సందేహంగా దృఢమైన ఆధారాన్ని పట్టుకున్నవాడే! సకల వ్యవహారాల ముగింపు (తీర్పు) అల్లా వద్దనే ఉంది.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 15 మార్చి 2024

ఈసీలో కొత్త నీరు!

ఎన్నికల నోటిఫికేషన్ల విడుదల సమయాల్లో మాత్రమే వినబడే ఎన్నికల సంఘం చాన్నాళ్లుగా తరచు వార్తల్లోకెక్కుతోంది. అక్కడ కమిషనర్ల ప్రవేశమూ, నిష్క్రమణా కూడా సంచలనాలుగా, వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈ నెల 9న ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామా చేశాక ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. తాజాగా ఇద్దరు మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూలను ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ గురువారం ప్రకటించింది. తనకు 212 పేర్లతో బుధవారం రాత్రే జాబితా పంపారని, తెల్లారేలోగా అంతమందిని జల్లెడపట్టి వారిలో ఇద్దరిని ఎంపిక చేయటం సాధ్యమేనా అని కమిటీలోని విపక్ష నేత అధీర్ రంజన్ చౌధురి ప్రశ్నించారు. ఆ సంగతలావుంచి రేపో మాపో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతున్న దశలో ఈ ఎంపిక వుండదని, ఏకసభ్య సంఘం చేతులమీదుగా అంతా ముగుస్తుందని చాలామంది అనుకున్నారు. కానీ రాజు తల్చుకుంటే కానిదంటూ ఏముంటుంది? నిజానికి ఎన్నికల సంఘం 90వ దశకం వరకూ ఏకసభ్య సంఘంగానే వుండేది. 1987లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో జైల్‌సింగ్‌కు రెండోసారి అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రియను సవరించాలన్న నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రయత్నానికి అప్పటి ఎన్నికల కమిషనర్ ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి అడ్డుపుల్ల వేయటంతో ఆగ్రహించి ఆ సంఘాన్ని త్రిసభ్య సంఘం చేయాలని కేంద్రం భావించింది. అయితే అనంతర కాలంలో వీపీ సింగ్ ప్రభుత్వం దాన్ని బుట్టదాఖలా చేసింది. 1990లో నాటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ దూకుడును తట్టుకోలేకపోయిన నాటి పీవీ నరసింహారావు సర్కారు దాన్ని త్రిసభ్యసంఘంగా మార్చింది.

నిర్వాచన్ సదన్‌లో ఏదో జరుగుతోందని తెలిసినా ఎందుకో అర్థంకాని పరిస్థితి గతంలో లేదు. ఏదైనా సమస్యవుంటే ప్రభుత్వం వివరణనివ్వటం రొటీన్‌గా సాగిపోయేది. లేదంటే మీడియానే కూపీ లాగే ప్రయత్నం చేసేది. ఇప్పుడు వివరణనిచ్చే సంస్కృతీ లేదు... వెలికితీసే మీడియా కూడా లేదు. ఈమధ్యే ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ హఠాత్తుగా తన పదవికి రాజీనామా చేసి నిష్క్రమించారు. వచ్చినప్పటిలాగే వెళ్లేటపుడు కూడా ఎన్నో ప్రశ్నలు మిగిల్చారు. వాస్తవానికి ఆయనకు ఇంకా మూడేళ్ల వ్యవధివుంది. పైగా వచ్చే ఫిబ్రవరిలో రాజీవ్‌కుమార్ రిటైరయ్యాక ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే అవకాశం కూడావుంది. ఈ చాన్సును కమిషనర్లుగా వున్నవారు ఎట్టి పరిస్థితు ల్లోనూ వదులుకోరు. పోనీ గోయెల్‌కు అలా వెళ్లితీరాల్సిన పరిస్థితి ఏర్పడినా సాధారణంగా కేంద్రం సర్దిచెప్పే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే గత నెలలో మరో కమిషనర్ అనూప్ పాండే రిటైరయ్యారు. గోయెల్ కూడా నిష్క్రమిస్తే ఒక్కరే మిగులుతారు. ఒక్కరితో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు బదులు ఆ ప్రక్రియ ముగిసేవరకూ వుండాలని ఆయన్ను కోరితే వేరుగా వుండేది. ఈ హఠాత్తు నిష్క్ర మణలోని ఆంతర్యమేమిటో మూడోకంటికి తెలియదు. ఆయనంతట ఆయన వెళ్లారా, ప్రభుత్వమే అడిగిందా అన్నది అర్థంకాదు. ఆయన నియామకం కూడా వివాదాస్పదమే. 2022 నవంబర్ వరకూ పంజాబ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా వున్న గోయెల్ ఆ నెల 18న స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. రాత్రికి రాత్రి కేంద్ర న్యాయశాఖలో కమిషనర్ ఫైలు చకచకా కదిలి, నలుగురు సభ్యుల జాబితాలో గోయెల్ పేరు చేరిపోయింది. ఆ మర్నాడే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు ఆ ఫైలు వెళ్లటం, గోయెల్‌ను ఎంపిక చేయటం, ఆయన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం ముగిసిపోయాయి. ఈ హైస్పీడ్ '24గంటల వ్యవహారం'పై దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 'ఎందుకింత తొందర?' అంటూ కేంద్రాన్ని ప్రశ్నించింది కూడా. కానీ చివరకు ఆ పిల్‌ను తోసిపుచ్చింది.

ఎన్నికల కమిషనర్‌ల నియామకం అంశంలో కొత్త చట్టం వచ్చేవరకూ ఎంపిక కమిటీలో ప్రధాని, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వుండాలని నిరుడు మార్చిలో అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. రాజ్యాంగంలోని 324(2) అధికరణను ఉల్లంఘించి ప్రధాని ఏకపక్షంగా నియమకాలు చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ఆ తీర్పునిచ్చింది. అనంతరం ఆగస్టులో కేంద్రం తెచ్చిన చట్టంలో ఆ తీర్పు స్ఫూర్తి గాలికెగిరి పోయింది. ప్రధాని, కేంద్రమంత్రి, లోక్‌సభలో విపక్షనేత ఎంపిక కమిటీలో వుంటారని ఆ చట్టం చెబుతోంది. పర్యవసానంగా ఎప్పటిలా పాలకపక్షం అభీష్టమే నెరవేరుతుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో విపక్షం లేకుండానే బిల్లు ఆమోదం పొంది, చట్టం కావటాన్ని సవాలు చేస్తూ దాఖలైన రిట్ ప్రస్తుతం విచారణలో వుంది. ఆ చట్టంకిందనే తాజాగా ఇద్దరు కమిషనర్లను నియమించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ కీలకమైన అంశం. దాన్ని పర్యవేక్షించే ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వుండాలని జనం కోరుకుంటారు. అందుకే కమిషనర్‌ల నియామకం, పదోన్నతులు సాధ్యమైనంత పారదర్శకంగా వుండేందుకు ప్రయత్నించాలి. హఠాత్తు నిష్క్రమణలు, ఆగమనాలు ఎన్నికల సంఘం తటస్థతను ప్రశ్నార్థకం చేస్తాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే దశలో అశోక్ లావాసా 2020లో హఠాత్తుగా రాజీనామా చేయటం, ఇటీవల వున్నట్టుండి గోయెల్ నిష్క్రమించటం, పాలకపక్షందే పైచేయిగావున్న ఎంపిక కమిటీ కొత్త నియామకాలు చేయటం వంటివి సంశయాలకు తావిస్తాయని పాలకులు తెలుసుకోవటం ఉత్తమం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.షష్ఠి తె.3.27 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి సప్తమి, **నక్షత్రం:** కృత్తిక రా.9.20 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.45 నుండి 11.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.33 నుండి 9.21 వరకు, తదుపరి ప.12.33 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** రా.7.11 నుండి 8.40 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మూడు విచిత్ర దారుల కలయిక

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మంచి పంటలు పండే 30 వేల ఎకరాల భూమిలో అమరావతి నగర నిర్మాణమనే లాభసాటి దారి పట్టాడు చంద్రబాబు. అత్తారింటికి దారి వెతికే నటుడేమో పిల్లలకు యూట్యూబ్‌లుండగా బడులెందుకు అని ప్రశ్నల వర్షం మొదలెట్టాడు. దేశ భవిష్యత్తుకు బడిదారి కాదు వెతకాల్సింది, గుడిదారి అని బీజేపీ చెబుతున్నది. ఈ మూడు దారులూ ఎన్నికల కోసం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటయ్యాయి. ఇక జగనేమో విద్యా, వైద్య రంగాలను గ్రామ వ్యవస్థల్లోకి బలంగా తీసుకెళ్లి సంపూర్ణ గ్రామ అభివృద్ధికి పథకాలు రూపొందించే బాట పట్టాడు. ఈ అభివృద్ధి మార్పులో రిస్క్ ఉన్న మాట నిజం. బలమైన కాంట్రాక్ట్ క్లాస్ ప్రభుత్వానికి అడ్డం తిరిగే అవకాశం ఉంటుంది. కానీ ఇది అన్ని కులాల్లోని బీదవారి భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలకు ముందు మూడు విచిత్ర దారుల కలయిక జరిగింది. ఒకటి అమరావతికి దారి. ఆ దారి ఏది, ఏది అని 2019 నుండి చంద్రబాబు వెతుకుతున్నాడు. ఈయన దారి తప్పడమనేది 2014లోనే జరిగింది. రాష్ట్రానికి హైదరాబాదును మించిన రాజధాని తను, తన కొడుకు దశాబ్దాలు పాలించి అతి త్వరలోనే సింగపూర్ లాంటి సిటీ కడుతామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కృష్ణానది ఒడ్డున బంగారు పంటలు పండే 30 వేల ఎకరాల భూమిని రైతుల దగ్గరి నుండి తీసుకున్నారు. అప్పుడు కేంద్రాన్ని పరిపాలిస్తున్న బీజేపీ కూడా ఈ దారి తప్పిన దారిలో ఉంది.

ఈ భూముల్లో మంచి పంటలు పండించుకునే రైతుల్ని అతి త్వరలోనే పెట్టుబడిదారులను చేస్తామని ఆశ పెట్టారు. ఇది విచిత్ర ఆశ. ఆ రైతులెలా నమ్మారోగానీ ఒక చిన్న రాష్ట్రం 30 వేల ఎకరాల్లో ఒక నగరాన్ని నిర్మించి, బాగా పంటలు పండే ఖరీదైన ఎకరా భూమికి బదులు 200 గజాల కమర్షియల్ ల్యాండ్ ఇస్తామంటే ఎలా నమ్ముతారు? ఇక ఆ ఐదేండ్లలో సింగపూర్ నగర నిర్మాతలు రాష్ట్ర బడ్జెట్ నంతా ఇతర దేశాల కాంట్రాక్ట్ బృందాలకు, మంత్రివర్గ కమిటీలు ప్రపంచ పట్టణాల నమూనాల అధ్యయనానికి ఖర్చు చేశారు. నగర నిర్మాణం జరగకముందే దాని చుట్టూ రింగురోడ్లు, ఉద్యానవనాలు తయారౌతున్నట్టు ప్రకటించారు. వీటి నమూనాలు గీయడానికి వందల కోట్లు ఖర్చు చేశారు. చివరికి 2019 ఎన్నికలు వచ్చే నాటికి అమరావతికి దారేది? అనే స్థితిలో చంద్రబాబు ఆయన ప్రయివేటు విద్యా, వైద్య మంత్రివర్గ మిత్ర బృందం ఎన్నికలకు పోయింది. ఘోరంగా ఓడారు. ఇప్పుడు అత్తారింటికి దారేది? అని నిరంతరం వెతికే నాయకుడు లేని నాటకదారితో పొత్తు కుదుర్చుకున్నాడు బాబు.

ఈ అత్తారింటికి నిరంతరం దారి వెతికే నటుడు పిల్లలకు యూట్యూబ్‌లుండగా బడులెందుకు, సినిమాలుండగా రైతులకు వ్యవసాయం పనులెందుకు, వెల్‌ఫేర్ స్కీములెందుకు? అని ప్రజల బతుకుదారులన్నీ మూసెయ్యాలని ఎన్నికల ముందే ప్రశ్నల వర్షం మొదలెట్టాడు. ఈ ఇద్దరు కలిసి తమ విచిత్ర దారుల కలయిక చాలదన్నట్లు మళ్లీ బీజేపీని కూడా తమ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. దేశ భవిష్యత్తుకు బడిదారి కాదు వెతకాల్సింది, గుడిదారి అని చాలా కాలంగా బీజేపీ చెబుతున్నది. వీళ్లంతా కలిసి పోటీ చేసి గెలిస్తే, రాష్ట్ర బడ్జెట్‌ను ఏ దారి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాలనే కొట్లాట మొదలౌతుంది. చంద్రబాబు అమరావతి నిర్మాణం కోసం ఖర్చు పెట్టాలంటాడు. 30 వేల ఎకరాలతో సింగపూర్లు నిర్మించాలి! పవన్ తన కల్యాణం కోసం ఖర్చు చేయాలంటాడు. ఆయనకు అత్తారింటి దారి వెతుకులాట, ఆ దారిలో ఖర్చు చేయడం తప్ప ప్రజల అభివృద్ధి దారి, పిల్లల బడి దారి, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ విద్య, ప్రజల ఆరోగ్యం కోసం హాస్పిటల్స్ వంటివి ఆయన నటనా జీవితంలో



ఎరుగనివి. బీజేపీతో పొత్తు కుదిరింది కనుక అది గుడుల నిర్మాణం, పురాతన సంప్రదాయ చరిత్ర పరిరక్షణ, అభివృద్ధి, విశ్వగురుపీఠ ఏర్పాటు అమెరికాలో చేయాలనే ఆశయ సాధనకు డబ్బు ఖర్చు చెయ్యాలనే డిమాండ్ చేయడం మామూలే.

జగన్ పరిపాలించిన ఐదేండ్లు ఏక కేంద్ర నిర్ణయాలు, ఖర్చు అభివృద్ధి ప్లాన్లు జరిగాయి. అందులో మొదటిది, అసాధ్యమైన 30 వేల ఎకరాల నగర నిర్మాణం ఆపడం; అది ఆపకుండా ప్రజల కోసం ఏ ఖర్చూ చెయ్యలేమని గుర్తించడం. రెండవది విద్యా, వైద్య రంగాలను గ్రామ వ్యవస్థల్లోకి బలంగా తీసుకెళ్లి సంపూర్ణ గ్రామ అభివృద్ధికి పథకాలు రూపొందించటం; భవన నిర్మాణ ఖర్చును పట్టణ నిర్మాణ రంగం నుండి పల్లె నిర్మాణ రంగంలోకి మార్చడం; గ్రామాల్లో బడుల భవనాలు, హాస్పిటళ్లు, సెక్రటేరియట్లు నిర్మించడం; ఈ నిర్మాణ పనులను పెద్ద కాంట్రాక్టర్ల నుండి గ్రామ కాంట్రాక్టర్లకు మార్చడం; అందులో ముఖ్య గ్రామ ప్రజా కమిటీలకు నిర్మాణ బాధ్యతలు ఒప్పజెప్పడం. ఈ అభివృద్ధి మార్పులో రిస్క్ ఉన్న మాట నిజం. బలమైన కాంట్రాక్ట్ క్లాస్ ప్రభుత్వానికి అడ్డం తిరిగే అవకాశం చాలా ఉంటుంది.

ఇంతకంటే పెద్ద రిస్కుతో కూడిన నిర్ణయం ప్రభుత్వ విద్యా విధానాన్ని ఆంగ్ల ప్లస్ తెలుగుతో జతపర్చి ఆధునిక విద్యా టెక్నాలజీని శ్రమ జీవుల పిల్లల బతుకుల్లోకి తీసుకెళ్లటం. ఇది భారతదేశం వంటి ప్రయివేటు విద్యా పెట్టుబడి–దోపిడీ వ్యవస్థ ఏ దేశంలో లేనంత బలంగా ఉన్న చోట ప్రయోగాత్మకంగానైనా చెయ్యడం ఊహాకందనిది. ఇది విద్యా దోపిడీ, ప్రయివేటు పెట్టుబడుల డబ్బు విస్తరించి ఉన్న ఆస్తులు, వాటి చుట్టూ ఉన్న మాఫియాను బాగా బలహీనపర్చే నిర్ణయం. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం అంటేనే ఉగ్రరూపం దాల్చే ప్రయివేటు ఇంగ్లిష్ మీడియం మాఫియాతో నేరుగా తలపడటం. ఈ మాఫియాకు ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు దాసోహం చేసే రోజులివి.

కార్మిక వర్గ రక్షకులమనే కమ్యూనిస్టు పార్టీలు సైతం ప్రయివేటు విద్యా మాఫియాను అంటకాగి బతుకుతూ ఉన్న దశ ఇది. ప్రయివేటు విద్యా రంగం ఈ దేశంలో మిగతా అన్ని పెట్టుబడిదారీ రంగాలను మించిన ఆస్తుల్ని, మంది మార్బలం, బస్సులు, కార్లు, వ్యాన్లు కలిగి ఉండి మారుమూల గ్రామాల్లో కూడా విస్తరించి ఉన్నందువల్ల దీని శక్తి ఉత్పత్తి రంగ పెట్టుబడి కంటే బలమైంది. దీన్ని ఎదిరించలేకనే అన్ని రాజకీయ పార్టీలు, చివరికి కమ్యూనిస్టు పార్టీలతో సహా, ఊకదంపుడు 'మాతృభాష' సిద్ధాంతం ప్రజలకు నేర్పి తమ పార్టీలను, తమ పిల్లల మెదళ్లను ప్రయివేటు విద్యా వ్యవస్థకు తాకట్టు పెట్టాయి. జగన్ దాన్ని బద్దలు కొట్టారు. ఇది మామూలు విషయం కాదు. భారతదేశ జ్ఞాన సంపద రూపు రేఖల్ని మార్చే పోరాటం ఇది.

ప్రజా సంక్షేమ వ్యవస్థను భారతదేశంలో ఏ కేంద్ర ప్రభుత్వం గాని, ఏ రాష్ట్ర ప్రభుత్వంగానీ ఊహించని స్థాయిలో 'మనీ ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో ప్రజా బ్యాంకు ఎకౌంటుల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసింది జగన్ ప్రభుత్వం. ఇటువంటి స్కీములను ఈ మూడు పార్టీల కూటమి కూడా చేస్తామనొచ్చు. కానీ అన్ని సమస్యలకు, ముఖ్యంగా విశాల ప్రజల బీదరికానికి మందు జగన్ ప్రారంభించిన క్వాలిటీ ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వం ఇవ్వడంలో ఉన్నది. దానికి బద్ధ శత్రువు చంద్రబాబు, పచ్చి వ్యతిరేకి బీజేపీ, పిచ్చి వ్యతిరేకి పవన్. వీళ్లంతా ప్రయివేటు ఇంగ్లిష్ మీడియం విద్యా పెట్టుబడిదారీ వర్గాన్ని తమ భుజాల మీద మోస్తారు. వీళ్ళు అధికారంలోకి వస్తే మొదట ఆగిపోయేది ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, కొత్త పాఠశాలల నిర్మాణం. ఇప్పటికే నిర్మించబడ్డ బడులకు మెయింటనెన్స్ డబ్బు ఆపివేత, మిర్రర్ ఇమేజ్ బుక్స్ ప్రింటింగ్ ఆపివేత.

సంక్షేమాలు ఎన్ని చేస్తామని చెప్పినా 30 వేల ఎకరాల్లో సింగపూర్ నిర్మాణం కార్యక్రమం అన్నింటినీ ఆపేస్తుంది. అమరావతి భారీ నగర నిర్మాణ సమస్య ఈ మూడు పార్టీల మెడకు చుట్టుకున్న పెద్ద నాగుపాము. బాబు నిర్మించే పట్టణ పాముకు సరిపోయేన్ని పాలు వీరు పొయ్యకపోతే అది వీరిని కాటేసి చంపేస్తుంది. దానికి గ్రామాలను మాడ్చాలి. ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందు ఒకే ఒక పరిష్కారముంది. అది ఈ ఎన్నికల్లో జగన్‌ని గెలిపించుడు. కనీసం ఇంకో ఐదేండ్లు విద్యా రంగం మార్పులతో ఇప్పుడున్న సంక్షేమ పథకాలను కొనసాగించుకుంటే క్రమంగా ఇటువంటి పథకాలు అవసరం లేని దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవుతుంది. ఈ మూడు దారుల కూటమే వస్తే మళ్లీ అగాధంలో ఆంధ్రప్రదేశ్ పడుతుంది. బాబు భయమంతా గ్రామాల్లోని కూలీ నాలీ చేసుకొని బతికే వారి పిల్లలు మేధావులు, నాయకులు అయితే తన కొడుకు, మనవడు ఏమౌతారనే. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కులాల్లోని బీదవారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నేలకు దిగితేనే...



బెంగళూరు గమ్మత్తయిన నగరం. ప్రతి ఒక్కరూ మేఘాల్లోనే ఉంటారు. కానీ ఎవరి దగ్గరా నీళ్లు లేవు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

అభినందనలు



కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా ఎంపికైన సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌కు అభినందనలు. ఇద్దరికీ అద్భుతమైన రికార్డు ఉంది. కఠిన బాధ్యతను నిర్వర్తించడంలో వారికి శుభాకాంక్షలు అందిస్తున్నాను.

– ఎస్.వై. ఖురేషీ, కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

ఉండాల్సిన నియంత్రణ



యూఎస్ టీవీ నెట్‌వర్కులను విదేశీయులు సొంతం చేసుకోవడానికి ఎఫ్‌సీసీ నియంత్రణలు ఉన్నందున రూపర్ట్ మర్డోక్ 1985లో అమెరికా పౌరుడు కావాల్సి వచ్చింది. ఇండియాలో కూడా డిజిటల్ మీడియా సహా వార్తా సంస్థలను విదేశీయులు సొంతం చేసుకోకుండా అలాంటి నియంత్రణలు ఎందుకు లేవు? స్పష్టమైన ప్రమాదం కనబడుతోంది.

– హిందోల్ సేన్‌గుప్తా, కాలమిస్ట్

జరగదు!



నాటో దళాలు, రష్యా నేరుగా తలపడటం గానీ, అణ్వాయుధాలు జారవిడుచుకోవడం గానీ జరగదు. అనవసర సద్దు వలదు.

– వెలీనా త్చకరోవా, భౌగోళిక రాజకీయాల విశ్లేషకురాలు

తప్పని నైపుణ్యం



ఏకకాలంలో మహిళలు అనేక పనులు చేయగలరని ఇటీవల ఒక ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఎత్తిచూపారు. అధికార స్థానాల్లో ఉన్న మనుషులు ఇలాంటి సందేశాన్ని ఇవ్వకూడదు. మహిళలు ఏకకాలంలో అనేక పనులు ఎందుకు చేస్తారంటే, విధి లేక. కానీ అలాంటి పరిస్థితి ఉండకూడదు.

– సాన్యా తల్వార్, సంపాదకురాలు

ఉపవాస దీక్ష



నేను గత 25–30 ఏళ్లుగా, ప్రతి సంవత్సరం రమదాన్ నెలలో ఒకరోజు (సాధారణంగా చివరి శుక్రవారం) ఉపవాసం ఉంటున్నాను. ముస్లిం సోదరసోదరీమణులకు సంఘీభావం చాటడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిమేతరులను కూడా అలాగే చేయాలని అభ్యర్థిస్తున్నాను.

– మార్కండేయ కాట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

కాదనలేని నిజం




కర్ణాటకలోని 20 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 10 మంది అభ్యర్థులను మార్చింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ 28 స్థానాలకు 25 గెలిచింది. అయినప్పటికీ సగం మందిని మార్చడమంటే, వ్యక్తుల కన్నా తమ భావజాలం గెలిపిస్తుందన్న విశ్వాసం కనబడుతోంది. దేశంలోని 62 శాతానికి పైగా జనాలు హిందుత్వను వ్యతిరేకిస్తున్నప్పటికీ, బీజేపీ ఒక పార్టీగా ప్రబలమైనది.

– చేతన్ కుమార్ అహింస, కన్నడ నటుడు

వందరోజుల నూతన శకం

సందర్భం



బోరెడ్డి అయోధ్య రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో నూతన శకం ప్రారంభమైంది. దొరల రాజ్యం అంతరించి తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ప్రసంగించిన రేవంత్ రెడ్డి "మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం" అని లక్షలాది మంది ప్రజల హర్షాధ్వానాల మధ్య ప్రకటించారు. చెప్పిన విధంగానే ప్రజా సేవే ధ్యేయంగా పాలనను ముందుకు నడుపుతున్నారు. ప్రమాణ స్వీకారం చేసింది మొదలు ముఖ్యమంత్రి పాలనను పరుగులు పెట్టించడం మొదలు పెట్టారు. గత డిసెంబర్ 7న కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఎన్నికల్లో ప్రధానంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లోగా పూర్తి చేయటం కోసం ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేసింది. అనుకున్న విధంగానే ఆరు గ్యారంటీలను నెరవేర్చి ప్రతిపక్షాలకు షాక్ ఇచ్చింది.

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి, ఖాళీ ఖజానాను కాంగ్రెస్‌కు అప్పజెప్పి వెళ్లిపోయింది. 'మిగులు' రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. విద్యుత్ సంస్థలను రూ. 81వేల కోట్ల అప్పులలో ముంచారు. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పగిలిపోయి నిరర్థక ప్రాజెక్టుగా మారి ప్రజలకు గుదిబండగా మారింది. దీనితో 6 గ్యారంటీల అమలుకు నిధులు సమకూర్చుకోవడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా మారింది. కానీ ఏ పరిస్థితినైనా ఎదుర్కోగల ఆత్మస్థైర్యం, పట్టుదల ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సవాళ్లను, ప్రతికూలతను అధిగమించారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే 6 గ్యారంటీల అమలుకు ఉద్దేశించిన ఫైలుపై ఆయన సంతకం చేశారు. ప్రగతిభవన్ పేరును 'జ్యోతిరావు పూలే ప్రజా భవన్'గా మార్చారు. అక్కడ ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు తీసుకోవడంతో వేలాదిమంది ప్రజలు ఈ కార్యక్రమానికి పోటెత్తారు.



ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన రెండవ రోజే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. అదేవిధంగా వైద్య ఆరోగ్య చికిత్సల పరిమితిని రూ. 10 లక్షలకు పెంచే హామీని రెండవ రోజే ప్రభుత్వం అమలు చేసింది. మిగిలిన గ్యారంటీల అమలుకు ప్రజల నుంచి గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. రూ. 500లకే సిలిండర్ గ్యాస్ ఇవ్వడం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న లబ్ధి దారులకు ఉచిత విద్యుత్ అందజేసే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించింది. అదే విధంగా నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజక వర్గాలకు నాలుగున్నర లక్షల ఇళ్లను కేటాయించింది. 'మహాలక్ష్మి స్వశక్తి' కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించటంతో 6 గ్యారంటీల అమలును 100 రోజుల్లో అమలు చేసి చూపించటంతో ప్రతిపక్షాలకు జీర్ణం అయితలేదు.

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించింది రేవంత్ ప్రభుత్వం. అదేవిధంగా 100 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. తెలంగాణ ఉద్యమ నాయకుడు కోదండరాంను ఎమ్మెల్సీని చేసి గౌరవించింది. బీసీ కులగణనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్ సమస్యలను పరిష్కరించటం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం 9 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 45 శాతం దరఖాస్తులను పరిష్కరించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షానికి తమ గళం వినిపించే అవకాశం గత పదేళ్లలో లభించలేదు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపితే ప్రతిపక్షం మొత్తాన్ని అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ చేశారు. కానీ, గత ప్రభుత్వానికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని నడిపించింది. ఈ వంద రోజుల్లో రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించినా ఒక్క సభ్యుడిని కూడా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయలేదు. వారికి మాట్లాడే అవకాశం కల్పించింది.

ఇన్నాళ్లు అభివృద్ధి మాటున బీఆర్‌ఎస్ నాయకులు విచ్చలవిడిగా సాగించిన అవినీతి కొత్త ప్రభుత్వం రాకతో బట్టబయలు అవుతున్నది. బీఆర్‌ఎస్ నాయకులు సాగించిన పాపాల పుట్టలు పగులుతున్నాయి. బీఆర్‌ఎస్ నాయకులు విచ్చలవిడిగా సాగించిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. మిషన్ భగీరథ, కాళేశ్వరం, ధరణి, గొర్రెల పంపిణీ, విద్యుత్ కొనుగోళ్లు, భూకబ్జాలు, ఔటర్ రింగ్‌రోడ్డు, టానిక్ గ్రూపు లిక్కర్, ఫోన్ ట్యాపింగ్ వంటి విషయాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ప్రతి పక్షంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగించిన అవినీతిపై ఆరోపణలు చేయటమే కాదు అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కుంగుబాటుపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పినాకినీ చంద్రఘోష్‌నూ, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లలో అవినీతి, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుపై జరిగిన అవినీతిపై దర్యాప్తునకు జస్టిస్ నర్సింహారెడ్డిని ప్రభుత్వం నియమించింది.

తమ అంచనాలకు తగినట్లుగా పాలనను సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ...100 రోజుల్లో 100 మార్కులు వేస్తున్నారు. గర్వం, అహంకారం దరి చేరకుండా ప్రజలు తనకు అప్పగించింది అతి పెద్ద బాధ్యతగా భావించి, ఇంటి పెద్ద కొడుకు మాదిరిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారు.

వ్యాసకర్త సీపీఆర్‌ఓ (తెలంగాణ ముఖ్యమంత్రి)

పుష్పం– ఫలం

"పూర్వం ఒక అమాయకుడు ఒక మామిడితోట కొనుక్కొన్నాడు. దాని చుట్టూ బోలెడు మోదుగు చెట్లు ('అగ్నిపూల' చెట్లు– పలాశ చెట్లు అని కూడా అంటారు) ఉన్నాయి. వసంతం రాగానే మామిడి చెట్లు పూతపట్టాయి. కానీ అంత పెద్ద చెట్టుకు ఎంతో చిన్న పూలు కనిపించేసరికి, 'అమాయకుడు' నిరుత్సాహపడిపోయాడు. పూలు చిన్నగా ఉంటే పండ్లూ చిన్నవే కాస్తాయి కదా అని దిగులు పడ్డాడు.



జ్యోతిర్మయం

అదే సమయంలో భళ్ళున పూసిన మోదుగు పూలు పెద్దగా, ఎర్రగా, ఆకర్షణీయంగా కనిపించాయి. పూలు ఇంత పెద్దగా ఉంటే, కాయలు మరింత పెద్దవిగా, రుచిగా ఉంటాయని అంచనా కట్టాడు 'అమాయకుడు'. వెంటనే మామిడి చెట్లన్నీ నరికేసి, మోదుగ చెట్లకు నీళ్ళు పట్టి, ఎరువూ గట్రా వేసి పోషించాడు. మోదుగ చెట్టు ఫలించినప్పుడు రుచీపచీ లేని అతి చిన్న మోదుగు కాయలు చూసి, 'అయ్యో, నేనెంతటి మూర్ఖపు పని చేశాను!' అని అప్పుడు దుఃఖించాడు.

నేను కూడా అలా మామిడి చెట్టును నరికి మోదుగ చెట్టును పోషించిన మూర్ఖుడినే. సోహం ఆమ్ర వనం ఛిత్వా / పలాశాన్ చ న్యషేచయమ్! / రామం ఫలాగమే త్యక్త్వా,/ పశ్చాత్ శోచామి దుర్మతిః!! (వాల్మీకి, అయోధ్యా 63–10) 'చేతికి అందివచ్చిన రాముడిని దుర్మతినై వదులుకొని, తరవాత ఇలా శోకిస్తున్నాను!" రాముడు వనవాసానికి వెళ్ళాక, తన పట్టమహిషి కౌసల్య ముందు ఇలా వాపోతున్నవాడు దశరథ మహారాజు. 'ఒక పని చేసేటప్పుడు దీని ఫలం ఎలా ఉంటుంది, అది తియ్యని పుణ్యఫలమా, లేక, చేదయిన పాపఫలమా, ఈ కర్మలో ఏమి దోషం ఉంది, ఎంతటి దోషం ఉంది అన్న గమనిక అవసరం. అది నాకు లేకపోయింది' అని పశ్చాత్తాప పడుతున్నాడు.

చిన్నతనంలో ఆయన వేటకు వెళ్ళాడు. రాత్రి సరయూనదిలో నీళ్ళు తాగేందుకు వచ్చే అడవిజంతువులను చీకటిలో వేటాడి చంపాలన్న చాపల్యం వల్ల, తొందరపాటుతో అంధకారంలో సంధించిన బాణం శ్రావణ కుమారుడి ప్రాణం తీసింది. అలాగే మరో సందర్భంలో, తనను ఎప్పుడయినా సరే, ఏదయినా సరే వరంగా అడిగే అధికారాన్ని చిన్న భార్య కైకకు అనాలోచితంగా కట్టబెట్టాడు. ఆ దూకుడుతనం వల్ల ఆయన చాలా చేదుఫలాన్ని రుచి చూడవలసి వచ్చింది.

– ఎం. మారుతి శాస్త్రి

ఆ బాలుడి గొంతు పలికింది

ఏపీ సీఎం వైఎస్ జగన్ చొరవతో తొమ్మిదేళ్ల బాలుడికి శస్త్రచికిత్స



బాలుడు మహ్మద్‌తో కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ గురు ఎన్ రెడ్డి, తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్/అమరావతి: ప్రమాదవశాత్తు స్వరపేటిక పూర్తిగా చితికిపోయి క్లిష్టపరిస్థితుల్లో చికిత్స కోసం ఎదురు చూస్తున్న తొమ్మిదేళ్ల బాలుడికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసాతో పునర్జన్మ లభించింది. మాట కోల్పోయిన అతడు ఇప్పుడు గలగలా మాట్లాడగలుగుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నకరికల్లుకు చెందిన షేక్ ఖాజాబీ, బాజీ దంపతులకు తొమ్మిదేళ్ల కొడుకు మహ్మద్ ఉన్నాడు. ఫిబ్రవరి 29న స్కూల్‌కి వెళ్లిన బాలుడు తోటి పిల్లలతో ఆడుకుంటూ ఇనుప చువ్వ మీద జారిపడ్డాడు. ఆ చువ్వ గొంతులో బలంగా గుచ్చుకోవడంతో అతడి శ్వాసనాళం, స్వరపేటిక పూర్తిగా చితికిపోయాయి. దీంతో మాట నిలిచిపోయి, శ్వాస పీల్చుకోవడానికి సైతం ఇబ్బందిగా మారింది. బాలుడిని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం వెంటిలేటర్ సహాయంతో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. మహ్మద్‌ను పరిశీలించిన నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు శ్వాస తీసుకోవడానికి తాత్కాలికంగా ఒక కృత్రిమ పైప్ అమర్చి, మరింత మెరుగైన వైద్యం కోసం కాంటినెంటల్ హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు.

అరుదైన శస్త్రచికిత్సతో..

కాంటినెంటల్ హాస్పిటల్స్ లేరింగాలజిస్ట్ స్పెషలిస్ట్ దుష్యంత్ బృందం మహ్మద్‌ను పరిశీలించి అతడికి అతికష్టమైన, అరుదైన లెరింగోట్రికెల్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయాలని నిర్ధారించారు. లెరింగాలజీలో ఫెలోషిప్ చేసిన నిష్ణాతులైన వైద్యులు మాత్రమే ఈ సర్జరీ చేయగలరని, ఏ మాత్రం తేడా వచ్చిన తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకు రూ.6 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. అంత ఖర్చు భరించే స్తోమత లేని ఆ పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. సోషల్ మీడియా ద్వారా బాలుడి ఆరోగ్య స్థితిని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతడి ఆరోగ్యాన్ని చక్కదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సీఎంవో అధికారులు కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు ఫోన్‌చేసి.. బాలుడికి చికిత్సతోపాటు ఆరోగ్యం చక్కబడటానికయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. వెంటనే వైద్యులు బాలుడికి విజయవంతంగా శస్త్రచికిత్స చేసి శ్వాసనాళాన్ని పునరుద్ధరించి.. క్లిష్టమైన స్వరపేటికను బాగు చేశారు. దీంతో బాలుడికి మాటొచ్చింది. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు ఖాజాబీ, బాజీ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమ కుటుంబాన్ని సీఎం జగన్ ఆదుకున్నారని, ఉచితంగా చికిత్స చేయించారని కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ సాయం చేయకపోతే తమబిడ్డ జీవితాంతం మూగవాడిగా ఉండేవాడని పేర్కొన్నారు.

గొర్రెల కేసులో మరో ఇద్దరు అరెస్టు

- జేడీ అంజిలప్ప, ఏడీ కృష్ణయ్యను అరెస్టు చేసిన ఏసీబీ
- తప్పుడు పత్రాలు కలెక్టర్లకు పంపి, నిధులు మంజూరు చేయించిన నిందితులు



అంజిలప్ప



కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: గొర్రెల కొనుగోలు పథకం నిధుల గోల్‌మాల్ కుంభకోణంలో ఏసీబీ అధికారులు మరో ఇద్దరు పశుసంవర్ధకశాఖ అధికారులను అరెస్టు చేశారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డా.అంజిలప్ప, పశుసంవర్ధక శాఖ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డా.పి.కృష్ణయ్యను అరెస్టు చేసినట్టు ఏసీబీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గొర్రెలు కొనకుండానే ఈ ఇద్దరు అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కలిసి గొర్రెలు విక్రయించిన రైతులు అంటూ నకిలీ రైతుల పేరిట ధ్రువపత్రాలను కలెక్టర్లకు సమర్పించినట్టు వెల్లడించారు. ఇలా నకిలీ రైతులకు కలెక్టర్ల నుంచి డబ్బులు కూడా మంజూరు చేయించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే ఆరుగురు అధికారులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

అంతా అడ్డగోలు వ్యవహారమే..

అరెస్టయిన ఇద్దరు అధికారులు అంజిలప్ప, పి.కృష్ణయ్య గొర్రెల కొనుగోలుకు సంబంధించిన నిబంధనలను పూర్తిగా తుంగలోతొక్కి ప్రైవేటు వ్యక్తుల చేతికి కొనుగోలు వ్యవహారాన్ని అప్పగించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. గొర్రెల కొనుగోలుకు వెళ్లిన అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు సైతం ప్రైవేటు వ్యక్తులు చెప్పినట్టు వినాలని సదరు అధికారులు ఆదేశించినట్టు గుర్తించారు. గొర్రెలు విక్రయించేది ఎవరు అన్నది చూడకుండానే ప్రైవేటు వ్యక్తులు చెప్పినట్టుగా గొర్రెలను కొనడం, ప్రభుత్వ అధికారులు నింపాల్సిన ధ్రువపత్రాలను సైతం ప్రైవేటు వ్యక్తులే నింపడం, గొర్రెలను కొనుగోలు చేయకుండానే నకిలీ పత్రాలు సృష్టించి వాటిని పశుసంవర్ధకశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం..ఇలా నిందితులిద్దరు అడ్డగోలుగా వ్యవహరించినట్టు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. మొత్తం రూ.2.10 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టడంలో ఈ ఇద్దరు అధికారులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని తెలిపారు.

267.34 కోట్ల వడ్డీలేని రుణం విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పథకం కింద ప్రభుత్వం రూ.267.34 కోట్లు విడుదల చేసింది. దీంతో 2023 డిసెంబర్ నుంచి 2024 మార్చి త్రైమాసికానికి సంబంధించిన వడ్డీ రాయితీ విడుదలయ్యింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని మొత్తం 32 జిల్లాల్లో 2,53,864 మహిళా సంఘాలకు లబ్ధి చేకూరనుంది. ఈ మొత్తాన్ని నేరుగా ప్రభుత్వ ఖాతా నుంచి స్వయం సహాయక సంఘ ఖాతాల్లో జమ చేయనున్నారు.

జీవో 317తో పోయిన
మా స్థానికతను కాపాడండి

మంత్రి దామోదర రాజనర్సింహకు టీపీఎస్‌ఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం జారీచేసిన జీవో 317 కారణంగా స్థానికత కోల్పోయి జిల్లా /జోన్/మల్టీజోన్లు దాటిన పంచాయతీ కార్యదర్శులను స్థానికత ప్రకారం మళ్లీ వారిని సొంత జిల్లా/జోన్/మల్టీజోన్లలో కేటాయించాలని వైద్యశాఖ మంత్రి, కేబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వం సెక్రటరీలను జిల్లా/జోన్/మల్టీజోన్లు దాటి కేటాయింపులు జరిపిందని అసోసియేషన్ మంత్రి దృష్టికి తీసుకొచ్చింది. ఈ విషయాన్ని గతంలోని సర్కార్ దృష్టికి తీసుకొచ్చినా న్యాయం జరగలేదని పేర్కొంది. జీవో 317 ద్వారా జరిగిన కేటాయింపుల్లో పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్ (1,2,3,4)లకు జరిగిన అన్యాయాన్ని కూడా సరిదిద్దాలని కోరింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో మంత్రికి టీపీఎస్‌ఏ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఇ. శ్రీనివాస్, కోశాధికారి పండరీనాథ్ ఇతరనాయకులు వినతిపత్రం సమర్పించారు.


బీఆర్‌ఎస్ నేత కన్నారావుపై కబ్జా కేసు

- రూ. 2.30 కోట్ల డీల్ కుదుర్చుకున్న బీఆర్‌ఎస్ నేత
- ఆయనతో పాటు 35 మందిపై కేసు నమోదు
- ఆదిభట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి

ఇబ్రహీంపట్నం రూరల్: భూ కబ్జా వ్యవహారంలో బీఆర్‌ఎస్ నేత కల్వకుంట్ల కన్నారావుపై కేసు నమోదైన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నా యి.తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ 32 సర్వే నంబరులో 2.10 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన జక్కిడి సురేందర్‌రెడ్డి 2013లో చావ సురేశ్‌కి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఏజీపీఏ) చేశాడు. అనంతరం సురేశ్ సేల్ డీడ్ చేసుకుని 2020లో ఓఎస్ఆర్ ప్రాజెక్టు సంస్థకు విక్రయించాడు. అనంతరం 2023లో ఓఎస్ఆర్ వారు ఎస్ఎస్ఏఎస్ ఎంటర్ ప్రైజెస్‌కు రిజిస్ట్రేషన్ చేయగా..హద్దులు ఏర్పాటు చేసుకుని, ప్రహారీ నిర్మించారు. ఇదిలా ఉండగా జక్కిడి సురేందర్‌రెడ్డి, అతని అనుచరులు కలిసి అక్రమంగా భూమిలోకి ప్రవేశించి తమ భూమిని కొనుగోలు చేసింది చావ సురేశ్ అని తెలిపారు. తమ భూమి కబ్జా అయిందని, తమ భూమిని తిరిగి అప్పగిస్తే రూ.2.30 కోట్లు ఇస్తామని బీఆర్‌ఎస్ నేత కన్నారావుతో సురేందర్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఈ నెల 3న కన్నారావు అనుచరులు సదరు భూమిలోకి ప్రవేశించి అక్కడ ఉన్న గోడలు ధ్వంసం చేయడంతోపాటు కంటైనర్‌ను పక్కకు తొలగించి కొంత సామగ్రిని దగ్ధం చేశారు. ఓఎస్ఆర్ సంస్థ యజమాని బండోజు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీసులు కన్నారావుతోపాటు 35 మందిపై కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న కన్నారావును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

'ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించొద్దు'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి శబ్ద కాలుష్యం, ఇతర అసౌకర్యాలతో చుట్టుపక్కల ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించవద్దని ఫంక్షన్‌హాళ్లు, కన్వెన్షన్ సెంటర్ల యజమానులను హైకోర్టు ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించింది. బోయిన్‌పల్లిలోని బాంటియా గార్డెన్, సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ హైకోర్టుకు ఓ మిలటరీ అధికారి లేఖ రాశారు. ఓ సమయం అంటూ లేకుండా రాత్రీపగలూ పరిమితికి మించి పెద్దఎత్తున శబ్దంతో స్థానికులు నిద్ర లేకుండా గడపాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.



ఐదోసారి అధ్యక్ష పీఠం దిశగా

- రష్యా అధ్యక్ష ఎన్నికల్లో హాట్‌ఫేవరెట్‌గా వ్లాదిమిర్ పుతిన్
- నేటి నుంచి మూడ్రోజులపాటు కొనసాగనున్న అధ్యక్ష ఎన్నికల పోలింగ్
- దాదాపు ఖాయమైన గెలుపుతో 2030దాకా పుతిన్ పాలనే

వ్లాదిమిర్ పుతిన్ పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే దేశం రష్యా. చాలా సంవత్సరాలుగా పుతిన్ ఏలుబడిలో ఉన్న రష్యాలో ఈరోజు నుంచి అధ్యక్ష ఎన్నికలు మొదలుకాబోతున్నాయి. గతంలో ఒక్క రోజులో పోలింగ్ పూర్తయ్యేది. దేశ చరిత్రలో తొలిసారిగా వరసగా మూడు రోజులపాటు అంటే 15, 16, 17 తేదీల్లో పోలింగ్‌కు రష్యా సిద్ధమైంది. ఉక్రెయిన్‌పై దురాక్రమణతో ప్రస్తుతం తన అధీనంలో ఉన్న నాలుగు ఉక్రెయిన్ రీజియన్‌ల లోనూ ఈ ఎన్నిక క్రతువు కొనసాగనుంది. ప్రస్తుత పదవీకాలంతో కలిపి పుతిన్ ఇప్పటికే నాలుగు సార్లు(2000, 2004, 2012, 2018)లో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. 2008లో ప్రధానిగానూ సేవలందించారు. మానవహక్కుల గొంతుక, విపక్ష నేత అలెక్సీ నావల్నీ గత నెల మారుమూల కారాగారంలో అనుమానాస్పద స్థితిలో చనిపోవడంతో ఈసారి పుతిన్ వ్యతిరేక ఓటింగ్ పెరుగుతుందా? లేదా అనేది వేచిచూడాలి.

పుతిన్ హవా..

అధ్యక్ష రేసులో పుతిన్ విజయబావుటా ఎగరేస్తారని ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. అయినా సరే పౌర హక్కులను కాలరాస్తూ, నియంత పోకడలతో దేశాన్ని ఏలుతున్న పుతిన్ పాలనకు అంతం పలుకుతామంటూ విపక్ష పార్టీల నేతలు ప్రతినబూనారు. ఎన్నికల రణరంగంలో పుతిన్‌ను ఓడిస్తామంటూ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా(ఎల్‌డీపీఆర్) తరఫున అభ్యర్థిగా లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ అభ్యర్థిగా వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థిగా నికోలే ఖరిటోనోవ్‌లు ఎన్నికల బరిలో నిలిచారు. దేశ ఓటర్లలో పుతిన్‌కు 75 శాతం మద్దతు ఉందని, ఈ ముగ్గురు తలో 5 శాతం ఓట్లతో సరిపెట్టుకుంటారని ముందస్తు పోలింగ్ అంచనాలు విశ్లేషిస్తున్నాయి.

కుంభస్థలిని కొట్టగలరా ?



నికోలే | స్లట్‌స్కీ | దవాన్‌కోవ్

పోటీలో ఏ అభ్యర్థి నిలబడాలి అనేది దాదాపు దేశ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) నిర్ణయిస్తుంది. ఎల్‌డీపీఆర్ నేత లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ నేత వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ నేత నికోలే ఖరిటోనోవ్‌లు ఈసారి బరిలో దిగారు. పుతిన్‌ను వీరంతా విమర్శిస్తున్నప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీరు వ్యతిరేకించలేదు. యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక విపక్ష నేత బోరిస్ నదేహ్‌దిన్‌ను పోటీకి నిలబడకుండా సీఈసీ అడ్డుకుంది. అభ్యర్థిత్వానికి సరిపడా సంతకాలను సేకరించలేకపోయారని ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కించింది. మరో అభ్యర్థి యెకటేరియా దుంట్సోవానూ సీఈసీ ఇలాగే పక్కకునెట్టింది. పుతిన్‌ను ప్రధానంగా విమర్శించే విపక్ష నేత అలెక్సీ నావల్నీ ఇప్పుడు ప్రాణాలతో లేడు. స్లట్‌స్కీ, దవాన్‌కోవ్, ఖరిటోనోవ్‌లు దేశ సమైక్యత విషయానికొచ్చేసరికి పుతిన్‌కు పరోక్షంగా మద్దతు పలుకుతారు. ఈ లెక్కన దేశ సమైక్యత జెండా పట్టిన పుతిన్‌కే ఎక్కువ ఓట్లు పడతాయి. దీంతో వీళ్లు పుతిన్‌ను ఓడించడం అనేది అసంభవం.

పోలింగ్ ఎక్కడెక్కడ?

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం కంటే ముందే మొదలుపెట్టారు. ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాలపై పుతిన్ ప్రధానంగా దృష్టిపెట్టారు. రష్యా భూభాగంలో ఎలాగూ మెజారిటీ సాధిస్తానని పుతిన్ బలంగా నమ్ముతున్నారు. ఉక్రెయిన్ ప్రాంతాల్లో గెలిచి తమది అధర్మ యుద్ధం కాదని ప్రపంచానికి చాటి చెప్పాలని పుతిన్ యోచిస్తున్నారు. ఇక్కడ స్థానిక ఎన్నికలు, రెఫరెండమ్‌లు ఇప్పటికే నిర్వహించారు. అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని ప్రపంచదేశాలు మొత్తుకున్నా పుతిన్ పట్టించుకోవట్లేదు. ఈసారి 11.42 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలుస్తోంది. అర్హులైన ఓటర్లు విదేశాల్లో ఉన్నా సరే ఓటేయొచ్చు. మార్చి 19 కల్లా తొలి దఫా ఫలితాలు వెల్లడి కావచ్చు. తుది ఫలితాలు తెలియాలంటే మార్చి 29వ తేదీకా ఆగాల్సిందే. 2018 గత అధ్యక్ష ఎన్నికల్లో 68 శాతం పోలింగ్ నమోదైంది.

ఇంకెన్నాళ్లు పుతిన్ పాలిస్తారు?

మరో రెండు పర్యాయాలు దేశ అధ్యక్షుడిగా కొనసాగేందుకు అనువుగా చట్టం చేసి 2021లో పుతిన్ దానిపై సంతకం చేశారు. ఈసారి గెలిచి, 2030లోనూ గెలిస్తే 2036దాకా పుతిన్ దేశాధ్యక్షుడిగా కొనసాగుతారు. రష్యా పాలకుడు జోసెఫ్ స్టాలిన్ తర్వాత అత్యంత ఎక్కువకాలం దేశాన్ని పాలించిన నేతగా పుతిన్ పేరు ఇప్పటికే చరిత్రకెక్కింది.

పుతిన్‌కు నిజంగా అంతటి ఫాలోయింగ్ ఉందా?

రష్యా పౌరులు ఆంక్షల చట్రం, నిఘా నీడలో జీవిస్తారని పశ్చిమదేశాలు తరచూ ఆరోపిస్తుంటాయి. దీంతో పుతిన్‌ను ఇష్టపడే ఎన్నుకుంటున్నారా లేదంటే మరో ప్రత్యామ్నాయం లేక పుతిన్‌కు జై కొడుతున్నారా అనేది ఇతమిద్ధంగా ఎవరికీ తెలీదు. పుతిన్ పాపులారిటీ 80 శాతాన్ని దాటేసిందని అక్కడి ప్రభుత్వేతర ఎన్నికల మేథో సంస్థ 'ది లెవడా సెంటర్' ఇటీవల ప్రకటించింది. అయితే 2023 చివరి నుంచి దేశవ్యాప్తంగా పెరిగిన ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరవరలు ఎగిసిన నేపథ్యంలో పుతిన్ పాలనపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరిగాయని సంస్థ విశ్లేషించడం గమనార్హం. తనను వ్యతిరేకించే వాళ్లను పుతిన్ అస్సలు సహించలేడని పుతిన్‌కు గతంలో ప్రసంగాలు రాసి ఇచ్చిన అబ్బాస్ గలియమోవ్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్, జ్ఞానేశ

న్యూఢిల్లీ: నూతన ఎలక్షన్ కమిషనర్లుగా సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేశ్ కుమార్‌లను కేంద్రం నియమించింది. వీరి నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం కేంద్ర న్యాయ శాఖ విడుదలచేసింది. అంతకుముందు 212 పేర్లను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి మోదీ నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్‌కు పంపించింది. కాగా, వీరి నియామక విధానాన్ని సంబంధిత సెలక్షన్ ప్యానెల్‌లో సభ్యుడైన కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి తప్పుబట్టారు. '' ఈ పేర్లను పరిశీలించాలంటూ 212 మంది పేర్ల జాబితాను గత రాత్రి నాకు ఇచ్చారు. తెల్లారితే సెలక్షన్ ప్యానెల్ చైర్మన్ మోదీ అధ్యక్షతన భేటీ ఉంది. రాత్రి ఇచ్చి మధ్యాహ్నంకల్లా 212 మందిలో ఎలక్షన్ కమిషనర్‌గా అర్హత ఉన్న వ్యక్తిని ఎంపికచేయడం మానవమాత్రులకు సాధ్యమా? బుధవారం ప్యానెల్ భేటీ జరగడానికి కేవలం 10 నిమిషాల ముందు తుది జాబితా అంటూ ఆరు పేర్లున్న లిస్ట్ ఇచ్చారు. ఈ తుది జాబితా నుంచి సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌ల పేర్లను ప్యానెల్‌లోని మెజారిటీ సభ్యులు ఖరారుచేశారు. అయితే ఈ ప్రతిపాదిత పేర్లలో ఈ ఇద్దరినే ఎందుకు ఎంపిక చేశారో నాకైతే అర్థంకాలేదు. సుప్రీంకోర్టు గత తీర్పు ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) ఈ ఎంపిక కమిటీలో ఉంటే బాగుండేది' అని అధీర్ అభిప్రాయపడ్డారు. ఈ ప్యానెల్‌లో మోదీ, అధీర్‌తోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సభ్యులుగా ఉన్నారు. ఎలక్షన్ కమిషనర్ అనూప్‌చంద్ర పాండే గత నెల 14వ తేదీన రిటైర్ కావడం, మరో ఎలక్షన్ కమిషనర్ అరుణ్ గోయెల్ హఠాత్తుగా రాజీనామా చేయడంతో ఎన్నికల సంఘంలో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి.

కేంద్రం నోటిఫికేషన్

ఇద్దరూ 1988 బ్యాచ్ అధికారులే

ఎలక్షన్ కమిషనర్‌లుగా ఎంపికైన సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌లు 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు. సుఖ్‌బీర్ ఉత్తరాఖండ్ క్యాడర్ అధికారి కాగా, జ్ఞానేశ్ కేరళ క్యాడెర్ అధికారి. సుఖ్‌బీర్ గతంలో ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. అఖిలభారత సర్వీస్‌లోకి రాకముందు సుఖ్‌బీర్ అమృత్‌సర్‌లో ఎంబీబీఎస్ చదివారు. జ్ఞానేశ్ గతంలో కేంద్రంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా చేశారు. అమిత్ షా మంత్రిగా ఉన్న సహకార శాఖలోనూ కార్యదర్శిగా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదాను కల్పించిన ఆర్టికల్ 370ని రద్దుచేయడంలో జ్ఞానేశ్ హోం శాఖలో పని చేస్తూ కీలకపాత్ర పోషించారు. ఐఐటీ(కాన్పూర్) పట్టభద్రుడైన జ్ఞానేశ్ 2014లో ఢిల్లీలో కేరళ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్నారు. నూతన ఎలక్షన్ కమిషనర్లను ఎంపికచేసేందుకు సీజేఐ, ప్రధాని, లోక్‌సభలో విపక్షనేతలతో సెలక్షన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు వెలువరిచింది. దీనికి అనుగుణంగా కేంద్రం చట్టం చేసింది. కానీ సీజేఐకి బదులు కేంద్ర మంత్రికి ప్యానెల్‌లో స్థానం కల్పించింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం కోర్టు విచారణ జరగనుంది.



జ్ఞానేశ్ కుమార్ | సుఖ్‌బీర్ సంధూ

రెండు దశల్లో 'జమిలి' ఎన్నికలు

- లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి..
- ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థలకు..
- కోవింద్ కమిటీ సిఫార్సులు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు నివేదిక సమర్పించిన కమిటీ

న్యూఢిల్లీ: 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ తన నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు సమర్పించింది. రామ్‌నాథ్ కోవింద్‌తోపాటు కమిటీ సభ్యులైన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ ఎన్.కె.సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కాశ్యప్, లోక్‌సభలో మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మను నివేదిక అందజేశారు. జమిలి ఎన్నికలపై 18,629 పేజీల ఈ నివేదికలో ఉన్నత స్థాయి కమిటీ కీలక సిఫార్సులు చేసింది. రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత లోక్‌సభ, అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత 100 రోజుల్లోగా అన్ని రకాల స్థానిక సంస్థలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది. జమిలి ఎన్నికలతో అభివృద్ధి వేగవంతం అవతుందని, దేశానికి మేలు జరుగుతుందని ఉద్ఘాటించింది. ఈ ఎన్నికల కోసం కోవింద్ కమిటీ రాజ్యాంగానికి మొత్తం 18 సవరణలు సూచించింది.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే....

రామ్‌నాథ్ కోవింద్ కమిటీని 2023 సెప్టెంబర్ 23న కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ 191 రోజులపాటు విస్తృత పరిశోధన సాగించింది. భాగస్వామ్యపక్షాలు, నిపుణులతో సంప్రదింపులు జరిపింది. దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, బెల్జియం తదితర దేశాల్లో అమల్లో ఉన్న జమిలి ఎన్నికల ప్రక్రియలను అధ్యయనం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే కోవింద్ కమిటీ సిఫార్సుల చేసిందని అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ సిఫార్సుల ప్రకారం రాజ్యాంగానికి కనిష్ట సవరణలతో జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చని పేర్కొన్నాయి.

32 పార్టీల మద్దతు

జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను కోవింద్ కమిటీ సేకరించింది. అభిప్రాయం చెప్పాలంటూ 62 పార్టీలకు సూచించగా, 47 పార్టీలు స్పందించాయి. ఇందులో 32 పార్టీలు జమిలికి జైకొట్టాయి. 15 పార్టీలు వ్యతిరేకించాయి. మిగిలిన 15 పార్టీలు స్పందించలేదు. బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఏఐఏడీఎంకే, బిజూ జనతా దళ్, మిజో నేషనల్ ఫ్రంట్, శివసేన, జనతాదళ్(యూ), శిరోమణి అకాలీదళ్ తదితర పార్టీలు మద్దతు ప్రకటించగా, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, నాగా పీపుల్స్ ఫ్రంట్, సమాజ్‌వాదీ పార్టీ వంటివి వ్యతిరేకించాయి.



గురువారం రాష్ట్రపతి ముర్మకు నివేదిక అందజేస్తున్న కోవింద్, చిత్రంలో అమిత్ షా

త్వరలో లా కమిషన్ నివేదిక

ఏకకాలంలో ఎన్నికలపై లా కమిషన్ త్వరలో తన నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. 2029 నుంచి జమిలి ఎన్నికలు ప్రారంభించాని లా కమిషన్ సిఫార్సు చేయబోతున్నట్లు సమాచారం. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని లా కమిషన్ సూచించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కోవింద్ కమిటీ సిఫార్సులు

- లోక్‌సభలో హంగ్, అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలు ఎదురైనప్పుడు మళ్లీ తాజాగా ఎన్నికలు నిర్వహించాలి. కొత్త సభను ఏర్పాటు చేయాలి.
- ఎన్నికలు జరిగి కొత్తగా కొలువుదీరిన లోక్‌సభ ఐదేళ్లు కొనసాగదు. అంతకంటే ముందున్న సభ గడువు ఎన్నాళ్లు మిగిలి ఉంటుందో అప్పటివరకు మాత్రమే కొత్త సభ మనుగడ సాగిస్తుంది.
- రాష్ట్రాల శాసనసభలు లోక్‌సభ కాల వ్యవధి ముగిసేవరకు(ముందుగా రద్దయితే తప్ప) పనిచేస్తాయి.
- జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 83(పార్లమెంట్ కాల వ్యవధి), ఆర్టికల్ 172(శాసనసభ కాల వ్యవధి)కు సవరణ చేయాలి.
- ఆర్టికల్ 83, ఆర్టికల్ 172కు సవరణ చేయడానికి రాష్ట్రాల అమోదం అవసరం లేదు.
- జమిలి ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాల ఎన్నికల సంఘాలతో సంప్రదించి ఒక ఉమ్మడి ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డులు రూపొందించాలి. ఇందుకోసం ఆర్టికల్ 325కి సవరణ చేయాల్సి ఉంటుంది.
- స్థానిక సంస్థలతో ఏకకాలంలో ఎన్నికల కోసం ఆర్టికల్ 324ఏను సవరించాలి.
- ఆర్టికల్ 325, ఆర్టికల్ 324ఏకు సవరణ చేయాలంటే రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతిఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడుతోంది. విలువైన సమయం వృథా అవుతోంది. జమిలి ఎన్నికలతో ఇలాంటి సమస్యలు పరిష్కరించవచ్చు.
- జమిలి ఎన్నికల కోసం ప్రభుత్వం ఒక పటిష్టమైన చట్టబద్ధ యంత్రాంగాన్ని రూపొందించాలి.

18 ఓటీటీలపై నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: అసభ్యకర, అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేసినందుకుగాను 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వాటికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయనున్నట్లు కేంద్రం గురువారం తెలిపింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, వీటికి సంబంధం ఉన్న 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను దేశంలో ఇకపై ప్రజలకు అందుబాటులో ఉండవని పేర్కొంది. తొలగించే 10 యాప్‌లలో ఏడు గూగుల్ ప్లే స్టోర్, 3 యాపిల్ యాప్ స్టోర్‌లో ఉండేవి.

వేటుపడిన 18 ఓటీటీలివే..

డ్రీమ్స్ ఫిలిమ్స్, వూవీ, యెస్మా, అన్‌కట్ అడ్డా, ట్రీఫ్లిక్స్, ఎక్స్‌ప్రైమ్, నియాన్ ఎక్స్ వీఐపీ, బేషరమ్స్, హంటర్స్, రబ్బిట్, ఎక్స్‌ట్రామూడ్, న్యూఫ్లిక్స్, మూడ్ ఎక్స్, మోజోఫ్లిక్స్, హాట్ షాట్స్ వీఐపీ, ఫుగీ, చికూఫ్లిక్స్, ప్రైమ్‌ప్లే వంటి ఓటీటీ సోషల్ మీడియా ఖాతాలను తొలగించారు. తొలగించిన వాటిలో 12 ఫేస్‌బుక్ ఖాతాలు, 17 ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు, 16 ఎక్స్ ఖాతాలు, 12 యూట్యూబ్ ఖాతాలు సోషల్ మీడియా ద్వారా అశ్లీలతను ప్రసారం చేస్తున్నాయి.

సాగురైతుల అభివృద్ధే లక్ష్యం: రాహుల్ గాంధీ

నాసిక్: రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా విపక్షాల 'ఇండియా' కూటమి పనిచేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ ప్రకటించారు. తమ కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే చేపట్టబోయే రైతు సంక్షేమ కార్యక్రమాలను రాహుల్ వివరించారు. గురువారం మహారాష్ట్రలో చాంద్‌వడ్‌లో రైతుర్యాలీలో ప్రసంగించారు. '' రైతన్నల ప్రయోజనాలే మాకు పరమావధి. వ్యవసాయాన్ని జీఎస్‌టీ పరిధి నుంచి తొలగిస్తాం. పంట బీమా పథకంలో సంస్కరణలు తెచ్చి రైతు అనుకూల విధానాలను ప్రవేశపెడతాం' అని అన్నారు.

అవినీతి నిర్మూలనే మా సిద్ధాంతం: మోదీ

న్యూఢిల్లీ: అవినీతి, దుష్పరిపాలన, జాతి వ్యతిరేక విధానాలే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అజెండా అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. అవినీతిని, బుజ్జగింపు రాజకీయాలను నిర్మూలించాలన్నదే తమ సిద్ధాంతమని అని తేల్చిచెప్పారు. ప్రజా సంక్షేమం ద్వారానే దేశ సంక్షేమం సాధ్యమని తాము విశ్వసిస్తున్నామని తెలిపారు. పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి పథకం లబ్ధిదారులతో ప్రధాని మోదీ గురువారం సమావేశమయ్యారు. ఈ పథకంతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని వెల్లడించారు. వీధి వ్యాపారులకు బ్యాంకుల వడ్డీకే తక్కువ రుణ సదుపాయం లభిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటిదాకా 62 లక్షల మందికి రూ.11,000 కోట్లకుపైగా రుణాలు ఇచ్చినట్లు తెలియజేశారు.

ఉద్యమం మరింత ఉధృతం

- కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌లో రైతుసంఘాల తీర్మానం
- ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌కు పోటెత్తిన రైతన్నలు

న్యూఢిల్లీ: రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందుకు ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో గురువారం జరిగిన 'కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్' వేదికైంది. ఈ మహాపంచాయత్‌కు భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చారు. 2021లో ఢిల్లీ సరిహద్దుల వెంట నెలల తరబడి ఉద్యమం, కేంద్రం తలొగ్గి వివాదాస్పద మూడు సాగు చట్టాలను ఉపసంహరించుకున్నాక ఢిల్లీలో జరిగిన అతిపెద్ద రైతు సభ ఇదే కావడం విశేషం. సాగు, ఆహారభద్రత, సాగుభూమి, రైతు జీవనం పరిరక్షణే పరమావధిగా, మోదీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలంటూ చేసిన తీర్మానాన్ని రైతు సంఘాలు ఆమోదించాయి. రైతు సంఘాల ఉమ్మడి వేదిక అయిన సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ఈ భారీసభ జరిగింది. ట్రాక్టర్లు తీసుకురావద్దని, శాంతియుత సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే లోక్‌సభ ఎన్నికల పూర్తయ్యేదాకా తమ ఉద్యమం కొనసాగిస్తామని రైతులు తీర్మానంలో స్పష్టంచేశారు. 'ఈ ఉద్యమం ఆగదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా విస్తరిస్తుంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మాతో చర్చించాల్సిందే' అని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు.



గురువారం ఢిల్లీలో జరిగిన మహాపంచాయత్‌కు భారీగా హాజరైన రైతులు

రాజ్యసభ ఎంపీగా సుధా మూర్తి ప్రమాణం



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ సుధా మూర్తి(73) గురువారం రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హౌస్‌లోని తన చాంబర్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణం చేయించారు. ఆమె కన్నడ భాషలో ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సుధా మూర్తి భర్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తితోపాటు రాజ్యసభలో అధికార పక్ష నేత పీయూష్ గోయెల్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమెను 2006లో పద్మ శ్రీ, 2023లో పద్మ భూషణ్ పురస్కారాలతో గౌరవించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గత వారం కేంద్రం ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసిన విషయం తెలిసిందే.

ఉల్లి ఎగుమతులపై జూన్ దాకా నిషేధం?

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయంగా ఉల్లి ధరల్లో తగ్గుదల కనిపించని కారణంగా వాటి ఎగుమతులపై ప్రస్తుతం కొనసాగుతున్న నిషేధాన్ని మరింతకాలం పొడిగించాలని కేంద్రం యోచిస్తోంది. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మార్చి 31 వరకు విధించిన నిషేధాన్ని జూన్ వరకు కొనసాగించే అవకాశాలున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత దేశీయ రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధర సగటున కిలో రూ.34 మేర ఉంది. ఇది గతేడాది ధరలతో పోలిస్తే 41 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ పొడిగింపు అనివార్యమని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

మమతకు తీవ్రగాయాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నుదుటికి తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో చేరారు. గురువారం సాయంత్రం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మమత కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న తన సొంతింటికి చేరుకున్నారు. ఇంట్లో పడిపోవడంతో ఆమె నుదుటికి గట్టి దెబ్బతగిలిందని మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ చెప్పారు. తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో వెంటనే ఎస్ఎస్‌కేఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మమత త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

బెంగళూరు హోటల్లో ఉజ్బెక్ మహిళ హత్య

బనశంకరి: బెంగళూరులోని ఓ హోటల్‌లో విదేశీ మహిళ హత్యకు గురయ్యారు. శేషాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి వెలుగుచూసింది. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జరీనా (37) వ్యాపార వీసాపై నాలుగు రోజుల క్రితం బెంగళూరుకు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం శేషాద్రిపురంలో ఓ హోటల్ రెండో అంతస్తు గదిలో బస చేశారు. బుధవారం రాత్రి 10:30 గంటలైనా ఆమె బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హోటల్ సిబ్బంది మాస్టర్ కీ ద్వారా తెలుపు తెరిచారు. లోపల చూడగా జరీనా విగతజీవిగా కనిపించారు. వారిచ్చిన సమాచారంతో పోలీసులు ఆధారాలు సేకరించి, సీసీ ఫుటేజీ, సెల్ కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎవరో గొంతు నులిమి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

యుద్ధ ట్యాంక్‌ను నడిపిన కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా ట్యాంకును నడిపారు. బుధవారం ఆయన దేశ సైనిక దళాల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. యుద్ధానికి సిద్ధం అయ్యేందుకు పెద్ద ప్రయత్నాలు చేయాలని సేనలకు పిలుపునిచ్చారు. అధికార వార్తా సంస్థ(కేసీఎన్ఏ) గురువారం ఈ విషయం వెల్లడించింది. పొరుగుదేశం దక్షిణ కొరియా, అమెరికా 11 రోజులుగా కొనసాగిస్తున్న భారీ సైనిక విన్యాసాలు గురువారంతో ముగియనున్నాయి. అందుకు బదులుగా అన్నట్లు కిమ్ యుద్ధ ట్యాంకుల పోరాట సన్నద్ధతను పరిశీలించారు.

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ.. పట్టుబడ్డ భారతీయులు

వాషింగ్టన్: కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ముగ్గురు భారతీయులు సహా నలుగురు అక్కడి అధికారులకు పట్టుబడ్డారు. కెనడాలో గూడ్స్ రైలెక్కిన వీరు ఈ నెల 12న సరిహద్దులు దాటాక బఫెలో నగరంలోని ఇంటర్నేషనల్ రైల్‌రోడ్ బ్రిడ్జి వద్ద కదులుతున్న రైలు నుంచి కిందికి దూకారు. ఆ క్రమంలో నలుగురిలో ఒక మహిళ గాయపడింది. ఆమెతోపాటు మిగతా ముగ్గురినీ అనంతరం సరిహద్దు గస్తీ సిబ్బంది పట్టుకున్నారు. వీరు ఎలాంటి పత్రాలు లేని అమెరికాయేతర పౌరులని చెప్పారు. ఇందులో మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు భారతీయ పౌరులు కాగా, నాలుగో వ్యక్తిని డొమినికల్ రిపబ్లిక్ దేశస్తుడిగా గుర్తించామన్నారు.

ఎమ్మెల్సీలుగా నితీశ్, రబ్డీ దేవి ఏకగ్రీవం

పట్నా: బిహార్ శాసనమండలి సభ్యులుగా సీఎం నితీశ్ కుమార్, మాజీ సీఎం రబ్డీ దేవి సహా 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్జేడీకి చెందిన రబ్డీ దేవి శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. కేబినెట్ మంత్రి సంతోష్ సుమన్ కూడా మండలికి ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. జేడీయూ చీఫ్ కూడా అయిన నితీశ్ కుమార్ గురువారం పార్టీ నాయకులతో శాసనమండలి సెక్రటేరియట్‌కు చేరుకుని ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

పంజాబ్‌లో 8 మందితో ఆప్ తొలి జాబితా

చండీగఢ్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను పంజాబ్‌కు సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 8 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన మొదటి జాబితాను గురువారం ప్రకటించింది. వీరిలో అయిదుగురు కేబినెట్ మంత్రులు కావడం గమనార్హం. ఇటీవలే కాంగ్రెస్ నుంచి ఆప్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే, పంజాబీ నటుడు బస్సీ పఠానా గుర్‌ప్రీత్ సింగ్ కూడా ఉన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఆప్ భాగస్వామి అయినప్పటికీ పంజాబ్‌లో మాత్రం ఒంటరిగానే పోటీ చేస్తోంది. ప్రస్తుత లోక్‌సభలో పంజాబ్ నుంచి ఆప్‌కు 13 మంది సభ్యులున్నారు.

ఆస్పత్రిలో చేరిన ప్రతిభా పాటిల్

పుణె: మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్(89) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. జ్వరం, ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆమె బుధవారం పుణెలోని భారతి ఆస్పత్రిలో చేరారు. ఆమె ఆరోగ్య నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు గురువారం వెల్లడించాయి. ఆమెకు చికిత్స అందిస్తున్నామని, వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపాయి. దేశ మొట్టమొదటి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ 2007 నుంచి 2012 సంవత్సరాల మధ్య పనిచేశారు.

బీజేపీలో చేరిన పంజాబ్ మాజీ సీఎం భార్య

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్ భార్య, ఎంపీ ప్రణీత్ కౌర్ గురువారం బీజేపీలో చేరారు. పంజాబ్‌లోని పటియాలా స్థానం నుంచి నాలుగు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన ఆమె కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. అమరీందర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాక.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ప్రణీత్ కౌర్‌ను గత ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతల సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వం, పదేళ్లుగా మోదీ ప్రభుత్వం చేస్తున్న పనులు నచ్చి బీజేపీలో చేరినట్లు చెప్పుకున్నారు. బీజేపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందని మీడియాతో ప్రణీత్ కౌర్ అన్నారు.

శరద్ పవార్ పేరును వాడుకోరాదు

ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరును, ఆయన ఫొటోలను రాజకీయ ప్రయోజనాల కోసం అజిత్ పవార్ వర్గం వాడుకోరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. తనకున్న పలుకుబడిని ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం దుర్వినియోగం చేస్తోందంటూ శరద్ పవార్ వేసిన పిటిషన్‌పై గురువారం అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. శరద్ పవార్ తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వి చేసిన వాదనలపై స్పందించిన న్యాయస్థానం పైవిధంగా వ్యాఖ్యానించింది. వేరుగా ఉండాలనుకున్నప్పుడు సొంత గుర్తింపును మాత్రమే వాడుకోవాలని ధర్మాసనం అజిత్ పవార్ వర్గానికి స్పష్టం చేసింది. ఈ విషయమై తగు సమాధానం ఇవ్వాలని అజిత్ వర్గాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేసింది.

నేటి నుంచే టీజీ రిజిస్ట్రేషన్లు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ఇప్పటివరకున్న వాహనాల నంబర్లు టీఎస్ పేరిటే
- ఆర్టీసీలో త్వరలో 3,500 పోస్టుల భర్తీ
- అదనంగా మరో 1,000 బస్సులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణలోని వాహనాలు శుక్రవారం(నేటి) నుంచి టీజీ పేరుతో రిజిస్ట్రేషన్ అవుతాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, రోడ్డు రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలకు భిన్నంగా టీఎస్ పేరుతో వాహనాల రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. ఉద్యమ సమయంలో రాష్ట్రం ఏర్పాడాలనే ఆకాంక్షతో పాల్గొన్న ఉద్యమకారులు, ప్రజలు తమ వాహనాలపై ఆరోజే టీజీ అని రాసుకున్నారని గుర్తు చేశారు. అయితే అప్పుడు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ టీజీకి బదులు టీఎస్‌ను తెచ్చి వారి ఆకాంక్షలు, మనోభావాలను అణచివేసిందని విమర్శించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌తో కలిసి మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు నెరవేరేలా కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని శాసనసభ ఆమోదంతో టీఎస్‌ను టీజీగా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రానికి కూడా లేఖ పంపించామని, శుక్రవారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలన్నీ టీజీ మీదనే అవుతాయని, ఇప్పటివరకు రిజిస్టర్ అయిన వాహనాల నంబర్లు అలాగే ఉంటాయని చెప్పారు.

ప్రతి వీఐపీ డ్రైవర్‌కు ఫిట్‌నెస్ టెస్టులు

డ్రైవింగ్ లైసెన్సుల జారీ విషయంలో నిబంధనలను కఠినతరం చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ప్రతి వీఐపీ డ్రైవర్‌కు కూడా ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించాలనే నిబంధనలను తీసుకువచ్చామన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ఇప్పటికే రాష్ట్రంలో వెయ్యి కొత్తబస్సులు తెచ్చామని, త్వరలోనే మరో వెయ్యి బస్సులు తేనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా అన్ని కేడర్లకు చెందిన 3,500 ఉద్యోగాలు భర్తీ చేస్తామని వివరించారు. ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్ మెంట్ ఇచ్చామని, కార్మికులు సంతోషంగా ఉన్నారని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

ఇక మూడు సిరీస్‌ల ముచ్చట

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాహనాలకు శుక్రవారం నుంచి టీజీ రిజిస్ట్రేషన్ జారీ కానున్న నేపథ్యంలో ఇకపై మూడు సిరీస్‌లతో తెలంగాణ వాహనాలు కనిపించనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వాహనాలకు ఏపీ సిరీస్ కొనసాగింది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2014 జూన్‌లో టీఎస్ సిరీస్ అందుబాటులోకి వచ్చినా, అప్పటివరకు ఏపీ సిరీస్‌తో ఉన్న వాహనాలకు పాత సిరీస్‌నే కొనసాగించొచ్చని నాటి ప్రభుత్వం పేర్కొంది. దీంతో 2014 జూన్(టీఎస్‌గా మారకముందు)కు ముందు నాటి వాహనాలు ఏపీతో, ఆ తర్వాతవి టీఎస్‌తో కొనసాగుతున్నాయి. శుక్రవారం నుంచి టీజీ సిరీస్ వాహనాలు రోడ్డెక్కనున్నాయి. దీంతో మూడు సిరీస్‌లతో వాహనాలు కనిపించనున్నాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో 1,68,91,666 వాహనాలు ఉన్నాయి. వీటిల్లో 70,81,345 వాహనాలు ఏపీ సిరీస్‌తో ఉండగా, 98,10,321 వాహనాలు టీఎస్ సిరీస్‌తో నడుస్తున్నాయి. రాష్ట్ర సిరీస్ తప్ప జిల్లా సిరీస్‌లు యథాతథంగా కొనసాగుతాయి. టీజీ జెడ్ ఆర్టీసీ వాహనాలకు, టీజీ09 పీ పోలీసు వాహనాలకు, నంబర్ల పక్కన టీ, యూ, వీ, డబ్ల్యూ, ఎక్స్, వై సిరీస్‌లు రవాణా వాహనాలకు కొనసాగుతాయి.

క్లుప్తంగా...

గ్రూప్-1 దరఖాస్తు గడువు 16 వరకు పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగ దరఖాస్తుల స్వీకరణ గడువును తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మరో రెండురోజుల పాటు పొడిగించింది. క్షేత్ర స్థాయిలో అభ్యర్థుల నుంచి భారీ స్పందన లేకపోవడంతో మరో అవకాశం ఇచ్చే దిశగా టీఎస్‌పీఎస్సీ నిర్ణయం తీసుకుంది. ఈనెల 16 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్-1 ఉద్యోగ ఖాళీల భర్తీకి గత నెలలో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. గురువారం వచ్చిన దరఖాస్తులు 3లక్షల లోపే ఉన్నాయి. 2022 ఏప్రిల్‌లో 503 గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు 3.80 లక్షల దరఖాస్తులు వచ్చాయి. నాటి అభ్యర్థుల్లో చాలామంది ఇప్పుడు దరఖాస్తులు సమర్పించలేదని తెలుస్తోంది. దీంతో గడువు తేదీని ఈనెల 16 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

రైల్వే ఉద్యోగార్థులకు పీఈటీసీ ఉచిత శిక్షణ

పీఈటీసీ డైరెక్టర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రి ఎగ్జామినేషన్ ట్రెయినింగ్ సెంటర్(పీఈటీసీ) ద్వారా రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు పీఈ టీసీ డైరెక్టర్ సముజ్వల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్టీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులను వారి విద్యార్హతల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలు 040-27540104 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శివబాలకృష్ణకు మరోసారి బెయిల్ నిరాకరణ

సాక్షి,హైదరాబాద్: హెచ్ ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణకు నాంపల్లి కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో శివబాలకృష్ణను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ వందల కోట్ల ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇదిలాఉండగా, తనను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలులో ఉంచి నెల రోజులు కావొస్తోందని, విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని.. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలంటూ శివబాలకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. గత నెలలో కూడా బెయిల్ దాఖలు చేయగా, కోర్టు పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే.


తెలంగాణకు సీఆర్ఐఎఫ్ కింద రూ.850 కోట్లు

- 435.29 కి.మీ.పొడవుతో 31 స్టేట్ రోడ్ ప్రాజెక్టుల విస్తరణ
- ఎక్స్ వేదికగా ప్రకటించిన కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధికి కింద తెలంగాణకు రూ. 850 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్) కింద మంజూరు చేసిన ఈ నిధులతో 435.29 కిలోమీటర్ల మేర రోడ్డు పొడవుతో, 31 రాష్ట్ర రోడ్ ప్రాజెక్టుల విస్తరణ, బలోపేతం చేయనున్నట్లు గురువారం ఎక్స్ ద్వారా గడ్కరీ ప్రకటించారు. ఈ నిధులతో ఆర్థికాభివృద్ధి, రవాణా మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. ఈ ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, పర్యాటకం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డితో సినీ ప్రముఖుల భేటీ



సాక్షి, హైదరాబాద్: సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు, శివబాలాజీ గురువారంమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుత సినిమా పరిస్థితులపై మంత్రి కోమటిరెడ్డికి వివరించారు. సినిమాటో గ్రఫీ మంత్రిగా కోమటిరెడ్డి బాధ్యతలు చేపట్టాక సినీ పరిశ్రమకు సంబంధించిన నిర్ణయాలను వేగంగా తీసుకుంటున్నారని ప్రశంసించారు. కళాకారులకు అవార్డులు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం పరిశ్రమలో సహృద్భావ వాతావరణం తీసుకొచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలి

- ఈ బాధ్యతను మీడియా మరింత సమర్థవంతంగా నిర్వహించాలి
- యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ వ్యాఖ్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆ బాధ్యతను మీడియా మరింత సమర్థవంతంగా నిర్వహించాలని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ పేర్కొన్నారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ సహకారంతో ఒడిశాకు చెందిన వ్యాస్ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) సంయుక్తంగా 'వాతావరణ మార్పు రిపోర్టింగ్' పేరుతో గురువారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు జెన్నీఫర్ లార్సన్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు లార్సన్ పలు సూచనలు చేశారు. ప్రపంచ మనుగడ వాతావరణంపైనే ఆధారపడి ఉందని, కొన్నేళ్లుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులపై భారత ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాల రూపంలో మానవ మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయన్నారు. వాతావరణ మార్పులను జర్నలిస్టులు సైతం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, టీయూ డబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్, వ్యాస్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు తదితరులు పాల్గొన్నారు.




ఘనంగా ఆధ్యాత్మిక సమ్మేళనం

- కన్హాలో యోగా తరగతులు ప్రారంభం
- వీనులవిందుగా శంకర్ మహదేవన్ సంగీత కచేరీ

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమాలు ఆదివారం వరకు కొనసాగనున్నాయి. హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గురూజీ కమ్లేశ్ పటేల్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ సంగీత కచేరీతో ఆకట్టుకున్నారు. కుమారేష్ రాజగోపాలన్, శశాంక్ సుబ్రహ్మణ్యం అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రపంచంలోని సర్వమతాలు, విశ్వాసాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలను ఒకేచోటికి చేర్చడం 'అంతర్గత శాంతి నుంచి ప్రపంచ శాంతికి' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కొడుకు కళ్లెదుటే తండ్రి ఉరేసుకుని

ఆర్థిక ఇబ్బందులు భరించలేక.. మెదక్ జిల్లాలో దారుణం



కొడిపల్లి (నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులు భరించలేక నాలుగేళ్ల కన్నకొడుకు కళ్ల ముందే తండ్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన మెదక్ జిల్లా కొడిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నవీన్(34), అతని తల్లి లలిత వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. నవీన్ భార్య.. కుమారుడు లోకేష్ పుట్టిన తర్వాత వీరికి దూరంగా వెళ్లిపోయింది. కాగా, ఇటీవల లలిత కాలుకు గాయమై తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తొలుత మెదక్‌లో వైద్యం చేయించారు. అక్కడ తగ్గకపోవడంతో వైద్యులు.. గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కొన్ని రోజులుగా చికిత్స పొందుతోంది. కాలుకు ఇన్‌ఫెక్షన్ అయిందని, తొలగించాల్సి వస్తుందని వైద్యులు చెప్పారు. ఆసుపత్రి ఖర్చులు, కుటుంబ అవసరాలకు డబ్బులు లేకపోవడంతో నవీన్ అప్పులు చేశాడు. దీంతో రోజురోజుకూ ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. ఈ క్రమంలో ఉదయం నవీన్ తన కొడుకు లోకేష్‌తో కలిసి చింతకాయలు తెంపుకొద్దామని తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలో కొడుకు చూస్తుండగానే.. చింతచెట్టు ఎక్కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడు ఏడుస్తుండటంతో అటుగా వెళుతున్న గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

భవిష్యత్తు అంధకారం కావొద్దని..

- తల్లి మృతి విషయం దాచి విద్యార్థినితో పరీక్ష రాయించిన ఉపాధ్యాయులు
- కరోనా సమయంలోనే తండ్రిని కోల్పోయిన విద్యార్థిని సౌమ్య
- బుధవారం రోడ్డు ప్రమాదంలో తల్లిని కూడా...



సౌమ్య

కాటారం (ములుగు): ఓ విద్యార్థిని భవిష్యత్ అంధకారం కావొద్దని ఆలోచించారు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు. అల్లారు ముద్దుగా పెంచిన తల్లి తనకు దూరమైందనే విషయం తెలియకూడదని.. చివరి పరీక్ష సజావుగా రాయాలని ఆకాంక్షించారు. సదరు విద్యార్థిని పరీక్ష రాసేలా కృషి చేశారు. ములుగు జిల్లా మల్లంపల్లిలో గురువారం జరి గిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రొంటాల రమాదేవికి, కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త కరోనా సమయంలో మృతి చెందాడు. కూతురు సౌమ్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట సోషల్ వెల్ఫేర్ కళాశాలలో బైపీసీ సెకండియర్ చదువుతోంది. రమాదేవి అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం కొడుకును తీసుకుని ద్విచక్ర వాహనంపై ములుగు ఆస్పత్రికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవి మృతి చెందగా...కొడుకు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ విషయాన్ని సౌమ్య కుటుంబ సభ్యులు కళాశాలకు తెలియజేశారు. అయితే సౌమ్యకు చివరి పరీక్ష కావడంతో ఆమె భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కుటుంబ సభ్యుల ఆమోదంతో...ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లి మృతి చెందిన విషయం విద్యార్థినికి తెలియకుండా దాచారు. గురువారం పరీక్ష రాసిన సౌమ్య అమ్మ వస్తుందనే సంతోషంతో బయటకు రాగా..అమ్మ కాకుండా బంధువులు వచ్చారు. దీంతో అమ్మకేదో ఆపద వచ్చిందని భావించి ఇంటికి వెళ్లిన సౌమ్య తల్లి మృతదేహాన్ని చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

మిత్రుడి అంతిమయాత్రలో నడుస్తూ తనువు చాలించి..

మృత్యువులోనూ వీడని స్నేహబంధం.. చింతకుంటపల్లిలో విషాదం



నర్సింహ్మా యాదవ్(ఫైల్)



జిన్నారం యాదయ్య(ఫైల్)

కేశంపేట: వారిద్దరూ చిన్ననాటి నుంచి మంచి మిత్రులు.. ఒకరిని విడిచి మరొకరు ఉండే వారు కాదు. ఏ పని చేసినా పరస్పరం చేదోడు వాదోడుగా ఉంటూ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటుండే వారు. విధి వక్రీకరించి వీరిలో ఒకరు అకాల మరణం పొందారు. స్నేహితుడి మరణాన్ని తట్టుకోలేక అంతిమయాత్రలో నడుస్తూ తాను సైతం మిత్రుడితో కలిసి అనంత లోకాలకు వెళ్లిపోయాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం చింతకుంట పల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆనెమోని నర్సింహ్మా యాదవ్ (60), జిన్నారం యాదయ్య (55) ప్రాణ స్నేహితులు. చిన్న నాటి నుంచి కలిసిమెలిసి పెరిగారు. ఇద్దరి వ్యవసాయ భూములు పక్కనే ఉండటంతో వీరి స్నేహం మరింత బలపడింది. కాగా, అనారోగ్యం కారణంగా ఇటీవలే అస్పత్రిలో చేరిన నర్సింహ్మాయాదవ్‌కు శస్త్రచికిత్స ద్వారా వైద్యులు కాలు తీసేశారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆయన మంగళవారం మృతి చెందాడు. స్నేహితుడి మరణ వార్త విన్న క్షణం నుంచి శోకసంద్రంలో మునిగి పోయిన యాదయ్య.. రాత్రంతా మిత్రుడి మృతదేహం పక్కనే కూర్చుని జాగారం చేశాడు. బుధవారం శవయాత్రలో నడుస్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. ఇది గమనించిన చుట్టు పక్కల వారు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

త్వరలోనే ఇంటి నుంచి పార్శిళ్ల సేకరణ, డెలివరీ

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి
- దిల్‌సుఖ్‌నగర్‌లో కొత్త కౌంటర్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: టికెటేతర ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వ సహకారంతో లాజిస్టిక్స్ విభాగ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన సేవలను అందజేసేందుకు త్వరలో ఇంటి నుంచే పార్శిళ్ల సేకరణ, డెలివరీ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. లాజిస్టిక్స్ విభాగం కొత్త లోగో, బ్రోచర్‌ను ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పార్శిళ్ల హోం పికప్, డెలివరీ కోసం వినియోగించే కొత్త వాహనాన్ని కూడా ఎండీ జెండా ఊపి ప్రారంభించారు. టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ద్వారా ప్రతిరోజూ సగటున 15 వేల పార్శిళ్లను బట్వాడా చేస్తున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పార్శిళ్లను ఆర్టీసీ బస్సుల్లో రవాణా చేశామన్నారు. దీంతో ఈ ఏడాది తమకు సుమారు రూ.120 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో మాత్రమే వినియోగదారుల ఇంటి నుంచి వస్తువుల సేకరణ, డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలకు...

నగరవాసులు ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ నంబర్ 040-69440069కు సంప్రదించవచ్చు.లేదా ఆర్టీసీ వెబ్‌సైట్ https://www.tsrtclogistics.inలో కూడా లాగిన్ కావచ్చు.




వటపత్రశాయిగా నృసింహుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం ఉదయం స్వామివారు వటపత్రశాయి అలంకారంలో.. రాత్రి హంసవాహనంపై ప్రధానాలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార, వాహన సేవలను వేలాదిమంది భక్తులు దర్శించి తరించారు. శుక్రవారం నుంచి ఆలయంలో ధార్మిక, సాహిత్య, సాంస్కృతిక మహాసభలు ప్రారంభం కానున్నాయి.



ఒక రోజు.. ఓ కోతి.. ఓ కుక్క..

అందుకే దీన్ని కోతి అన్నది. తన మానాన తాను వెళ్లిపోతున్న కుక్క వెంటపడింది.. దాని తోక పట్టుకుని లాగింది.. అయినా.. శాంతంగా వెళ్లిపోతుంటే.. దాని కాలు పట్టుకుని కొరికింది.. కుక్క ఇక ఊరుకోలేదు.. రియాక్టైంది.. కోతి మొహం చూడండి.... ఎలా పెట్టిందో.. కొరివితో తలగోక్కున్నానన్న విషయం అర్థమై.. ఎప్పట్లాగే.. తుర్రుమంది. ఈ సరదా దృశ్యాన్ని చండీగఢ్‌లో అనుజ్ జైన్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.



డీఎస్సీ అభ్యర్థులకు శుభాకాంక్షలు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ మేరకు ప్రభుత్వం టెట్ నిర్వహణకు ముందుకు రావడం సంతోషకరమని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. టెట్ జరగకపోవడం వల్ల రాష్ట్రంలో 7 లక్షల పైచిలుకు విద్యార్థులు డీఎస్సీ పరీక్షకు అర్హత కోల్పోతున్నారని, వెంటనే టెట్ నిర్వహించాలని ఈనెల 12న ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ లేఖ రాసిందని పేర్కొన్నారు. డీఎస్సీకి సిద్ధం అవుతున్న అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ట్రోలింగ్స్ వల్లే మనస్తాపంతో
గీతాంజలి ఆత్మహత్య

- గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిలో ఇద్దరి అరెస్టు
- గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం: ఇంటి పట్టా రిజిస్టరై చేతికి వచ్చిన సందర్భంలో ఆనందంగా మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ గీతాంజలి పాలిట శాపంగా మారిందని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ వీడియోను ట్రోల్ చేయడంతో తట్టుకోలేక మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గీతాంజలి మృతికి బాధ్యులైన ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసు విచారణ కోసం ఐపీఎస్ అధికారి నచికేత్ షెల్కే నేతృత్వంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), శ్రీనివాసరావు (ఎల్/ఓ), తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీ రమేష్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. ఈ క్రమంలో ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా వచ్చిన ట్రోలింగ్‌లను పరిశీలించామన్నారు. గీతాంజలి నాలుగో తేదీన లోకల్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిందని, ఆమె మాట్లాడిన మాటలు అదే రోజు సోషల్ మీడియాలో వైరలయ్యాయని తెలిపారు. దీనికి అనేక వ్యూస్ వచ్చాయని, దీంతో ఆమెను కొందరు ట్రోల్ చేయడం మొదలుపెట్టినట్లు గుర్తించామన్నారు. వీటిని చూసి ఆమె మనస్థాపానికి గురైందని, రెండు రోజులు డీలాగా గడిపినట్లు తెలిసిందన్నారు. ఏడో తేదీ ఉదయం ఈ ట్రోలింగ్‌పై తన సన్నిహితులు, బంధువులతో చర్చించిందని, వాటిని ఎలా తొలగించాలని వారిని అడగ్గా, అది సాధ్యం కాదని వారు ఆమెకు చెప్పారని తెలిపారు. ఈనెల ఏడో తేదిన ఆమెకు విజయవాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిందని, ఆ తర్వాత కూడా బంధువులతో మాట్లాడిందని చెప్పారు. తనను, తన పిల్లలను, భర్తను కూడా అసభ్య పదజాలంతో తిడుతున్నారని వారి వద్ద ఆవేదన వ్యక్తం చేసిందన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే గీతాంజలి తెనాలి రైల్వే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసిందని చెప్పారు. ఆమెను గమనించి లోకో పైలెట్ అప్రమత్తమై, బ్రేక్ వేసి రైలును నిలిపారని, అప్పటికే రైలు తగలడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయని చెప్పారు. ఆమెను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. తెనాలి జీఆర్పీ పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులను విచారించగా, సోషల్ మీడియాలో అసభ్యకరమైన కామెంట్ల వల్ల ఆమె తీవ్ర మనస్థాపనానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారని అన్నారు. వెయ్యికిపైగా కామెంట్లు ఉన్నట్లు విచారణ బృందాలు గుర్తించాయన్నారు. సోషల్ మీడియాలో అటువంటి భాష ఉపయోగించడం బాధాకరమన్నారు. ట్రోలింగ్‌కు పాల్పడిన విజయవాడకు చెందిన పసుమర్తి రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండికి చెందిన వెంకట దుర్గారావుని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని అన్నారు. మిగతా వారిని గుర్తించే పనిలో ఉన్నామని చెప్పారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మళ్లీ మూడు పార్టీలు..
అవే మాయమాటలు



2014లో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు చూపిస్తున్న ఏపీ సీఎం జగన్

బనగానపల్లె సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం

- ప్రజలను మోసగించేందుకే మరోసారి జత కలిశాయి
- 2014 హామీలను అమలు చేయకుండా వంచించిన చరిత్ర వారిది
- 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' నిధులను బటన్ నొక్కి విడుదల చేసిన సీఎం

"మూడు, నాలుగు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తోంది. 2014లో మాదిరిగానే చంద్రబాబు, దత్తపుత్రుడు మళ్లీ బీజేపీతో కలిశారు. నాడు మేనిఫెస్టో హామీలను విస్మరించినట్లుగానే ఇప్పుడు రంగురంగుల హామీలు గుప్పిస్తున్నారు. వారి మోసాలు, దగాను గమనించాలని కోరుతున్నా. చంద్రబాబు పేరు చెబితే వంచన, దత్తపుత్రుడి పేరు చెబితే ఐదేళ్లకోసారి కారును మార్చినట్టుగా భార్యను మార్చే ఓ మోసగాడు, వంచకుడు గుర్తుకొస్తాడు! ఒకరికి విశ్వసనీయత లేదు.. ఇంకొకరికి విలువలు లేవు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఈ రోజు పేదవాడి భవిష్యత్తుపై యుద్ధానికి వస్తున్నాయి. పొరపాటు చేయవద్దని, అందరూ బాగా ఆలోచన చేయాలని కోరుతున్నా" - ముఖ్యమంత్రి జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: పేదరికానికి కులం ఉండదని, పేదవాడు ఎక్కడున్నా వారికి తోడుగా నిలిచే మనసు ప్రభుత్వ పెద్దలకు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలను ఆదుకునే గుణం, వారికి తోడుగా ఉండాలనే ఆరాటం పాలకులకు ఉండాలన్నారు. 'నిజానికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు మన మేనిఫెస్టోలో లేవు. అయినప్పటికీ అగ్రవర్ణ పేదలకు సైతం అండగా ఉండాలని, వారు పేదరికంతో ఇబ్బంది పడే పరిస్థితులు రాకూడదని అడుగులు వేసిన ప్రభుత్వం మీ బిడ్డదే' అని చెప్పారు. అగ్రవర్ణ పేదలను ఆర్థికంగా ఆదుకుంటూ ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం కింద 45 - 60 ఏళ్ల మధ్య వయసున్న 4.19 లక్షల మంది మహిళల ఖాతాల్లో రూ.629 కోట్లు జమ చేసే కార్యక్రమాన్ని గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో బటన్ నొక్కి సీఎం జగన్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మూడేళ్లలో మూడు దఫాల్లో 4,95,269 మందికి రూ.1,877 కోట్ల మేర లబ్ధిని చేకూర్చారు. బనగానపల్లెలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని సభా ప్రాంగణం నుంచే శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

మ్యారేజ్ స్టార్, మోసగాడు, వంచకుడు..

ఎన్నికలప్పుడు రంగురంగుల హామీలు ఇవ్వడం, ఆ తర్వాత చెత్తబుట్టలో పడేసి మోసం చేయడం అనే సంప్రదాయాన్ని మార్చి విశ్వసనీయత అనే పదానికి అర్థం తేవడం కేవలం మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే జరిగింది. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే వంచన గుర్తుకొస్తుంది. పొదుపు మహిళలకు ఆయన చేసిన దగా గుర్తుకొస్తుంది. చంద్రబాబు పేరు చెబితే ఒక్కటంటే ఒక్క మంచి పని గానీ పథకంగానీ గుర్తురాదు. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థను భ్రష్టు పట్టించే ఒక మోసగాడు, ఐదేళ్లకోసారి కారును మార్చినట్టు భార్యను మార్చే మ్యారేజ్ స్టార్, మోసగాడు, వంచకుడు గుర్తుకొస్తాడు. ఒకరికి విశ్వసనీయత లేదు, మరొకరికి విలువలు లేవు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఈ రోజు మీ బిడ్డ మీదకు కాదు.. పేదవాడి భవిష్యత్‌పై యుద్ధానికి వస్తున్నాయి.

మీ అందరికీ ఒక విన్నపం...

'మీ అందరికీ ఒక విన్నపం! ఎన్నికల కోడ్ మరో మూడు నాలుగు రోజుల్లో రాబోతోంది. అందువల్ల బటన్ నొక్కటం పూర్తి చేస్తున్నాం. డబ్బులు వచ్చే కార్యక్రమం కాస్త అటూ ఇటుగా జరుగుతుంది. ఎవరూ ఆందోళన పడొద్దు. త్వరలోనే డబ్బులు పడతాయి. ఈ రెండు వారాల పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి చదవొద్దు. ఏబీఎన్, టీవీ–5 చూడొద్దు. చెడిపోయిన మీడియా వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం. మంచి జరిగితే దాన్ని కూడా వక్రీకరించే చెడిపోయిన, కుళ్లిపోయిన ఈనాడు, ఆంధ్రజ్యోతితో యుద్ధం చేస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న పొత్తు బంధం..

రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాల

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్ : పొత్తుల కోసం వెంపర్లాడిన తెలుగుదేశం పార్టీ పుట్టి మునుగుతోంది. పొత్తుల పోటు గట్టిగా తగలడంతో సీనియర్ల సీట్లకు అధిష్టానం ఎసరు పెట్టింది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తన యుడు లోకేష్ తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. సీనియర్లు బజారుకెక్కి పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం టికెట్ వసంత కృష్ణప్రసాద్‌కేనని అధిష్టానం చెప్పడంతో ఉమా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలిసింది. పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కూ టికెట్ లేదని పార్టీ సంకేతాలిచ్చింది. దీంతో ఆయన తన అనుచరులతో సమావేశమయ్యారు. రాజీనామాకు సిద్ధమవుతున్నారు. తనను కాదని పార్టీ ఎలా గెలుస్తుందో చూస్తానని సవాల్ విసి రారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ హెచ్చరించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని తొలుత జనసేనకు కేటాయించినట్టు పార్టీ సమాచారం ఇవ్వడంతో బుద్దా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంకే బేగ్ ఖంగుతిన్నారు. బుద్దా వెంకన్న అనుచరులతో సమావేశం నిర్వహించి మరీ పార్టీకి పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. జలీల్‌ఖాన్ పార్టీ వీడతానని బెదిరించారు. ఇప్పుడు ఈ సీటును బీజేపీ కోరుతున్నట్టు తెలియడంతో సీటుపై ఆశలు పెట్టుకున్న జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కూ షాక్ తగిలింది. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించడంతో మండలి బుద్ధప్రసాద్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



పవన్‌కళ్యాణ్‌కు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పిఠాపురంలో తమ పార్టీ జెండాలను తగలబెడుతున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ సీట్లు మరో 34 ఖరారు

రెండో జాబితా విడుదల చేసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: తీవ్రంగా కసరత్తులు చేసి, 34 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రెండో జాబితాను ప్రకటించారు. ఈ జాబితాను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తొలి జాబితాలో చోటు సంపాదించలేకపోయిన పలువురు నేతలకు ఈ జాబితాలో చోటు కల్పించారు. రాజమండ్రి రూరల్ స్థానాన్ని ఎట్టకేలకు సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికే ఖరారు చేశారు. అక్కడి జనసేన నేత కందుల దుర్గేష్‌ను నిడదవోలు పంపడంతో బుచ్చయ్యకు లైన్ క్లియర్ అయింది. సీటు నిరాకరించిన చింతమనేని ప్రభాకర్‌కు ఈ జాబితాలో అవకాశం కల్పించారు. ఆయన కుటుంబంలో మరికరికి సీటు ఇవ్వాలని చూసిన చంద్రబాబు మనసు మార్చుకుని చివరికి ప్రభాకర్‌కు ఒక్కరికే సీటు ఖరారు చేశారు. రంపచోడవరం స్థానానికి కొత్త ముఖమైన మిర్యాల శిరీషకు ఇచ్చి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి షాక్ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు అభ్యర్థిగా జవహర్‌ను కాదని గోపాలపురంలో ఓడిపోయిన ముప్పిడి వెంకటేశ్వరరావును ఎంపిక చేశారు. గోపాలపురం సీటును నియోజకవర్గ నేతలంతా వ్యతిరేకించిన మద్దిపాటి వెంకటరాజుకు ఇచ్చారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు సీటును వలస నేత ఆనం రాంనారాయణరెడ్డికి ఇచ్చారు. కోవూరు సీటును ఇటీవలే పార్టీలో చేరిన మరో వలస నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డికి కేటాయించి, ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకున్న నేతలకు ఝలక్ ఇచ్చారు. రెండో జాబితాలోనూ చంద్రబాబు ధన బలమున్న వారికే ప్రాధాన్యం ఇచ్చారు.

'చే'రికల ప్లాన్

లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ వైపు నేతల చూపు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాష్ట్రంలో రాజకీయం రంగు మారుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత 'ఏ పార్టీల నేతలూ తమకు అవసరం లేద'న్న కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్‌ను బలహీనం చేసే లక్ష్యంతో చేరికల ప్లాన్‌కు తెరలేపింది. టికెట్ దక్కని అసంతృప్తులు, వ్యక్తిగత ప్రయోజనాలు, ఇతర కారణాలతో కొందరు నేతలు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. 'నేను గేట్లు తెరిస్తే.. నలుగురు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరు' అని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలను వ్యూహాత్మకంగా అమలు చేసే పనిలో ఉన్నట్టు అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీత కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు మాత్రమే కాకుండా.. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇతర పార్టీలను క్షేత్రస్థాయిలో దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, ఇతర పార్టీలకు చెందిన కీలక నాయకులను కూడా చేర్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు పేర్కొంటున్నాయి.

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్

మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి బీజేపీ ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ.. అధిష్టానం మాజీ మంత్రి డీకే అరుణకు అవకాశం కల్పించింది. దీంతో జితేందర్‌రెడ్డి అసంతృప్తికి లోనయ్యారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని జితేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మరీ కలిశారు. ముఖ్యమంత్రి ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి మరీ వెళ్లి ఇతర పార్టీకి చెందిన మాజీ ఎంపీని కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మహబూబ్‌నగర్ ఎంపీ సీటుపై ప్రత్యేక దృష్టి పెట్టిన రేవంత్.. పక్కా వ్యూహంలో భాగంగానే జితేందర్‌రెడ్డిని కలిసినట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డిని రేవంత్ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్టు ప్రచారం జరిగింది.

డీకే రూట్‌లో మల్లారెడ్డి కుటుంబం!

బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మారిన రాజకీయ పరిస్థితుల్లో సంకట స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న రాజకీయ వైరం ఇప్పుడు తనను వెంటాడుతోందని ఆయన భావిస్తున్నారు. ఇటీవల మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీ భవనాన్ని అక్రమ నిర్మాణంగా నిర్ధారించి కూల్చివేయడంతో మల్లారెడ్డి కుటుంబం కలవరపడింది. నిజానికి మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి తన కుమారుడు భద్రారెడ్డి పోటీ చేస్తాడని మల్లారెడ్డి పలు సందర్భాల్లో చెప్పారు. కానీ పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి కలవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరేందుకు మల్లారెడ్డి సిద్ధమయ్యారని, కానీ సీఎం రేవంత్ అడ్డుకోవడంతో.. డీకే శివకుమార్ ద్వారా చేరిక ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరిగింది.

అన్ని స్థాయిల నేతలూ అదే దారిలో..

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఈసారి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు విముఖత చూపడంతో.. కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా గులాబీ బాస్ ఎంపిక చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి సునీతా మహేందర్‌రెడ్డి పోటీలో ఉంటారని ప్రచారంలో ఉన్నా.. రంజిత్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్టు రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. ఇలా ఎన్నికలకు ముందే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రయత్నంలో సీఎం రేవంత్ ఉన్నారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిగాయని, సరైన సమయంలో ఆహ్వానం పంపుతామని వారికి సూచించినట్టు పేర్కొంటున్నాయి. మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు సీఎంతో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు మండల స్థాయిలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర క్షేత్ర స్థాయి నేతలను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రయత్నాలు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మరుసటి రోజు నుంచే ఉంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సానుభూతి తెలిపేందుకే కలిశారు..

మాది ఒకటే జిల్లా. రేవంత్‌కు నా ఇల్లు కొత్త కాదు. మా అన్న ఇంటికి కూడా వచ్చారు. నాకు బీజేపీ టికెట్ రాకపోవడంతో పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసేందుకే వచ్చి కలిశారు. నేను ప్రస్తుతానికి బీజేపీలోనే కొనసాగుతున్నాను. కాంగ్రెస్ పార్టీలో టికెట్లన్నీ ఫుల్ అయ్యాయి. కాంగ్రెస్‌కు మహబూబ్‌నగర్‌లో వంశీ, చేవెళ్లలో పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు..
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

ఓ వర్సిటీ పనిమీదే కలిశా..

నేను శివకుమార్‌ను కలవడానికి, రాజకీయాలకు సంబంధం లేదు. కాంగ్రెస్‌లో చేరడం లేదు. నేను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా. ఓ యూనివర్సిటీ కొనుగోలు వ్యవహారంలో ఒక మధ్యవర్తితో కలసి డీకే శివకుమార్ వద్దకు వెళ్లి కలిశాను..
- మాజీ మంత్రి మల్లారెడ్డి

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నా: పవన్



సాక్షి, అమరావతి: తాను ఈసారి పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. అసెంబ్లీ స్థానంతో పాటు లోక్‌సభకు కూడా పోటీ చేసే విషయంపై పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. 'చాలా మంది ఎమ్మెల్యే, ఎంపీ రెండింటికీ పోటీ చేయాలని సూచిస్తున్నారు. కానీ రెండింటికీ పోటీ చేస్తే క్రాస్ ఓటింగ్‌లు వంటివీ ఉంటాయని గందరగోళంలో ఉన్నా. నాకు మాత్రం ఎమ్మెల్యేగా ఉండాలనే ఉంది' అని చెప్పారు.

100 రోజుల్లో 5 గ్యారంటీల అమలు

- నేటితో రేవంత్ సర్కార్ వంద రోజుల పాలన పూర్తి
- ప్రగతి నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: విధ్వంసానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతూ వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు శుక్రవారంతో వంద రోజులు పూర్తి కానున్న సందర్భంగా ప్రగతి నివేదికను విడుదల చేసింది. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

తొలిరోజు నుంచే స్వేచ్ఛా వాతావరణం

- సీఎంగా ఎ.రేవంత్‌రెడ్డి డిసెంబర్ 7వ తేదీన అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచే రాష్ట్రంలో స్వేచ్ఛా స్వాతంత్ర్య వాతావరణం పునరుద్ధరణ జరిగింది. ప్రగతిభవన్ కంచె తొలగింపు. మహాత్మ జ్యోతిబా పూలే వేదికగా ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం.
- డిసెంబర్ 28–జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం. గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకారం.
- మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పన. ఇప్పటికే 23 కోట్ల మంది మహిళలకు లబ్ధి. రూ.500కు గ్యాస్ సిలిండర్ పంపిణీ సైతం ప్రారంభం.
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు.
- అర్హులైన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించే 'గృహజ్యోతి'పథకం ప్రారంభం. జీరో బిల్లులు జారీ.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.22,500 కోట్లతో 4,50,000 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు. సొంత జాగాలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల సాయానికి నిర్ణయం.

మూడు నెలల్లోనే 29,384 ఉద్యోగాల భర్తీ

- టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన. మూడు నెలల్లోనే 29,384 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ. అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత. వీరిలో 53 శాతం పురుషులు, 47 శాతం మహిళలు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటన. జాబ్ క్యాలెండర్ అమలుకు ప్రయత్నాలు మొదలు. 563 పోస్టులతో గ్రూప్ 1 కొత్త నోటిఫికేషన్ జారీ. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామకాలు.
- హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారిపై రూ.2,232 కోట్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు జాతీయ రహదారి 44పై రూ.1,580 కోట్లతో డబుల్ డెక్కర్ కారిడార్, హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు.
- రూ.2,700 కోట్లతో అన్ని ప్రభుత్వ ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో రూ.40,232 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ. 30 వేల ఉద్యోగాల కల్పనకు భరోసా.
- ధరణి సమస్యల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ.
- మూసీ పునరుజ్జీవం, పరివాహక ప్రాంత అభివృద్ధికి డిజైన్లు, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం.
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం. నార్కోటిక్స్ నియంత్రణ. టీ.ఎస్.నాబ్.. గ్రే హౌండ్స్, ఆక్టోపస్ తరహాలో పటిష్టం.
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నియోజకవర్గాల అభివృద్ధికి రూ.1190 కోట్లు.
- నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన. మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలకు భూమిపూజ.
- హుస్సేన్‌సాగర్ చుట్టూ దుబాయ్ మోడల్ టూరిజం స్పాట్ ఏర్పాటుకు నిర్ణయం.
- స్వయం సహాయక సంఘాలకు చేయూతగా కొత్త కార్యక్రమాలు.
- రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం.
- వాహనాల రిజిస్ట్రేషన్ల నంబర్‌లో టీఎస్ స్థానంలో టీజీ. రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ.

గత పాలనపై శ్వేతపత్రాలు, విచారణలు

గత ప్రభుత్వ విధ్వంసాన్ని, అవినీతి అక్రమాలను వెల్లడించడానికి గాను రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్, నీటిపారుదల శాఖలపై శ్వేతపత్రాల విడుదల. ఓఆర్ఆర్ టోల్ టెండర్ అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశం. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటనతో పాటు గొర్రెల పంపిణీ పథకం, చేప పిల్లల పెంపకం పథకాలపై విజిలెన్స్ విభాగంతో విచారణ. ధరణి పోర్టల్ ఏజెన్సీపై విచారణ ప్రారంభం. మిషన్ భగీరథ విలేజ్ లెవల్ ఇంట్రా పైపులైన్లు, గ్రామాల్లో పనులపై విచారణ. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ అధికారుల పాత్రపై విచారణ. వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో రూ.వందల కోట్లకు పైగా వ్యాట్ ఎగవేతపై విచారణ. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణలకు ఆదేశం.

ఆరుకు నూరు మార్కులెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

మిగిలిన 8 హామీల అమలు లోక్‌సభ ఎన్నికల తర్వాతేనని అర్థమవుతోంది.

వ్యతిరేకత రాలేదేమో కానీ..

వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు విషయమై ప్రజల్లో వ్యతిరేకత లేకపోయినా ఒకింత అసంతృప్తి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు అందరికీ పథకాలు అందజేస్తామని చెప్పి.. ఇప్పుడు తెల్ల రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి లబ్ధీ పొందనివారు, భవిష్యత్తులో ప్రారంభించే పథకాల్లోనైనా తమకు లబ్ధి కలుగుతుందో లేదోననే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాల అమలుకు ఏదో ఒక కొలబద్ధ ఉండాలి కదా... అందుకే తెల్ల రేషన్ కార్డు నిబంధన అమలు చేస్తున్నామంటూ ప్రభుత్వం వివరణ ఇవ్వడం గమనార్హం.

ఒక్క మహాలక్ష్మికే రూ.40 వేల కోట్లకు పైగా

రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ప్రకటించింది. మహాలక్ష్మి పేరుతో రూపొందించిన తొలి గ్యారంటీలోని మొదటి అంశం ఇదే. ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 1.65 కోట్ల మంది మహిళలున్నారు. వీరిలో పింఛన్లు పొందుతున్న 26 లక్షల మంది పోను మిగిలిన వారికి నెలకు రూ.2,500 చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.41,700 కోట్లు కావాల్సి ఉంటుంది.

వరికి బోనస్ వచ్చే సీజన్ నుంచా?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మరో ప్రధాన గ్యారంటీ రైతు భరోసా. రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలతో పాటు క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇందులోని ప్రధాన హామీలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసినా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వలేదు. అయితే వచ్చే వర్షాకాలం సీజన్ నుంచి దీనిని అమలు చేయవచ్చని తెలుస్తోంది. రైతు భరోసా అమలు చేయాలంటే ఏటా కనీసం రూ.34 వేల కోట్లు కావాల్సి ఉంటుంది.

చేయూత.. ఎప్పుడో?

రాష్ట్రంలోని పేదలు అత్యంత ఆతురతతో ఎదురు చూస్తున్న మరో గ్యారంటీ చేయూత. ఈ గ్యారంటీ కింద రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాల్సి ఉంది. దీని కోసం 46 లక్షలకు మందికి పైగా పేదలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కాగా చేయూత పథకాన్ని అమలు చేయాలంటే ఏటా రూ.18 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టాల్సి రానుంది.

యువ వికాసం... గందరగోళం

యువ వికాసం గ్యారంటీలో భాగంగా ఇంటర్ నుంచి వృత్తి విద్యా కోర్సుల వరకు అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు ఫీజుల నిమిత్తం రూ.5 లక్షల విలువైన విద్యాభరోసా కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ ఆ కార్డు ఎలా ఇస్తారు? ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందా? వడ్డీ ఎవరు భరిస్తారు? లాంటి వాటిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

ఇప్పటివరకు ఇవీ..

ఆరు గ్యారంటీల్లో భాగంగా తొలుత ప్రారంభించింది ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి. ఈ పథకం ప్రారంభించే నాటికి ఆర్టీసీ బస్సుల్లో సగటు ఆక్యుపెన్సీ రేషియో 66 శాతం మాత్రమే. కానీ పథకం ప్రారంభమయ్యాక అది క్రమంగా వంద శాతానికి చేరుకుంది. ఇప్పటివరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన మహిళల సంఖ్య 25 కోట్లను మించిపోయింది. ఈ సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. ఇక గృహజ్యోతి కింద తొలి నెలలో లబ్ధి పొందిన వారి సంఖ్య తక్కువగానే ఉంది. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న గృహ కనెక్షన్ల సంఖ్య 95.23 లక్షలు కాగా, తెల్ల రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తుల పేరుతో లబ్ధిదారుల సంఖ్య సగానికి పైగానే తగ్గిందని తెలుస్తోంది. మరోవైపు ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రంలోని 20 లక్షల మందికి ఇళ్ల సౌకర్యం కల్పించాలన్నది లక్ష్యం కాగా, ప్రస్తుతం సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల నగదు సాయం పథకాన్ని ప్రారంభించారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కూడా ప్రారంభమైంది.

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు పరిస్థితి ఇది

గ్యారంటీ పేరు	అంశం	ప్రస్తుత పరిస్థితి
మహాలక్ష్మి	ప్రతి మహిళకు నెలకు రూ.2,500 రూ.500కే గ్యాస్ సిలెండర్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం	అమలు కాలేదు ఫిబ్రవరి 28న ప్రారంభం డిసెంబర్ 9న ప్రారంభం
రైతు భరోసా	రైతులకు, కౌలు రైతులకు రూ.15వేలు వ్యవసాయ కూలీలకు రూ.12వేలు వరి క్వింటాలుకు రూ.500 బోనస్	అమలు కాలేదు అమలు కాలేదు అమలు కాలేదు
గృహజ్యోతి	200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్	ఫిబ్రవరి 28న ప్రారంభం
ఇందిరమ్మ ఇళ్లు	ఇంటిస్థలం, స్థలం ఉంటే రూ.5 లక్షలు ఉద్యమకారులకు 250 గజాల స్థలం	మార్చి 11న ప్రారంభం అమలు కాలేదు
యువ వికాసం	విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్	అమలు కాలేదు అమలు కాలేదు
చేయూత	రూ.4 వేలకు నెలవారీ పింఛన్ రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా	అమలు కాలేదు డిసెంబర్ 9న ప్రారంభం



దరఖాస్తు చేసుకోని వారి పరిస్థితేమిటి?

ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల కోసం 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇందులో డూప్లికేషన్లు, ఇప్పటికే లబ్ధి పొందిన దరఖాస్తులు కూడా ఉన్నాయని ప్రభుత్వం చెపుతోంది. ఇదిలావుంటే అసలు చాలా మంది ప్రజలు ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోలేదు. దీంతో తెల్ల రేషన్‌కార్డు ఉన్నప్పటికీ పథకాల లబ్ధి పొందలేకపోవడం గమనార్హం. ప్రతి నాలుగు నెలలకోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వం చెపుతోంది. ఈ లెక్కన ఏప్రిల్ నెలాఖరులో మరోమారు ప్రజాపాలన నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరు గ్యారంటీల అమలుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. 100 రోజుల్లో అమలు సాధ్యం కాదని తెలిసీ ఎందుకు గ్యారంటీ ఇచ్చారని ప్రశ్నిస్తున్నాయి. వంద రోజులు పూర్తయిన తర్వాత పోరాట కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరిస్తున్నాయి.

9

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 15 । మార్చి । 2024



నేడు మోదీ షో!

నేటి సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి మల్కాజిగిరికి.. అనంతరం తిరిగి రాజ్‌భవన్‌కు ప్రధాని..

ఆ మార్గాల్లో ట్రయల్ రన్ నిర్వహించిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో/ మల్కాజిగిరి/ సనత్‌నగర్: మల్కాజిగిరిలో నేడు సాయంత్రం 5.15 గంటలకు జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్‌షోకు సర్వం సిద్ధమైంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ మరి కొద్దిరోజుల్లో వెలువడనున్న తరుణంలో ప్రధానమంత్రి రోడ్ షో బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపనుంది. మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ నేతలు మల్కాజిగిరిలో రోడ్‌షో ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు.

రోడ్ షో ఇలా...

- ప్రధాని మోదీ రోడ్ షో మీర్జాలగూడ చౌరస్తా నుంచి సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభం కానున్నది.
- సుమారు 1.3 కి.మీ. దూరంలో ఉన్న మల్కాజిగిరి చౌరస్తా వరకు రోడ్‌షో జరుగుతుంది.
- మల్కాజిగిరి చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ ప్రసంగించే అవకాశం ఉంది.
- దారి పొడవునా సుమారు 60 స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రజలతోపాటు పార్టీ నాయకులు స్వాగతం పలికేందుకు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- రోడ్‌షోలో భాగంగా సుమారు ముప్పై కార్లతో కాన్వాయి ట్రయల్ రన్ నిర్వహించారు.

నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాని మోదీ రెండు రోజుల నగర పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ విభాగం తెలిపింది. శుక్రవారం సాయంత్రం 4.40 నుంచి 7 గంటల మధ్య బేగంపేట, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్‌రోడ్డు, ఆలుగడ్డ బావి, మెట్టుగూడ, రైల్వే హాస్పిటల్, మెట్టుగూడ రోటరీ, మీర్జాలగూడ టి-జంక్షన్, మల్కాజిగిరి ఆర్చి, లాలాపేట్, తార్నాక, గ్రీన్‌ల్యాండ్స్, మోనప్ప జంక్షన్, రాజ్‌భవన్, ఎంఎంటీఎస్ జంక్షన్, వీవీ విగ్రహం మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. ఆయా మార్గాల్లో వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించింది. అదేవిధంగా శనివారం ఉదయం 10.40 నుంచి 11.15 గంటల మధ్య ప్రధానమంత్రి రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి వెళ్తారు. ఆ సమయంలో వీవీ విగ్రహం, మెట్రో రెసిడెన్సీ లేన్, ఎంఎంటీఎస్ రాజ్‌భవన్, పంజగుట్ట, గ్రీన్‌ల్యాండ్స్, హెచ్‌పీఎస్ ఔట్ గేట్, బేగంపేట ఫ్లైఓవర్, పీఎన్‌టీ ఫ్లైఓవర్, ఎయిర్‌పోర్ట్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వివరించింది.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన భద్రతాచర్యల్లో భాగంగా రోడ్ షో జరిగే ప్రాంతం చుట్టూ నిషేధాజ్ఞలు విధిస్తూ కమిషనర్ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఎయిర్ బెలూన్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్, ప్యారా గ్లైడింగ్‌లను నిషేధించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రోడ్ షో ముగిసే వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

రహదారి మళ్లింపులు ఇలా..


- మెట్టుగూడ నుంచి మీర్జాలగూడ క్రాస్ రోడ్, నేరేడ్‌మెట్ వైపునకు వచ్చే ప్రయాణికులు శాంతినగర్ టీ జంక్షన్ వద్ద మళ్లించి, లాలాపేట మీదుగా జెడ్‌టీసీ, మౌలాలి, రమాదేవి, ఈసీఐఎల్ మీదుగా నేరేడ్‌మెట్‌కు చేరుకోవాలి.
- నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్, సఫిల్‌గూడ జంక్షన్ మీదుగా మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్స్‌కు వచ్చే వాహనదారులు ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్ వద్ద మలుపు తీసుకొని ఉత్తమ్ ఆర్‌యూబీ మీదుగా ఉత్తమ్ నగర్, ఏఓసీ రూట్, సికింద్రాబాద్ మీదుగా వెళ్లిపోవాలి.
- జెడ్‌టీసీ జంక్షన్ నుంచి ఆనంద్‌బాగ్‌కు వచ్చే వాహనాలు జెడ్‌టీసీ వద్ద మళ్లించి, మౌలాలి, రమాదేవి, ఈసీఐఎల్, నేరేడ్‌మెట్, వినాయక్‌నగర్ మీదుగా వెళ్లిపోవాలి.

మోదీ రాక.. భద్రత కట్టుదిట్టం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల(నేడు, రేపు) నగర పర్యటన దృష్ట్యా భద్రతను కట్టుదిట్టం చేశారు. మోదీ విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న నేపథ్యంలో దానిని కేంద్ర బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ పరిసరాలను అణువణువూ జాగిలాలతో జల్లెడ పట్టాయి. ప్రధాని పయనించే మార్గాల్లో పోలీసులు గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. నేడే మోదీ రోడ్ షో పూర్తిచేసుకుని తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. శనివారం ఉదయం 10.40 నుంచి 11.15 మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

పార్కింగ్‌లు ఇక్కడే..

రోడ్ షోకు హాజరయ్యేవారు తమ వాహనాలను అనుటెక్స్ పెట్రోల్ బంక్, అషూర్‌ఖానా మైదానం, ప్రశాంత్ నగర్, జైన్ కన్‌స్ట్ర క్షన్, సఫిల్‌గూడ ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల లోపు పార్కింగ్ చేయాలి. ఆ సమయం తర్వాత పార్కింగ్ చేయడానికి అనుమతి లేదు.



నేటి నుంచి టీఎస్ సిరీస్ స్థానంలో 'టీజీ'

ఇక బండికి 'టీజీ'

- గ్రేటర్‌లో రోజుకు 2 వేలకుపైగా కొత్త వాహనాల నమోదు
- ప్రత్యేక నంబర్ల రిజర్వేషన్లు కూడా ప్రారంభం
- ఇప్పటికే బిడ్డింగ్ అయినవాటికి పాత సిరీస్ నంబర్లే..
- నగరంలో ఇక మూడు రకాల సిరీస్ వాహనాల దర్శనం



సాక్షి, సిటీబ్యూరో: బండి నంబర్‌ప్లేట్‌పై ఇక నుంచి టీఎస్‌కు బదులు 'టీజీ'సిరీస్ రానుంది. శుక్రవారం (నేటి) నుంచి టీజీ సిరీస్‌పైనే వాహనాలు రిజిస్టర్ అవుతాయి. ఈ మేరకు 'టీజీ'కి కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత 'టీఎస్'స్థానంలో రవాణాశాఖ కొత్తగా 'టీజీ'సిరీస్‌ను ప్రవేశపెట్టింది. సాధారణ నంబర్లపైన రిజిస్టర్ చేసుకొనే వాహనాలతోపాటు ప్రత్యేక నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకొనే వాహనదారులు కూడా శుక్రవారం నుంచి 'టీజీ'సిరీస్‌పైనే తమకు నచ్చిన నంబర్లకు బిడ్డింగ్ దాఖలు చేయవచ్చు. అయితే ఇప్పటికే టీఎస్ సిరీస్ నంబర్లపైన ఆన్‌లైన్ బిడ్డింగ్ చేసిన వాహనదారులకు మాత్రం పాత నంబర్లనే కేటాయించనున్నట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) రమేశ్ తెలిపారు. ఉద్యమకాలంలో 'తెలంగాణ'అనే పదానికి సంక్షిప్తరూపంగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'టీజీ'సిరీస్ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అమల్లోకి వస్తుందని అప్పట్లో అందరూ భావించారు. ఈ మేరకు కొందరు వాహనాలకు 'టీజీ'అని ప్రత్యేకంగా స్టిక్కర్లు కూడా అతికించుకున్నారు. కానీ, అప్పటి ప్రభుత్వం అందరి అంచనాలకు భిన్నంగా 'టీజీ'కి బదులు 'టీఎస్'ను అమల్లోకి తెచ్చింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాహనాల రిజిస్ట్రేషన్ సిరీస్‌ను 'టీఎస్'నుంచి 'టీజీ'గా మార్చాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్రం నుంచి తాజాగా ఆమోదం కూడా లభించింది.

కొత్త సిరీస్ ఇలా...

గ్రేటర్‌లోని ఖైరతాబాద్, మెహదీపట్నం, అత్తాపూర్, మలక్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, కూకట్‌పల్లి, బండ్లగూడ కార్యాలయాల్లో ప్రతిరోజు 2 వేలకు పైగా కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 1,500 వరకు ద్విచక్ర వాహనాలు కాగా, మిగతావి కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. వాహనాల కొనుగోలు సమయంలోనే షోరూమ్‌లలో తాత్కాలిక నంబర్లపై నమోదు చేస్తారు. అనంతరం శాశ్వత రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లవలసి ఉంటుంది. ఈ క్రమంలో రవాణాశాఖ ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేసే 10 వేల నంబర్లపైన వాహనాలను నమోదు చేస్తుంది. ప్రతీ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఏ రోజుకారోజు నమోదయ్యే వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఈ నంబర్లను విడుదల చేస్తారు. వాహనదారులు తమకు నచ్చిన ప్రత్యేక నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ చేయవచ్చు. '9999', '999', '1234', '6666'వంటి ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనదారులు రూ.లక్షలు చెల్లించి పోటీపడటం గమనార్హం. కొత్త సిరీస్ ప్రకారం... ఖైరతాబాద్‌లో నమోదయ్యే వాహనాలు 'టీజీ 09 - 001'నుంచి ప్రారంభమవుతాయి. అన్నిచోట్ల 001 నుంచే సిరీస్ ప్రారంభం కానుంది. ఉదాహరణకు మెహదీపట్నం టీజీ 13 -001, మలక్‌పేట్ టీజీ 11 -001, సికింద్రాబాద్ టీజీ10 -001, బండ్లగూడ టీజీ12 -001 గా ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలోని అత్తాపూర్ టీజీ7- 001, ఇబ్రహీంపట్నం కార్యాలయాల్లో టీజీ 7ఏ -001గా, మేడ్చల్ 8-001, ఉప్పల్ టీజీ 8ఏ -001, కూకట్‌పల్లి కార్యాలయంలో 8బీ-001 కొత్త సిరీస్ ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

పాత సిరీస్ వద్దంటే డబ్బులు లాస్...

'టీఎస్'సిరీస్‌పైన ప్రత్యేక నంబర్‌ల కోసం ఇప్పటికే పోటీపడ్డ వాహనదారులు ఈ సిరీస్ ముగిసే వరకు అంటే.. మరో 15 రోజులపాటు తాము ఎంపిక చేసుకున్న నంబర్లపై(పాత టీఎస్ ప్రకారం) వాహనాలను నమోదు చేసుకోవలసి ఉంటుంది. టీఎస్ వద్దనుకుంటే మాత్రం ఆన్‌లైన్ ఇప్పటికే బిడ్డింగ్‌లో చెల్లించిన డబ్బులు కోల్పోవలసిందేనని జేటీసీ రమేష్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాత సిరీస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నంబర్లను యథావిధిగా వినియోగించుకోవడం మంచిదని ఆయన సూచించారు.

సిటీలో ఇక ట్రిపుల్ సిరీస్ చూడొచ్చు...

తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో 'ఏపీ'సిరీస్‌పై నమోదైన వాహనాలు గ్రేటర్‌లో లక్షలాదిగా ఉన్నాయి. రాష్ట్రం అవతరించిన తరువాత 'టీఎస్'సిరీస్ ప్రారంభమైనప్పటికీ పాత 'ఏపీ'సిరీస్‌ను అలాగే ఉంచారు. ప్రస్తుతం 'టీఎస్' స్థానంలో 'టీజీ'వచ్చినప్పటికీ ఈ పదేళ్లలో 'టీఎస్'పైన నమోదైన వాహనాలు అలాగే ఉంటాయని జేటీసీ వివరించారు. కొత్తగా నమోదయ్యే వాటికి మాత్రమే 'టీజీ'రానుంది. దీంతో నగరంలో ఇక నుంచి 'ఏపీ', 'టీఎస్' 'టీజీ'అనే మూడు రకాల సిరీస్ వాహనాలు దర్శనమివ్వనున్నాయి.



'పానీ' పాట్లకు దర్పణం..





వాటర్.. ఇప్పుడదే మ్యాటర్. ఎండలు మండేకొద్దీ 'పానీ'పాట్లు పెరుగుతున్నాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లల్లో దాహార్తి సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. జనం నీరు లేక నోరు ఎండే పరిస్థితి ఏర్పడుతోంది. బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో వాటర్‌వర్క్స్ విభాగాన్ని ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ బుక్ చేసుకున్న రెండు, మూడురోజులకుగానీ వాటర్ ట్యాంకర్లు రావడంలేదు. కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద బారులు తీరిన ఈ ట్యాంకర్లు నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యకు దర్పణం పడుతున్నాయి. ఎండాకాలం ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మండువేసవిలో ఇంకా ఏవిధంగా ఉంటుందో మరి!

పిల్లలూ... పాఠం అర్థమైందా!

కాసేపు ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

- మల్లేపల్లి తెలుగు, ఉర్దూ ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీ



బోర్డుపై అక్షరాలు దిద్దిస్తున్న జిల్లా కలెక్టర్

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికార హోదాను కాసేపు పక్కన పెట్టి టీచర్‌గా మారిపోయారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. టీచర్లలో ఉత్తేజం నింపారు. ఈ సన్నివేశం గురువారం మల్లేపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. విద్యార్థులు చదువుతున్న తీరును గమనించారు. ఈ క్రమంలో ఆయన విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఉపాధ్యాయులతో బోధనలు చేయించారు. 'పాఠం అర్థమైందా పిల్లలూ..'అని ఆరా తీశారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, డీఈఓ రోహిణి, తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు చురకలు.. మల్లేపల్లి ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల తలుపులను ఆకతాయిలు రాత్రివేళల్లో పగులగొట్టి లోనికి చొరబడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని టీచర్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలోనూ స్కూల్‌లోని కంప్యూటర్లు ఎత్తుకెళ్లారని చెప్పారు. అయితే అక్కడే ఉన్న హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబును పిలిచి 'దొంగలు పడితే ఏం చేస్తున్నారు' అని కలెక్టర్ చురకలు అంటించారు. వెంటనే దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కాగా, కలెక్టర్ నాంపల్లి ఏరియా ఆసుపత్రికి చేరుకుని అక్కడి వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

అనూహ్యంగా రా..గిడి

- మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్
- శంభీపూర్ స్థానంలో తెరపైకి లక్ష్మారెడ్డి



ఉప్పల్: ఉప్పల్ ప్రాంతానికి చెందిన రాగిడి లక్ష్మారెడ్డి పేరును బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించారు. నిన్నటి వరకు శంభీపూర్ రాజు పేరు ప్రచారంలో ఉండగా అనూహ్యంగా తాజాగా రాగిడి లక్ష్మారెడ్డి పేరు తెర్పైకి వచ్చింది. గత 27 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ జనరల్ సెక్రటరీతోపాటు పలు కీలకబాధ్యతలు నిర్వహించారు. అయితే ఆయన గత నాలుగు పర్యాయాలుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడ్డారు. తాజా ఎన్నికల్లోనూ ఉప్పల్ నియోజకవర్గం నుంచి టికెట్ దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది కాంగ్రెస్ పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేసి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపులో రాగిడి కీలకపాత్ర పోషించారు. మాతృమూర్తి మధుర పేరు మీద 20 ఏళ్లుగా చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్య, వైద్యం ఉపాధి లాంటి అనేక సేవాకార్యక్రమాలను నిర్వహించారు.

పేరు: రాగిడి లక్ష్మారెడ్డి
పుట్టిన తేదీ: 10-02-1968
విద్యార్హతలు: బీకాం, సిటీ కళాశాల
నివాసం: హబ్సిగూడ గ్రీన్‌హిల్స్ కాలనీ

కుటుంబ నేపథ్యం...

భార్య: రాగిడి రజిని(గృహిణి)
సంతానం: కూతురు మౌనికారెడ్డి, కుమారుడు వెంకటసాయి రియాన్ రెడ్డి
తల్లిదండ్రులు: రాగిడి మధుర, ప్రభురెడ్డి
స్వస్థలం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్లా గ్రామం

ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఇళ్లకు పయనమైన విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న మొత్తం 4.54 లక్షలమంది విద్యార్థుల్లో పదిశాతం మినహా అందరూ హాజరయ్యారు. గ్రేటర్‌లో మొత్తం 576 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎక్కడా ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు పరీక్షాకేంద్రాల్లో గట్టి చర్యలు చేపట్టగా, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, పరీక్షల నిర్వహణ కమిటీలు పరీక్షలను పర్యవేక్షించాయి. పరీక్షాకేంద్రాలలో సీసీ కెమెరాల నిఘా కొనసాగింది. పరీక్షలు ముగిసిన వెంటనే కాలేజీల గురుకులాలు, వసతిగృహాలు ఖాళీ అయ్యాయి. విద్యార్థులు తమ స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లు విద్యార్థులతో కిటకిటలాడాయి.



లోక్‌సభ ఎన్నికలతో పాటే 'కంటోన్మెంట్'!

సన్నాహాలు చేస్తున్న అధికార యంత్రాంగం

- ఎమ్మెల్యే లాస్యనందిత మృతితో అనివార్యమైన ఉపఎన్నిక
- నియోజకవర్గంలో ఇప్పటివరకు రెండుసార్లు ఉప ఎన్నికలు
- 1957లో నియోజకవర్గం ఏర్పాటు



కంటోన్మెంట్: దేశవ్యాప్తంగా జరిగే పార్లమెంట్ ఎన్నికలతోపాటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక జరగనుంది. ఈ మేరకు దానికి సంబంధించిన అధికారిక ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. గత నెల 23న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే సార్వత్రిక ఎన్నికలకు ఒకట్రెండు రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. వీటితోపాటే దేశవ్యాప్తంగా వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సంబంధించి అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ధ్రువీకరణ కూడా పూర్తయింది. ఈ మేరకు ఉపఎన్నిక నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులు, కిందిస్థాయి సిబ్బందికి సూచించినట్లు తెలుస్తోంది.

232 పోలింగ్ బూత్‌లు...

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో 232 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మూడు బూత్‌లలో ఉపకేంద్రాలు కూడా ఉన్నాయి. మొత్తంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎన్నికల నిర్వహణకు 235 ఈవీఎంలు అవసరమవుతాయి. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 16 లేదా అంతకు మించితే, తదనుగుణంగా రెట్టింపు ఈవీఎంలు అవసరం అవుతాయి. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలకు ఇవి అదనం. బూత్ లెవల్ ఆఫీసర్‌లు, ఇతర త్రా సిబ్బంది ఏక కాలంలో పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించిన పనులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పరిమిత సంఖ్యలోనే మాత్రమే అదనపు సిబ్బంది అవసరం పడుతుందని తెలుస్తోంది.

1969లో తొలిసారి...

1957లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఏర్పడగా, 1957, 1962లో జరిగిన ఎన్నికల్లో బీవీ గురుమూర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. 1967లో కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంగా మారింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో వి.రామారావు ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఏడాది తర్వాత ఆయన పదవిలో ఉండగానే మరణించడంతో 1969లో తొలిసారిగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో రామారావు సతీమణి మంకమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు. తిరిగి 1972 సాధారణ ఎన్నికలో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచిన మంకమ్మ, 1978లో ఓటమి పాలయ్యారు. 2023 ఫిబ్రవరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్న పదవిలో ఉండగానే మృతి చెందారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిలోపే గడువు ఉండటంతో ఉప ఎన్నిక జరగలేదు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో సాయన్న కుమార్తె లాస్య నందిత ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, రెండున్నర నెలల్లోనే ఆమె రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో మరోసారి కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. సార్వత్రిక ఎన్నికలతో పాటే ఉప ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

3 నెలల్లో 439 అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. గత మూడు నెలల్లో 439 అక్రమ నిర్మాణాలను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గుర్తించి కూల్చివేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. అయితే టీఎస్ బీపాస్ అమల్లోకి వచ్చిన తర్వాత స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటైనప్పటి నుంచి మొత్తం ఎన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు తగిన చర్యలు తీసుకోవడంలేదని ఎంతో కాలంగా ఆరోపణలున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేవలం మూడు నెలల్లో తీసు కున్న చర్యల వివరాలను వెల్లడించారు. ఈ కూల్చివేతల్ని ప్రస్తావిస్తూ ప్రజలు అక్రమ నిర్మాణాలు, డీవియేషన్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



నీతూబాయి.. గంజా హోల్‌సెల్లర్!

- రాష్ట్ర వ్యాప్తంగా విక్రయదారులతో లింకులు
- కిరాణా దుకాణం మాటున గంజాయి దందా
- ఈ సొమ్ముతోనే నగరంలో పలు చోట్ల స్థిరాస్తులు కొనుగోలు
- నీతూబాయితో పాటు ఆమె ముగ్గురు కుటుంబ సభ్యులూ అరెస్టు
- సరుకు కొనేందుకు క్యూలో నిల్చున్న 13 మంది బైండోవర్
- సఫేమా చట్టాన్ని ప్రయోగించాలని పోలీసుల నిర్ణయం



గంజాయి విక్రేత నీతూబాయి



ఇంట్లో దొరికిన 22.6 కిలోల గంజాయి

సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి: చీర కట్టు, నుదుటున బొట్టు, కాళ్లకు మెట్టెలతో సాధారణ స్త్రీలాగా కనిపించే నీతూ బాయి గంజాయి సామ్రాజ్యానికి క్వీన్. బయటికి చూస్తే కిరాణం దుకాణం లోపల మాత్రం నాలు గంచెల వ్యవస్థను ఏర్పాటు చేసుకొని మరీ గంజాయి దందాను నిర్వహిస్తుంది. మంగళ్‌హాట్, ధూల్‌పేట్ నుంచి సరుకు తీసుకొచ్చి, నానక్‌రాంగూడ కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా రిటైలర్లకు విక్రయిస్తుంది. క్యూ లైన్‌లో నిల్చొని మరీ గంజాయి కొనుగోలు చేసే పరిస్థితి ఉందంటే ఆమె నెట్‌వర్క్‌ను అర్థం చేసుకోవచ్చు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) ఆపరేషన్‌లో నీతూ బాయితో పాటు ముగ్గురు కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు. వీరి నుంచి 22.6 కిలోల గంజాయితో పాటు రూ.22.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగులు, విద్యార్థులే లక్ష్యంగా..

కలపతి నీతూబాయి నానక్‌రాంగూడలో దుకాణాన్ని నడుపుతుంది. సులభమైన మార్గంలో డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో నీతూ బాయి, ఆమె కుటుంబ సభ్యులు ఏడేళ్ల క్రితమే గంజాయి దందాలోకి ఎంట్రీ ఇచ్చారు. స్థానికంగా కిలో గంజాయి రూ.8 వేలకు కొనుగోలు చేసి, ఐదు గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఒక్కోటి రూ.250–300 చొప్పున ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులకు విక్రయిస్తున్నారు. కిరాణా దుకాణం మాటున గంజాయి దందా నిర్వహిస్తున్న ఈ ముఠా రోజుకు రూ.లక్షల్లో వ్యాపారాన్ని నిర్వహిస్తుంది. వినియోగదారులు, సరఫరాదారులు ఎవరైనా సరే క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేసిన తర్వాతే సరుకు డెలివరీ అవుతుంది.

గంజా సొమ్ముతో స్థిరాస్తులు..

ఏడేళ్లుగా దందా నిర్వహిస్తున్న నీతూ బాయి వచ్చిన సొమ్ముతో నగరంలోని లంగర్‌హౌస్, గచ్చిబౌలి వంటి పలు ప్రాంతాలలో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. గతేడాది ఆగస్టులో టీఎస్ న్యాబ్‌కు ఈ ముఠా పట్టుబడిన సందర్భంలో వీరి నుంచి 16 బ్యాంకు ఖాతాలతో పాటు వాటిల్లోని రూ.1.53 కోట్ల నగదుతో, రూ.40.30 లక్షల విలువైన ప్రాపర్టీలను సైతం సీజ్ చేశారు. దీంతో తాజా కేసులోనూ గుర్తించిన స్థిరాస్తులను సీజ్ చేసి, స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మానిప్యులేటర్స్ (ఎస్ఏఎఫ్ఈఎంఏ-సఫేమా) చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. సఫేమా అనేది అక్రమ రవాణా, విదేశీ మారక ద్రవ్యాల అవకతవకలకు పాల్పడే నేరస్తులు అక్రమంగా సంపాదించిన సంపదను జప్తు చేయడానికి ఉద్దేశించబడిన చట్టం. నేరస్తుల ఆర్థిక బలాన్ని దెబ్బతీసి, వారి వనరులను తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం.

ములుగు లింకుతో దొరికింది..

ఇటీవల ములుగు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా.. నానక్‌రాంగూడ నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలపడంతో సిద్దిపేట కమిషనర్ అనురాధ ఈ విషయాన్ని టీఎస్ న్యాబ్ బృందానికి సూచించింది. దీంతో సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసుల జాయింట్ ఆపరేషన్స్‌తో నీతూ బాయితో పాటు ఆమె భర్త మున్ను సింగ్ అలియాస్ శంకర్ సింగ్, సురేఖ, మమతలను అరెస్ట్ చేశారు. ధూల్‌పేట్‌కు చెందిన అంగూరి, కలపతి గౌతమ్ సింగ్, నేహాబాయిలు పరారీలో ఉన్నారు. పోలీసుల దాడుల సమయంలో నీతూబాయి వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న 13 మంది కస్టమర్లను పోలీసులు బైండోవర్ చేశారు.

నీతూ గంజా చరిత్ర..

తొలిసారిగా 2017లో నీతుబాయిపై శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2021 సెప్టెంబర్ వరకు ఆమెపై 12 కేసులు నమోదు కావడంతో పోలీసులు పీడీ చట్టాన్ని ప్రయోగించారు. ఏడాది పాటు జైలులో గడిపిన నీతూ ప్రవర్తనలో మార్పు రాలేదు. గతేడాది అక్టోబర్ వరకు ఆమెపై మరో ఆరు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదయ్యాయి. దీంతో మరోసారి ఆమెపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలని పోలీసులు నిర్ణయించారు.

కొరియర్‌లో గంజాయి చాక్లెట్లు

- బిహార్ నుంచి నగరానికి సరఫరా
- కార్మికులు, విద్యార్థులకు విక్రయం
- రెండు వేర్వేరు కేసులలో 21 వేల చాక్లెట్లు స్వాధీనం
- మేడ్చల్ ఎస్‌ఓటీ దాడిలో ఇద్దరు అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: వాహనాలలో గంజాయి సరఫరాపై పోలీసుల నిఘా పెరగడంతో గంజాయి పెడ్లర్లు రూటు మార్చారు. బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి కొరియర్‌లో గంజాయి చాక్లెట్లను నగరానికి తీసుకొస్తున్నారు. ఆపై వీటిని స్థానికంగా కిరాణా దుకాణాల ద్వారా విద్యార్థులు, నిర్మాణ కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొరియర్‌లో అయితే పోలీసుల తనిఖీలతో పాటు విక్రయం సమయంలో స్థానికులకు ఎలాంటి అనుమానాలు రావని పెడ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకున్నారని మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) డీసీపీ డీ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. తాజాగా రెండు వేర్వేరు కేసులలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.41 వేలు విలువ చేసే 21 వేలకు పైగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలివే..

- బీహార్‌కు చెందిన శిబు కుమార్ జీడిమెట్లలోని రామిరెడ్డి నగర్‌కు వలస వచ్చి కిరాణా షాపును నడుపుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆశించిన స్థాయిలో డబ్బు రాకపోవడంతో గంజాయిని విక్రయించి సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి కిరాణా షాపు మాటున ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు విక్రయించడం మొదలుపెట్టాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు నిందితుడు శిబు కుమార్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ. 11,500 విలువ చేసే 150 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- బిహార్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు సీతారాం సింగ్ పఠాన్ చెరువు వేంకటేశ్వరా కాలనీలో కిరాణా షాపును నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు చేతి సంచిలో గంజాయి చాక్లెట్లు తీసుకెళ్లి రామచంద్రాపురం, బాలాజీనగర్ ప్రాంతంలోని లేబర్ అడ్డాలలో వలస కూలీలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ, ఆర్సీపురం పోలీసులు నిందితుడు సీతారాం సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.30 వేలు విలువైన 1,960 చాక్లెట్లు (49 ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకున్నారు.

గంజా విక్రయిస్తున్న స్టూడెంట్లు..

పాకెట్ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను మాదాపూర్ ఎస్‌ఓటీ, మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయికి బానిసలైన గణపతినీడి సంతాన్, శాకమూరి తేజేస్‌లు ఆల్విన్ క్రాస్ రోడ్‌లోని ఎస్ఎస్ రాయల్ సూట్ లాడ్జ్ వద్ద విద్యార్థులు, కూలీలకు గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిజాంపేటలోని శేఖర్ పాన్ షాప్, కింగ్ పాన్ షాప్‌లలో నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. కూకట్‌పల్లికి చెందిన సీ చంద్రశేఖర్, మియాపూర్‌కు చెందిన కే బాలరాజులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.16 వేలు విలువ చేసే 114 ప్యాకెట్ల నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

వివాహేతర సంబంధం.. హోటల్ యజమాని హతం



మహ్మద్ గౌస్(ఫైల్)

ముషీరాబాద్: ఓ మహిళతో హోటల్ యజమాని, అందులో పని చేసే కార్మికుడు ఒకరికి తెలియకుండా ఒకరు అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ ఆ విషయం తేటతెల్లం కావడంతో ఆ హోటల్ కార్మికుడు హోటల్ యజమానిని దారుణంగా హత్య చేసిన సంఘటన గురువారం మధ్యాహ్నం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోలక్‌పూర్‌లోని మండి గల్లీలోని బిలాల్ మసీద్ వద్ద మహ్మద్ గౌస్(45) కొంత కాలంగా మాలిక్ ఛాయ్ పేరుతో హోటల్‌ని నిర్వహిస్తున్నాడు. కుటుంబం డబీర్‌పురాలో నివాసం ఉంటోంది. మహ్మద్ గౌస్ రెండు రోజులు ఇక్కడ మరో రెండు రోజులు ఇంటికి వెళ్లి వస్తుంటాడు. తన హోటల్ భవనంలోనే ఓ రూమ్‌ను అద్దెకు తీసుకోని అందులోనే నివసిస్తున్నాడు. ఈ క్రమంలో మహ్మద్ గౌస్‌కు ఆ ఇంటి యజమాని భార్యతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ వ్యవహారం కొనసాగుతున్న క్రమంలోనే ఆ మహిళ భర్త చనిపోవడంతో అప్పటి నుంచి ఈ వివాహేతర సంబంధం మరింత బలపడింది. ఇదిలా ఉండగా మహ్మద్ గౌస్ హోటల్‌లో కార్మికుడిగా ఫయాజ్ అహ్మద్(45) పని చేస్తున్నాడు. ఈ ఫయాజ్ అహ్మద్‌తో కూడా ఆ మహిళ వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకుంది. ఇటీవల ఫయాజ్ అహ్మద్ ఆ మహిళను వివాహం చేసుకున్నానని బయట ప్రచారం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న హోటల్ యజమాని మహ్మద్ గౌస్ ఫయాజ్ అహ్మద్‌ను పనిలో నుంచి తొలగించాడు. దీంతో ఇద్దరి మధ్య కొంత కాలంగా విబేధాలు పెరిగి పెద్దగా మారాయి. గత శనివారం ఫయాజ్ అహ్మద్, మహ్మద్ గౌస్‌ల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో మహ్మద్ గౌస్‌ను ఎలాగైనా హతమార్చాలని ఫయాజ్ అహ్మద్ పథకం పన్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 1.30 సమయంలో హోటల్‌లో ఉన్న మహ్మద్ గౌస్ వద్దకు వచ్చి తనతో తెచ్చుకున్న కత్తితో మర్మాంగాల సమీపంలో, తొడపై, పొత్తి కడుపులో పొడిచాడు. దీనిని ప్రతిఘటించేందుకు మహ్మద్ గౌస్ ప్రయత్నించాడు. ఈ దాడిలో గౌస్‌కు కత్తిపోట్లు బలంగా దిగడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడే ఉన్న మెట్లపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది చూసిన స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం చేరవేయడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మహ్మద్ గౌస్‌ను గాంధీ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే మహ్మద్ గౌస్ ఆసుపత్రికి చేరిన కొద్ది సేపటికే మృతి చెందాడు. ఇదిలా ఉండగా మహ్మద్ గౌస్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన ఫయాజ్ అహ్మద్ నేరుగా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు తెలుస్తుంది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకోని హత్యకు గల కారణాలపై విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం అతడు తమ అదుపులో లేడని పేర్కొంటున్నారు.

‘రేవంత్ రెడ్డి కూడా మరో కేసీఆర్‌లా మారే అవకాశం’



పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మరో కేసీఆర్‌లా మారే అవకాశం ఉందని, అలా మారకుండా తెలంగాణ సమాజం చూసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లౌకిక ప్రజాస్వామిక ఐక్య కార్యాచరణ వేదిక, తెలంగాణ ప్రజాస్వామ్య రక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పెట్టిన కేసులు కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో ఉద్యమకారులపై పెట్టిన తప్పుడు కేసులన్నీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, న్యూ డెమొక్రసీ నాయకుడు గోవర్ధన్, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, నైనాల గోవర్ధన్, సోగరాబేగం, సతీష్ కమల్‌తో పాటు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ .. తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఏర్పడగానే అమరులను ఆదుకోవాలి, ఉద్యమకారుల కేసులు ఎత్తేయ్యాలి కాని 2014 నుండి 2023 వరకు అనేక మంది ఉద్యమకారులపై తిరిగి కేసుల్లో ఇరికించారని ఆగ్రహంవ్యక్తం చేవారు. నాలుగు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోని కేసులు ఎత్తెయ్యాలని లేనిపక్షంలో ఇందిరాపార్క్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనకంజవేయ్యమని హెచ్చరించారు.

తల్వార్ గాలిలో తిప్పుతూ రౌడీషీటర్ హల్‌చల్

రహమత్‌నగర్: పుట్టిన రోజు సందర్భంగా తల్వార్‌ను గాలితో తిప్పుతూ విన్యాసాలు చేసిన ఓ రౌడీ షీటర్‌ను బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో అబ్దుల్ అమీర్ పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 10న రాత్రి జరిగాయి. వేడుకల్లో భాగంగా సదరు రౌడీ షీటర్ తల్వార్‌తో విన్యాసం చేసి ఆ వీడియోను తన ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్టు చేశాడు. దాన్ని గుర్తించిన పోలీసులు బుధవారం రౌడీ షీటర్‌ను అదుపులోకి తీసుకొని ఆరమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీరియల్ నటి భర్త పై కేసు

బంజారాహిల్స్: బుల్లితెర సీరియల్ నటి భర్తపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుల్లితెర నటి ఐశ్వర్యకు గతేడాది డిసెంబర్లో వైజాగ్‌కు చెందిన శ్యామ్ కుమార్ వివాహం జరిగింది. కొద్ది రోజులకే ఇద్దరి మధ్య విబేదాలు రావడంతో దూరంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా వీరి వివాహం కన్నా ముందే కమలాపురి కాలనీలో నివాసముండే కె రమేష్‌బాబుతో ఐశ్వర్యకు పరిచయం ఉంది. దీన్ని అడ్డుగా పెట్టుకున్న శ్యామ్ కుమార్ గతేడాది రమేష్‌బాబుకు ఫోన్ చేశాడు. ఐశ్వర్య, రమేష్‌బాబుకు సంబంధించిన కొన్ని చిత్రాలు తన వద్ద ఉన్నాయని వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయకుండా ఉండాలంటే పదిలక్షల రూపాయలు కావాలని డిమాండ్ చేశాడు. తాను ఎటువంటి తప్పు చేయకపోవడంతో రమేష్‌బాబు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా ఐశ్వర్య, రమేష్‌బాబు కలిసి ఉన్న కొన్ని ఫోటోలను శ్యామ్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కొన్ని యూట్యూబ్ వీడియోల్లో శ్యామ్ మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 10న వీరిద్దరు కలిసి ఉన్న ఫోటో అని చెప్పాడు. శ్యామ్ పేర్కొన్న తేదీలో తాను వ్యాపార పనుల నిమిత్తం ఆస్ట్రేలియాలో ఉన్నట్టు ఆధారాలు, స్టాంపింగులు ఉన్నాయని డబ్బుతో పాటు తన పరువు తీసేందుకే శ్యామ్ కుమార్ అబద్దపు ప్రచారం చేస్తున్నాడని పేర్కొంటూ రమేష్‌బాబు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు 385,504,506 ఐపీసీతో పాటు సెక్షన్ 66,67 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు



నకిలీ వైద్యుడు రాజు

అంబర్‌పేట్: నకిలీ వైద్యుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు రామంతాపూర్‌కు చెందిన రాజు గంగారాం అంకల్ప్ (53) వైద్యంలో కొంత ప్రావీణ్యాన్ని సంపాదించాడు. వైద్యానికి సంబంధించి ఎలాంటి అర్హత లేని రాజు అంబర్‌పేట పటేల్‌నగర్‌లో శ్రీసాయి వెంకటేశ్వర క్లినిక్‌ను నెలకొల్పాడు. అమయాకులను అసరాగా చేసుకుని వైద్యం అందిస్తూ అందిన కాడికి డబ్బులు దండుకొని ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడు. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం రాజు క్లినిక్ పై దాడి చేయగాఅతని అర్హతలు నకిలీవని తేల్చింది. దీంతో వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ ఎస్.రశ్మీ పెరుమాల్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సై నాగేశ్‌లు తమ సిబ్బందితో నకిలీ వైద్యుని అటకట్టించారు. తదుపరి కేసు విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు.

ప్రైవేటు హాస్టల్‌లో యువతి ఆత్మహత్య



సాహితి (ఫైల్)

చైతన్యపురి: చైతన్యపురి పరిధిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం, అలుబాక గ్రామానికి చెందిన వెంకట సుబ్బారావు కూతురు సుంకర సాహితి (26) ఎంబిఏ పూర్తి చేసింది. రెండు నెలల క్రితం ఉద్యోగాన్వేషణ కోసం నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లని లక్ష్మి ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. బుధవారం సాయంత్రం హాస్టల్ గదిలో సాహితి ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయి ఉండటం గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు, మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలుసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. గురువారం తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సాహితి మృతికి ప్రేమ వ్యవహారం కారణం అయి వుండవచ్చని బావిస్తున్నారు. మృతురాలి కాల్‌డేటా, ఫోన్ చాటింగ్‌లను పరిశీలిస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

– డ్రైవర్ మృతి



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ ప్రభు



ప్రభు (ఫైల్)

గచ్చిబౌలి: గ్లాస్ లోడ్‌తో వేగంగా వచ్చిన ఓ లారీ ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు.. తమిళనాడుకు చెందిన అయ్యందురై ప్రభు(32) ఉత్తరప్రదేశ్ నుంచి లారీలో గ్లాస్ లోడ్ చేసుకొని కేరళ బయలుదేరాడు. సేలంకు చెందిన మరో డ్రైవర్ మతియలగన్ క్యాబిన్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. పటాన్‌చెరు నుంచి శంషాబాద్ వైపు లారీ వస్తుండగా గురువారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో వట్టినాగులపల్లి శివార్లలో ఔటర్‌పై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో క్యాబిన్‌నుజ్జు నుజ్జు కావడంతో డ్రైవర్ ప్రభు అక్కడికక్కడే మృతి చెందాడు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని క్రేన్ సహాయంతో వెలికి తీశారు. క్యాబిన్‌లో నిద్రిస్తున్న మరో డ్రైవర్ మతియ లగన్ ఎగిరి బయటపడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సుల్తాన్‌పూర్ నుంచి కోకాపేట్‌కు డస్ట్ లోడ్‌తో వస్తున్న టిప్పర్ టైర్ పేలిపోవడంతో ఆగిపోయింది. సమీపంలో ఉన్న గస్తీ సిబ్బందికి టైర్ పేలిపోయిందని చెబుతుండగానే లారీ వచ్చి ఢీ కొట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిచారు.

విద్యార్థిని పట్ల పాఠశాల కార్యదర్శి అసభ్య ప్రవర్తన

చాంద్రాయణగుట్ట: విద్యాబుద్ధులు నేర్పే స్థానంలో ఉన్న ఓ వ్యక్తి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. లాల్‌దర్వాజాకు చెందిన ఓ పాఠశాలలో 14 ఏళ్ల బాలిక విద్యనభ్యసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం బాలిక తరగతి గదికి వెళుతుండగా, పాఠశాల కార్యదర్శి చంద్ర ప్రకాష్ వర్మ స్టాఫ్ రూంలోకి రమ్మని సూచించాడు. ఎందుకు పిలుస్తున్నాడో తెలియక బాలిక గదిలోకి వెళ్లగానే చాక్లెట్ ఇస్తూ....అసభ్యంగా ప్రవర్తించాడు. అతని నుంచి విడిపించుకొని బాలిక తరగతి గదికి వెళ్లింది. అనంతరం బాలిక భయపడుతూ ఇంటికి వెళ్లింది. బాలిక స్థితిని గమనించిన కుటుంబ సభ్యులు ఏం జరిగిందని ప్రశ్నించగా జరిగిన విషయాన్ని వెల్లడించింది. దీంతో బుధవారం రాత్రి ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కార్యదర్శి చంద్ర ప్రకాష్ వర్మను అదుపులోకి తీసుకున్నారు.

రవాణా శాఖ డైరీని ఆవిష్కరించిన పొన్నం



సాక్షి, సిటీబ్యూరో : రవాణాశాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గురువారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మార్గం రవీందర్,ఉపాధ్యక్షులు కొండయ్య మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిత్రాలకు మా మద్దతు: మంత్రి కోమటిరెడ్డి


సినీ యూనిట్‌ను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: చిన్న చిత్రాలకు ప్రభుత్వ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, చిన్న చిత్రాల వల్ల కూడా సినీ ఇండస్ట్రీకి ఎంతో మేలు జరుగుతుందని అలాంటివారికి తాను అండగా ఉంటానని సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద నేపథ్యంగా దర్శకుడు ప్రణీత్, నిర్మాతలు సంపత్ మాక, విజయ్ శేఖర్‌లు పాతంగ్ అనే సినిమాను రూపొందించారు. ఇందులో భాగంగా కొద్ది రోజుల క్రితం 'హే హలో నమస్తే' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్ది వ్యూస్ రావడంతో మంత్రి ఈ చిత్ర బృందాన్ని బంజారాహిల్స్‌లోని తన నివాసానికి పిలిచి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఈ సినిమా నేపథ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిన్న సినిమాల వల్ల ఎంతో మంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు ఉపాధి లభిస్తున్నదని అందువల్ల చిన్న సినిమాలకు ఎటువంటి సహాయం కావాలన్నా ప్రభుత్వం తరపున తాము అందిస్తామని హామీ ఇచ్చారు. హీరో హీరోయిన్లు వంశీ పుజిత్, ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్‌లతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్ నాని బండ్రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిఖిల్, రమేష్ మట్టా, రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన గురువారం స్వామివారు ఉదయం సూర్యప్రభవాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై తిరు వీధుల్లో ఊరేగారు. అశేష భక్తజన సందోహం మధ్య స్వామివారి పల్లకీ సేవలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్నపన తిరుమంజనం, సుప్రభాతం, సల్లింపు, పూజాదికాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేటర్ దేదీప్యకు పలువురి పరామర్శ


దేదీప్యను పరామర్శిస్తున్న దృశ్యం

వెంగళరావునగర్: మహిళా కార్పొరేటర్‌పై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. మధురానగర్ కాలనీలోని కార్పొరేటర్ దేదీప్య విజయ్ కార్యాలయానికి గురువారం బోరబండ మహిళలు వచ్చి పరామర్శించారు. బీఆర్ఎస్ మహిళా నేతలు జె.ఎల్.మేరీ, జె.అజయకుమారి, భాగ్యలక్ష్మి, అఫ్జల్ బేగం, చంద్రకళ, కుమారి పాల్గొన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం నేతలు కార్పొరేటర్ దేదీప్య విజయ్‌ను పరామర్శించారు. మహిళా నేతలు కె.సుగుణ, డి.సుగుణమ్మ, నిర్మల, చంద్రావతి, పద్మావతి, హరిత, సుధాలలిత, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3 శ్రీనగర్ కాలనీ రత్నగిరి సూపర్‌మార్కెట్ లైన్ రూ. 65 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన వీడీసీసీ రోడ్డు పనులను గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే రత్నదీప్ లైన్‌లో రాకపోకలు మరింత సులువవుతాయని, గుంతల సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. స్థానికులు ఎన్నోసార్లు ఈ రోడ్డు విషయంలో ఇబ్బందులు పడ్డారని, ఇప్పటికి నిధులు మంజూరు కావడం జరిగిందని వివరించారు. రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

పీఆర్‌సీలో నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి

హిమాయత్‌నగర్: వేతన సవరణలో (పీఆర్‌సీ) నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం వేతన సవరణ సంఘాన్ని కోరింది. పెరిగిన ధరలు, జీవన వ్యయం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ సంఘం నాలుగో తరగతి ఉద్యోగులకు బేసిక్ పే రూ. 35 వేలు ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరుల నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతిపాదనలు అందచేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ పెంచాలని విన్నవించారు. సంఘం నేతలు దర్యా నాయక్, ఖాదర్ బిన్ హసన్, కే.ధన్ రాజ్, బి.రాజేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో మోసం

హిమాయత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని నమ్మించి ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం నగరానికి చెందిన ఓ మహిళ(36)కి వాట్సాప్‌లో పార్ట్ టైమ్ జాబ్ పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. ఈ లింక్ ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు సృష్టించిన వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయింది. అందులో వారు చెప్పిన విధంగా యూట్యూబ్ వీడియోలను ఎక్కువ మందితో లైక్, సబ్‌స్క్రైబ్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. అనంతరం బాధితురాలిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఇందులో తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో వారు చెప్పిన విధంగా విడతల వారిగా బాధిత మహిళ మొత్తం రూ.7,74,610 పెట్టుబడి పెట్టింది. అనంతరం ఆ డబ్బు తిరిగి విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని బాధిత మహిళ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపారు.


రోడ్డు నిర్మాణం కోసం తొలిచిన కొండ

కొండను తొలిచి.. రోడ్డుగా మలిచి...!

రూ. 2 కోట్ల వ్యయంతో పూర్తికావస్తున్న రోడ్డు పనులు

నెల రోజుల్లో అందుబాటులోకి అన్నపూర్ణ రోడ్డు

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్, శ్రీనగర్‌కాలనీ వైపు నుంచి బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వైపు వెళ్లాలంటే ఇప్పుడున్న మార్గం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఇది దూరభారం మాత్రమే కాకుండా ట్రాఫిక్ రద్దీలో వ్యయప్రయాసలకోర్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టును దాటి వెళ్లాలంటే నరకం కనిపించేది.

- ఇప్పుడు ఈ ట్రాఫిక్ ఇక్కట్లకు తెరదించే క్రమంలో అధికారులు అన్నపూర్ణ స్టూడియో వద్ద రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ మూడేళ్ల క్రితం రూ.2 కోట్ల వ్యయంతో అన్నపూర్ణ స్టూడియో వద్ద ఈ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది.
- యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ నుంచి అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల గేటు, జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ కార్యాలయం మీదుగా అన్నపూర్ణ స్టూడియో ప్రధాన గేటు ముందు నుంచి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2 వైపు కేబీఆర్ పార్కు, ఎన్టీఆర్ భవన్ మీదుగా వెళ్లడానికి ఈ రోడ్డు అనుసంధాన పనులను చేపట్టడం జరిగింది. అయితే అన్నపూర్ణ స్టూడియో ముందు ఈ రోడ్డును తవ్వాలంటే బండరాళ్లతో కూడిన పెద్ద కొండ అడ్డుగా వచ్చింది. కొండను తవ్వుతూ బండరాళ్లను కొట్టే క్రమంలో 1200ఎంఎం డయా, 800ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్లు అడ్డుగా వచ్చాయి.
- దీంతో ఈ పైపులతో పాటు ఇక్కడ 40 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ఛాంబర్‌ను షిఫ్ట్ చేయడానికి ఏడాది సమయం పట్టింది. ఈ పనులు పూర్తయ్యాయి కదా? అని కొండను తొలుద్దామనుకున్న సమయంలో హైటెన్షన్ ఎలక్ట్రిక్ స్తంభాలు అడ్డువచ్చాయి. సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి పనులకు అడ్డుగా ఉన్న 33కేవీ, 11కేవీ విద్యుత్ హైటెన్షన్ స్తంభాలను మరో చోటికి షిఫ్ట్ చేశారు. ఈ పనులు జరగడానికే రెండేళ్ల సమయం తీసుకుంది. 60 అడుగుల వెడల్పు, 170 మీటర్ల పొడవుతో అన్నపూర్ణ స్టూడియో రోడ్డు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంది.
- కొండను పూర్తిగా తొలచి రోడ్డు పనులు మొదలుపెట్టారు. నెల రోజుల్లో పనులు పూర్తిచేసి వాహనదారులకు రోడ్డును అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా యూసుఫ్‌గూడ నుంచి బంజారాహిల్స్ వైపు వెళ్లే వాహనదారులకు దారి దగ్గరకానుంది. ఈ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

మూత్రపిండాల వ్యాధి బారిన యువత

బంజారాహిల్స్: యువత మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారని విరించి హాస్పిటల్ నెఫ్రాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కె.ఎస్.నాయక్ తెలిపారు. కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం విరించి హాస్పిటల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మూత్రపిండాల వ్యాధి బారిన పడడానికి ×క్రానిక్ కిడ్నీ డీసీజ్ ఆఫ్ అన్ నోన్ అరిజిన్₹ కారణమన్నారు. ఇది మూత్రపిండాల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. దీని మూలాలు అస్పష్టంగా ఉన్నప్పటికీ యువకుల్లో తీవ్రమైన అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. తెలంగాణలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధికి మధుమేహం కారణమని 2020లో జరిగిన అధ్యయనంలో వెల్లడైందన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విరించి హాస్పిటల్ వైద్యులు

అవగాహన అవసరం...

పంజగుట్ట: ప్రతి ఒక్కరూ శుభ్రమైన ఆహారం తీసుకోవడంతో పాటు తరచూ నీరు తీసుకోవాలని డెక్కన్ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.రమేష్ అన్నారు. ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో గురువారం కిడ్నీ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న వారితో, ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారితో మాట్లాడించారు. డాక్టర్ సయ్యద్ మహ్మద్ గుఫ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఫిర్యాదు

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ రోడ్డు నెంబర్-70 జర్నలిస్టుకాలనీ ఫేజ్-1లో కొంతకాలంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలానికి విముక్తి కలిగించాలంటూ ఫిలింనగర్‌కు చెందిన కాటూరి రమేష్ అనే వ్యక్తి గురువారం సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. తాను ఈ కబ్జాలపై జనవరి, ఫిబ్రవరి నెలల్లో రెండు సార్లు షేక్‌పేట తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశానని, ఆర్టీఐ కింద ఈ స్థలానికి సంబంధించి సమాచారం కోసం దరఖాస్తు కూడా చేసుకున్నానన్నారు. ఇంతవరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, చర్యలు కూడా తీసుకోలేదన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని, స్థలాన్ని కాపాడాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. జర్నలిస్టుకాలనీ ఫేజ్-1లో ఏ-3 నుంచి ఏ-9 వరకు ఉన్న ప్లాట్లకు ఆనుకుని కొండ ఉందని, ఆ కొండను తవ్వి ప్లాట్ల యజమానులు ఈ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారికి కేటాయించిన ప్లాట్ ఎన్ని గజాలు, ఇప్పుడు వారు ఉంటున్న ప్లాట్ ఎన్ని గజాలు ఉంటుందో విచారిస్తే పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన విషయాలు బయటకువస్తాయన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ఖాళీగా ఉన్న ఈ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



మాస్టర్స్ కళాశాల కేంద్రం నుంచి బయటికొస్తున్న విద్యార్థులు

వెంగళరావునగర్: ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. గతనెల 28వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం, 29 నుంచి సెకెండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని నలంద జూనియర్ కళాశాల, మాస్టర్స్ జూనియర్ కళాశాల, సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలల వద్ద వందలాది మంది విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆయా సెంటర్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించారు. దాదాపు అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి హడావుడి, అల్లర్లు, మాస్ కాపీయింగ్ లేకుండా ప్రశాంతంగా జరిగాయి. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద మధురానగర్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది ఎలాంటి అలజడులు జరగకుండా గట్టి బందోబస్తును నిర్వహించారు. చివరి పరీక్ష కూడా విజయవంతంగా ముగించుకుని బయటకు రావడం, ఎలాంటి అలజడులు లేకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కొందరు మెడిసిన్, మరికొందరు, ఇంజనీరింగ్, ఇంకొంతమంది సీఏ కొంతమంది టీచర్, లాయర్, పోలీస్, బిజినెస్, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర వృత్తుల్లో స్థిరపడాలనే ఆలోచనలో ఉన్నట్లు విద్యార్థులు తమ అభిప్రాయాలు తెలిపారు.

పవర్ బోర్ ప్రారంభం

హిమాయత్‌నగర్: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హిమాయత్‌నగర్ డివిజన్ సంజయ్ గాంధీ కాలనీలో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను గురువారం ప్రారంభించారు. వేసవిలో ప్రజలు నీటి సమస్యతో బాధపడకుండా తన ఎంపీ నిధులతో నగరంలో పలు ప్రాంతాల్లో పవర్ బోర్లను ఏర్పాటు చేసినట్లు కిషన్ రెడ్డి అన్నారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై స్థానికులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన వీలైనంత తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు.

కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

హిమాయత్‌నగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు అన్ని కులాలవారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపు 6 గ్యారంటీల అమలు జరుగుతుందని, ప్రజలకిచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయవంతంగా ముందుకు తీసుకవెళ్తున్నారని తెలిపారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాల మంజూరుతో పాటు కల్యాణ లక్ష్మి పథకంలో ఉచితంగా తులం బంగారం, ప్రజాపాలన అభయహస్తం, అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరు చేస్తామరని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని భంగం చేయకుండా, ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ పాలన కొనసాగిస్తుందని శ్రీనివాస్ తెలిపారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలి

పంజగుట్ట: గృహకార్మికుల, గార్బేజ్ కలెక్టర్లకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వీరిని గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు. మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్ట్యూట్, గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్‌స కలెక్టివ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... సమాజంలో ఎంతో అవసరమైన వృత్తిలో కొనసాగుతున్న వీరికి కనీసం గౌరవం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ కార్మిక యూనియన్ అధ్యక్షురాలు మంజుల, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్స్ కలెక్టివ్ అధ్యక్షురాలు నాగమణి , పీఓడబ్ల్యూ నాయకులు సంధ్య, వర్గీస్ తేకనాథ్, సజయ, దీపక్ జాన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



వెంగళరావునగర్: వెంగళరావునగర్ ప్రధాన రహదారిపై దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామాంజనేయ స్వామి దేవస్థానం హుండీని గురువారం లెక్కించారు. ఆదాయం మొత్తం రూ. 98,502ను భక్తులు సమర్పించినట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి.సత్యనారాయణ తెలిపారు. రెండు నెలల కాలంలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించే కార్యక్రమం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, అర్చకులు కె.వెంకటరత్నం, డి.అంబాప్రసాద్, భక్తులు లక్ష్మీపతి, రామారావు, కళ్యాణ్‌సింగ్, మధుకర్, కృష్ణశాస్త్రి తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హుండీకి తిరిగి సీలు వేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులు సమర్పించిన వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయ అభివృద్ధికి వెచ్చించనున్నట్టు తెలియజేశారు.

పాన్ డబ్బాలోని ఖరీదైన సిగరెట్ల చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని జపనీస్ గార్డెన్ పార్కును ఆనుకుని ఉన్న పాన్‌డబ్బాలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఖరీదైన సిగరెట్ బాక్స్‌లు, క్యాష్ కౌంటర్‌లో నగదును చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే..ఫిలింనగర్‌లోని ఎంఆర్‌సీ కాలనీకి చెందిన కే చంద్రశేఖర్ జపనీస్ గార్డెన్ పక్కన కొంత కాలంగా పాన్ డబ్బా పెట్టుకొని పొట్టపోసుకుంటున్నాడు. గురువారం ఉదయం పాన్ డబ్బా తెరిచేందుకు యత్నించగా సైడ్ డోర్ తెరిచి ఉండడమే కాకుండా పెద్ద ఎత్తున సిగరెట్ డబ్బాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అలాగే క్యాష్ కౌంటర్‌లో నగదు కూడా కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సుడిగాలి పర్యటన


శాలివాహననగర్‌లో జిమ్‌లో వ్యాయామం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


ఆనంద్‌నగర్ కాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: వ్యాయామాన్ని తప్పనిసరిగా చేయాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని శాలివాహననగర్‌లో ఓపెన్‌పార్క్ జిమ్‌ను ప్రారంభించారు. పలు సమస్యలను తెలుసుకొని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. నేతలు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, శాంతికుమార్, అనంతలక్ష్మి, హరీష్‌యాదవ్, పలు శాఖల జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో...

రహమత్‌నగర్: బోరబండ, రహమత్‌నగర్ డివిజన్లలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రహమత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్, బలహీన వర్గాల కాలనీలోని అంబేద్కర్‌నగర్‌లో ఎంపీ నిధులతో చేపట్టిన పవర్ బోర్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఉజ్వల యోజన పథకం కింద మహిళకు గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. సైట్-3 సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు లంకల దీపక్‌రెడ్డి, కంభాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆనంద్‌నగర్ కాలనీలో...

పంజగుట్ట: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కనీసం గంట అయినా వ్యాయామం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆనంద్‌నగర్ కాలనీలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న పార్క్‌లో ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. త్వరలో పార్కుకు ప్రహరీ నిర్మాణం, బోర్‌వెల్ నిర్మాణాలను నిధులను మంజూరు చేసి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ సింగ్ రాథోడ్, నాయకులు రాఘువరెడ్డి, శ్రవణ్‌యాదవ్, గడ్డం వెంకటస్వామి, బి.రమేష్, శ్రీకాంత్ యాదవ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యకు చికిత్స కన్నా నివారణే ముఖ్యం



ర్యాలీలో పాల్గొన్న డైరెక్టర్ బీరప్ప, డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తదితరులు

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యులు తమకు పునర్జన్మను ప్రసాదించారని పలువురు కిడ్నీ బాధితులు పేర్కొన్నారు. మూత్ర పిండాల దినోత్సవం సందర్భంగా అందరికీ కిడ్నీ వైద్యం అన్న నేపథ్యంతో గురువారం నిమ్స్‌లో ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు జరిగాయి. అవగాహన ర్యాలీ, సదస్సు, కిడ్నీ రోగుల స్పందన, వైద్యులకు క్విజ్ పోటీలతో వేడుకగా నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కిడ్నీ మార్పిడి చేయించుకున్న వాళ్లు, డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులు తమ తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిమ్స్ కులపతి డాక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ... కిడ్నీ జబ్బుకు చికిత్స కన్నా నివారణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కిడ్నీ సమస్యలు వయస్సుతో నిమిత్తం లేకుండా వస్తున్నాయన్నారు. శరీరంలో చక్కెర స్థాయిలు కంట్రోల్లో ఉంచుకోవటం, సరైన మోతాదులో వ్యాయామం చేయడం, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యమన్నారు. నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్య నారాయణ, నెఫ్రాలజీ వైద్య నిపుణులు గంగాధర్, శ్రీభూషణ్ రాజు, స్వర్ణలత, డీఎంఎస్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎయిర్‌పాడ్స్ అమ్ముతున్న మహిళలపై కేసు

బంజారాహిల్స్: నకిలీ ఎయిర్‌పాడ్స్ అమ్ముతూ అమాయకులను మోసం చేస్తున్న ఇద్దరు మహిళలపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని క్రోమా బిల్డింగ్ వద్ద ఇద్దరు మహిళలు యాపిల్ ఎయిర్‌పాడ్స్ అమ్ముతున్నారని, అవి నకిలీవని పోలీసులకు సమాచారం అందింది. జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా మహారాష్ట్రకు చెందిన బిందాబాయ్, మందా అనే ఇద్దరు మహిళలు కొంతకాలంగా ఇక్కడ నకిలీ ఎయిర్‌పాడ్స్ అమ్ముతున్నట్లుగా గుర్తించారు. రూ. 500లకు ఈ డూప్లికేట్ పాడ్స్‌ను కొనుగోలు చేసి రద్దీ ప్రాంతాల్లో రూ. 1000 నుంచి రూ. 1200లకు విక్రయిస్తున్నట్లుగా తేలింది. వీరి నుంచి 12 డూప్లికేట్ ఎయిర్‌పాడ్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళపై...

తేలికగా వచ్చే డబ్బుకు ఆశపడి ఓ మహిళ గంజాయి విక్రయాలకు శ్రీకారం చుట్టింది. అవసరమైన వారికి గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు ఆ మహిళ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని శ్రీరామ్‌నగర్‌లో నివసించే గుండేపల్లి స్టాన్ క్రిస్ చీనామురాలి (37) కొంతకాలంగా తాను గంజాయి సేవించడమే కాకుండా డబ్బు కోసం ఇతరులకు కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటుంది. బంజారాహిల్స్ పోలీసులకు పక్కా సమాచారం అందడంతో ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించగా వంద గ్రాముల గంజాయి పట్టుబడింది. ఆమెపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కుమార్తెను పరీక్ష కేంద్రం వద్ద దింపి తండ్రి అదృశ్యం


అదృశ్యమైన చంద్రశేఖర్

వెంగళరావునగర్: పరీక్ష కేంద్రం వద్ద కుమార్తెను దింపి తండ్రి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సిద్ధార్థనగర్‌లో టి.చంద్రశేఖర్, వినీల దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 1న వారి కుమార్తె నేహను మధురానగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల వద్ద ఇంటర్ పరీక్షలు రాయడానికి ద్విచక్ర వాహనంపై వచ్చి దింపి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు తల్లి వినీల వచ్చి కుమార్తెను ఇంటికి తీసుకెళ్లింది. నేహ తన గదిలోకి వెళ్ళగా అక్కడ తండ్రి సెల్‌ఫోన్ కనిపించింది. తండ్రి కోసం తల్లిని అడగ్గా తెలియదని చెప్పింది. ఇరువురూ కలిసి అనేక ప్రాంతాల్లో తెలిసిన వారిని చంద్రశేఖర్ గురించి విచారించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దాంతో అతని కుమార్తె నేహ గురువారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేర్కొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.


లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే
ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు


ప్రణీత్‌రావు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్‌రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్‌తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి. ద రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల
ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్ల అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.


ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

నగర వార్తలు

ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిర్మించతలపెట్టిన ఉస్మానియా ఫౌండేషన్ భవన్ నిర్మాణానికి వీసీ ప్రొ.రవీందర్ గురువారం శంకుస్థాపన చేశారు. రూ.10.15 కోట్ల వ్యయంతో 1.6 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ భవనం పూర్తిగా పూర్వవిద్యార్థుల కోసమే అన్నారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు గల ఉస్మానియా ఫౌండేషన్ భవన్‌లో ఫౌండేషన్ బ్లాక్, గెస్ట్ రూమ్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎగ్జామ్స్ ఓవర్.. హ్యాపీ ఇండిపెండెన్స్



హిమాయత్‌నగర్: ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఓ ఇంటర్ విద్యార్థి వినూత్న రీతిలో పరీక్ష కేంద్రం వద్ద ప్లకార్డుతో సందేశాన్ని ప్రదర్శించాడు. నారాయణగూడలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష రాసిన అనంతరం శుభం అనే ఇంటర్ విద్యార్థి 'ఎగ్జామ్స్ ఓవర్, హ్యాపీ ఇండిపెండెన్స్' అంటూ ప్లకార్డుతో సందేశాన్ని ప్రదర్శించాడు. 15 రోజులుగా తల్లిదండ్రులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా చదువుతూ గడిపారని.. ఇక స్వతంత్రంగా వారి వారి భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలనే మెసేజ్ ఇచ్చేందుకు ఈ ప్రదర్శన నిర్వహించినట్లు జియాగూడకు చెందిన విద్యార్థి శుభం పేర్కొన్నాడు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: ఎస్సీ 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజలింగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఎస్సీలోని ఉపకులాలు, (బేడ బుడగ జంగాలు, చెక్కలి, బైండ్ల, మోచీ, సమగర మోచీ, చిందు)తదితర 57 కులాలు ఆర్థిక, రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. కనీసం ఎంఆర్ఓ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం లేదని, ఆర్‌డీఓల ద్వారా తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో డిక్లరేషన్‌లో ఎస్సీ 57 ఉపకులాలకు, ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్లి రెండు మూడు రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తామని వేం నరేందర్ హామీ ఇచ్చారు.

సెల్‌ఫోన్ కోసం చంపేశారు!

చిలకలగూడ : సెల్‌ఫోన్ కోసం హత్యకు తెగబడిన ఐదుగురు సభ్యుల ముఠాను పోలీసులు రిమాండ్‌కు పంపించారు. చిలకలగూడ ఠాణాలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌తో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ వారాసిగూడ మహ్మద్‌గూడకు చెందిన సంకు రాహుల్ అలియాస్ కుమార్ (19) నామాలగుండు రాంచరణ్ పాడ్ బ్యాండ్ పార్టీలో బ్యాండ్‌మాస్టర్. అదే ప్రాంతానికి చెందిన కాపరి సూరజ్‌కుమార్ అలియాస్ సూరి (21) లేబర్. చిలకలగూడ దూద్‌బావికి చెందిన మదనరవితేజ అలియాస్ బన్నీ (19) ఫ్లవర్ డెకరేటర్, చింతబావికి చెందిన ఎంకిగారి లక్ష్మన్‌నారాయణ (19) డీజే ఆపరేటర్, వీరితోపాటు మరో మైనర్ బాలుడు (16) జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యారు. పాతనేరస్థులైన వీరంతా ముఠాగా ఏర్పడి నెమ్మదిగా కదులుతున్న రైలు డోర్ వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వారిని టార్గెట్ చేసుకుని దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నారు.

కర్రతో కొట్టి సెల్‌ఫోన్ స్నాచింగ్..

సీతాఫల్‌మండి నుంచి సికింద్రాబాద్ మార్గంలో అయా రైళ్లు నెమ్మదిగా వెళ్తుంటాయి. ముఠా సభ్యులంతా కొంత దూరంలో రైలు పట్టాల పక్కనే నిలబడి రైలు ద్వారం వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వారిని గుర్తించి పెద్ద కర్రతో చేతిపై కొడతారు. కిందపడిన సెల్‌ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి క్షణాల్లో పరారవుతారు. రైలు రన్నింగ్‌లో ఉండడంతో బాధితుడు ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉంటాడు. సెల్‌ఫోన్‌ను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకుంటారు. ఈ నెల 7న చిలకలగూడ అమర్‌టాకీస్ వద్ద చెత్తలో ఓ యువకుడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించి మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ఐదు రోజుల తర్వాత మృతుడి బంధువులు


వివరాలు వివరిస్తున్న డీసీపీ గిరిధర్, ఏసీపీ జైపాల్‌రెడ్డిలు, వృత్తంలో నిందితులు

వీడిన యువకుడి మర్డర్ మిస్టరీ

- హతుడు నంద్యాల జిల్లావాసి
- నిందితుల రిమాండ్

గుర్తించారు.

చెత్తకుండిలో పడేశారు

ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా సంజమల మండలం, అకవకొండకు చెందిన కంపరాజు అనీల్‌కుమార్‌గౌడ్ (25) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లిలో ఉంటు ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 6న కాచిగూడలోని స్నేహితుడిని కలిసి రేపల్లె ప్యాసింజర్ రైలులో చర్లపల్లికి వెళ్తున్నాడు. ట్రైన్ డోర్ వద్ద నిలబడి సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. నిందితులు అతని చేతిపై కొట్టి సెల్‌ఫోన్ కిందపడేలా చేశారు. పడిపోయిన సెల్‌ఫోన్ కోసం నెమ్మదిగా కదులుతున్న రైలు నుంచి కిందికి దిగాడు. అప్పటికే ముఠా సభ్యులు సెల్‌ఫోన్‌ను తీసుకుని దాచేశారు. తన ఫోన్ ఇవ్వాలని కోరగా, వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఏ–1 నిందితుడు సంకు రాహుల్ వెంట తెచ్చుకున్న కత్తితో గుండె భాగంలో గట్టిగా పొడవడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అనీల్‌కుమార్ మృతి చెందాడు. అప్పటికే చీకటి పడడంతో మృతదేహాన్ని యాక్టివ వాహనం మధ్యలో కూర్చోబెట్టుకుని చిలకలగూడ అమర్‌టాకీస్ చెత్తకుప్పలో పడేశారు. సీసీ ఫుటేజీల ద్వారా కేసును ఛేదించినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ వివరించారు.

కీర్తి పురస్కారాల గ్రహీతలు వీరే

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 46 మంది ప్రముఖులను కీర్తి పురస్కారాలతో సత్కరిస్తుంది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను పురస్కారాల గ్రహీతలుగా ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో శ్రీహరిదాసు (ఆధ్యాత్మిక సాహిత్యం), ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి (ప్రాచీన సాహిత్యం), దాట్ల దేవదానం రాజు (సృజనాత్మక సాహిత్యం), జాలాది రత్న సుధీర్ (కాల్పనిక సాహిత్యం), డాక్టర్ జి.వి.రత్నాకర్ (అనువాద సాహిత్యం), డాక్టర్ గుర్రం సీతారాములు(అనువాదం), షేక్ మహబూబ్ జాన్(బాలసాహిత్యం), నామని సుజనాదేవి(ఉత్తమ రచయిత్రి), రంగరాజు పద్మజ (ఉత్తమ రచయిత్రి) డాక్టర్ పెరుగు రామకృష్ణ (వచన కవిత), మేడిచర్ల ప్రభాకరరావు (పద్య రచన), డాక్టర్ కె.బాలస్వామి(పద్య రచన), చొప్పదండి సుధాకర్(కథ), డాక్టర్ కె.శ్రీదేవి(నవల), దురికి మోహన రావు(హాస్య రచన), దాస్యం సేనాధిపతి(వివిధ ప్రక్రియలు), ఆకెళ్ళ శివప్రసాద్-బైపాస్(ఉత్తమ నాటక రచయిత), మోహన్ సేనాపతి(ఉత్తమ నటుడు), లలితారాజ్ (ఉత్తమ నటి), గరికపాటి కాళిదాస్(నాటక రంగంలో కృషి), డాక్టర్ పాటిబండ్ల రామ మోహన్‌రావు(జనరంజక విజ్ఞానం), డాక్టర్ సి.శ్రీనివాస రాజు(పరిశోధన, ఆచార్య యం.గోనా నాయక్(భాష), ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు (సాహిత్య విమర్శ), డాక్టర్ జి.రఘురామ శర్మ (అవధానం), కొల్లాపురం విమల(మహిళాభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు (లలిత సంగీతం), ప్రసన్న కుమారి (శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), యం.భిక్షు నాయక్ (జానపద గాయకులు), ఎస్.కె.బాలుజి(జానపద కళలు), కల్వకోట వేంకట సంతోష్ బాబు (జీవిత చరిత్ర), డాక్టర్ బుర్ర మధుసూధన్‌రెడ్డి (పత్రికా రచన), డాక్టర్ ఆర్.ఎల్.వి.రమేష్(ఆంధ్రనాట్యం), డాక్టర్ ఎస్.పి.భారతి (కూచిపూడి నృత్యం), జీ.వి.ఎస్.రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా(హేతువాద ప్రచారంలో కృషి), డాక్టర్ చేగొని రవికుమార్ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుముల శ్రీనివాస్(గ్రంథాలయకర్త), మాడిశెట్టి గోపాల్ (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), బి.వి.సత్య నగేష్ (ఇంద్రజాలం), మృత్యుంజయ (కార్టూనిస్ట్), డాక్టర్ నూనె వెంకటయ్య (జ్యోతిష్యం), సి.వి.రామనాథ శర్మ (ఉత్తమ ప్రధానోపాధ్యాయులు), గౌరి వేముల (చిత్రలేఖనం–మహిళ), తగుళ్ల గోపాల్ (వచన కవిత, యువ కవి), ఎన్.వీ.రఘువీర్ ప్రతాప్ (తెలుగు గజల్)లకు అందజేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నాంపల్లి వర్సిటీ ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో మార్చి 20,21న మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వీరికి కీర్తి పురస్కారాలను అందజేస్తున్నట్లు వివరించారు.

శిల్పారామం నైట్‌బజార్ స్టాల్స్ పరిశీలించిన సీఎం

మాదాపూర్: రైతుబజార్ల స్వయం సహాయక మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా స్టాల్స్‌ను తీర్చిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మాదాపూర్‌లోని శిల్పారామం నైట్‌బజార్ స్టాల్స్‌ను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళా శక్తి, పథంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులను అదేశించారు. 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న నైట్‌బజార్‌లోని 119 స్టాల్స్‌ను ఇందుకు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు పేర్కొన్నారు. పూర్తిగా మహిళలకు మాత్రమే స్టాల్స్‌ను కేటాయించాలన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో ఉత్తర్వులను జారీ చేయాలని అధికారులను అదేశించారు. అవసరమైతే మణిపూర్‌లో మహిళలకు కేటాయించిన మార్కెట్‌ను అధ్యయనం చేయాలని అధికారును సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పాల్గొన్నారు.


శిల్పారామం నైట్‌బజార్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మెస్ చార్జీలు పెంచాలి :ఆర్.కృష్ణయ్య


మహా దీక్షలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా రాష్ట్రంలోని 8 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకుల పాఠశాల, కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని రాజ్యసభ సభ్యుడు అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో హాస్టల్ విద్యార్థులతో కలిసి బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మహా దీక్షలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల జీతాలు పెంచుతారు, మా స్కాలర్ షిప్‌లు పెంచరా అంటూ విద్యార్థులు నిలదీస్తున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల క్రితం ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు నేటికి కొనసాగిస్తున్నారని తెలిపారు. అప్పటికి ఇప్పటికి ఆహార వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగాయని దీంతో విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారని ధరలు పెరగడంతో మెనూ పాటించడానికి డబ్బులు సరిపోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలేజీ, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను నెలకు రూ.1500 నుంచి రూ.3 వేలు, పాఠశాల హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను రూ.950 నుంచి రూ.2 వేలకు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, సుధాకర్, నందగోపాల్, చంద్రశేఖర్, నర్సింహ్మాగౌడ్, జి.కృష్ణాయాదవ్, రాందేవ్, హరీష్, నిఖిల్, ప్రవళిక, ఉమా పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వివక్ష ఉండొద్దు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: అభివృద్ధి పనులు చేయించడంలో ఎలాంటి వివక్ష ఉండదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లో రూ.1.34 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దే దిశలో ముందుకు సాగుతున్నానన్నారు. పేద బడుగు వర్గాలతో పాటు అన్ని మతాల ప్రజలకు అభివృద్ధి పనుల వల్ల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా గుడిమల్కాపూర్ డివిజన్‌ను అభివృద్ధి చేయిస్తున్నానని చెప్పారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రధాని మోడీ ఎజెండాతో తాము ముందుకు సాగుతున్నామన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉన్నాయన్నారు. బీజేపీ అభివృద్ధి ఏజెండాను చూసి ప్రజలు తమ పార్టీకి ఓటు వేస్తున్నారని బీజేపీ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, విజయ్, దేవరవంశీ, నామ యాదగిరి, శ్రీకాంత్‌సాగర్ పాల్గొన్నారు.

రూ. 26 వేల కోట్లతో ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణం


పనులను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం సహకారంతో హైదరాబాద్ నగరాభివృద్ధి సుమారు రూ.26వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లోని వివేకనగర్ పీపుల్స్ పార్కులో రూ.11 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఆయన కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ నిర్మాణం కోసం భూసేకరణ వెంటనే పూర్తి చేసి చేపడితే పనులు కూడా అంతే వేగంగా చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ నిర్మాణం వల్ల నగరానికి ఒక మణిహారంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.వినయ్‌కుమార్, పూసరాజు, రత్నాసాయిచంద్, ఆకుల సురేందర్, ఉమేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 15-3-2024

ఫ్యాషన్



ప్రతి కుట్టు ఒక కథ చెబుతుంది
ప్రతి దారం పోగు మన దేశీయ సంప్రదాయపు సొగసును కళ్లకు కడుతుంది.
ప్రతి డిజైన్ సృష్టిలోనూ అసమానమైన నైపుణ్యం కనిపిస్తుంది.
కళా నైపుణ్యంతో రూపొందించిన ప్రతి డ్రెస్ ఓ కళాఖండమే అనిపిస్తుంది.
భారతీయ వస్త్రాలు, ఫ్యాషన్ వారసత్వం
ప్రపంచాన్ని అబ్బుర పరుస్తూ స్ఫూర్తిని కలిగించేలా
ఇండియన్ డిజైనర్ గౌరంగ్ షా
'గులాల్' పేరుతో ఈ వసంతకాలానికి అందమైన
కలెక్షన్‌ని మన ముందుకు తీసుకువచ్చారు.

వసంతకాలం గులాల్



ఫ్యాషన్ డిజైనర్
గౌరంగ్ షా

ముంబై వేదికగా జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్ స్ప్రింగ్/ఫెస్టివ్ కలెక్షన్ 2024 లో భాగంగా 'గులాల్' పేరుతో గులాబీ రంగులో మెరుస్తున్న డిజైన్స్‌ని ఇండియన్ డిజైనర్ గౌరంగ్ షా ప్రదర్శించారు. ఖాదీ, పట్టు మెటీరియల్‌తో రూపొందించిన డిజైన్స్‌తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు.

ఈ డిజైన్స్ గురించి గౌరంగ్ షా మాట్లాడుతూ – ''సాంస్కృతిక సొబగులతో పాటు ఆధునికత కూడా మేళవించి 40 డిజైన్స్ రూపొందించాం. వాటిలో 30 లెహంగాలు, 10 చీరలు ఉన్నాయి. ప్రతి డ్రెస్‌లో మన చేనేతల్లోని కళాత్మకత భాసిల్లుతుంది. 'గులాల్' స్వచ్ఛత, చిత్తశుద్ధి, శాంతిని సూచిస్తుంది. జమదానీ, జ్యాక్వర్, డోబీ అనేవి చరఖా ఖాదీ, మట్కా సిల్క్, ఇతర పట్టు వస్త్రాలను రూపొందించడానికి ఉపయోగించే డైనమిక్ నేత పద్ధతులు. ప్రతి వస్త్రాన్ని చేతితో నేసేటప్పుడు ఆ చేనేతకారుడి భావోద్వేగాలు, లక్షణాలు ప్రతి వరసలోనూ జోడించినట్టు అనిపిస్తాయి.

సంగీత నృత్యాలు

గుజరాతీ జానపద సంగీతం, కేరళ కథాకళీ నృత్య సమ్మేళనంతో కూడిన ఆకర్షణీయత ఈ దుస్తుల ద్వారా మన హృదయాలను చేరుతుంది. వీటితోపాటు ఉల్లాసభరితమైన రాధా కృష్ణుల హోలీ కథ, నృత్యం ప్రదర్శనలో అదనపు ఆకర్షణగా నిలిచాయి. .

సాధారణంగా హోలీ వేడుకలను తెలుపు రంగు డ్రెస్సులు ధరించి జరుపుకుంటారు. ఈ వసంతకాలం మన మానసిక స్థితిని ప్రతిబింబించేలా లేత, గాఢమైన గులాబీ రంగుల కాంబినేషన్‌లో ఈ డ్రెస్సులను రూపొందించాం. ఈ కలెక్షన్ ఇలా వేదికపైన మెరిసిపోవడానికి ఆరు నెలల కన్నా ఎక్కువ సమయమే పట్టింది. స్కెచ్ నుండి నేత వరకు, ఆ తర్వాత మరుగునపడిన ఎంబ్రాయిడరీలను హైలైట్ చేస్తూ లెహంగాలు, చీరలను డిజైన్ చేశాం. గులాల్ కలెక్షన్‌లో పటాన్ పటోలా, పార్సీ గారా ఎంబ్రాయిడరీతో అలంకరించిన లెహంగా, కర్నాటకలో చేతితో నేసే క్రేప్ సిల్క్ దుపట్టాలు ఉన్నాయి. పటాన్‌పటోలా దుపట్టాతో పాటు కోటా జమదానీ, బనారస్ సిల్క్ బార్డర్‌తో ఉన్న లెహంగాలు వినూత్నంగా మెరిసిపోయాయి.

అరుదైన ఎంబ్రాయిడరీ

ఈ కలెక్షన్లో మోచి, పార్సీగారా, కసుతి, కాశ్మీరీ, కచ్ వంటి క్లిష్టమైన ఎంబ్రాయిడరీ స్టైల్స్‌తో లెహంగాలు, చీరలు రూపొందించాం. ముఖ్యంగా అహ్మదాబాద్‌లోని మరొడి, కేరళలోని పెటిట్ పాయింట్ వంటి అరుదైన ఎంబ్రాయిడరీలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

వస్త్ర శిల్పకళ

చేనేతలో జ్యార్డ్, డోబీ, జమదానీ టెక్నిక్స్ మాత్రమే కాదు ప్రతీ డిజైన్ వస్త్ర శిల్పకళగా కనిపిస్తుంది. మన దేశ కళా నైపుణ్యం ఈ డిజైన్స్‌లో కనువిందు చేస్తాయి. ప్రతి కుట్టు ఒక కథ చెబుతుంది' అని వివరించారు గౌరంగ్ షా.

కిచెన్ టిప్స్

గరం రుచి కోసం

● కూరల్లో గరం మసాలా పొడులు మోతాదు మించితే కూర రుచి మారిపోతుంది, చేదు వస్తుంది. అలా చేదు వచ్చినప్పుడు కూరల్లో అర కప్పు చిక్కటి పాలు లేదా టేబుల్ స్పూన్ మీగడ కలపాలి. పాలు, పాల ఉత్పత్తులు ఇష్టపడని వాళ్లు జీడిపప్పు పొడి లేదా వేరుశనగపప్పు పొడి కూడా కలుపుకోవచ్చు. ఇలా చేస్తే చేదు తగ్గడంతో పాటు కూర రుచి ఇనుమడిస్తుంది కూడా.

● మార్కెట్‌లో కొన్న మసాలా పొడుల్లో ప్యాకెట్ సీలు విప్పినప్పుడు ఉన్నంత సువాసన ఆ తర్వాత ఉండదు. కాబట్టి చిన్న చిన్న ప్యాకెట్‌లు కొనుక్కుని తెరిచిన వెంటనే మొత్తం వాడేయడం ఒక పద్ధతి. పెద్ద ప్యాకెట్ కొన్నప్పుడు కొద్దిగా వాడిన తర్వాత ప్యాకెట్‌లోకి గాలి దూరకుండా క్లిప్ పెట్టాలి.



● గరం మసాలా పొడులను ఇంట్లోనే ఎక్కువ మోతాదులో చేసి నిల్వ ఉంచుకోవాలంటే... పొడిని తేమలేని సీసాలో పోసి గాలి చొరకుండా మూతపెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇలా చేసిన పొడి ఏడాదంతా నిల్వ ఉంచినా తాజాదనం తగ్గదు.

బామ్మ మాట.... బిజినెస్ బాట

పెద్దల మాట పెరుగన్నం మూట
అని ఊరికే అనలేదు.
పెద్దల మాట నెలకు
లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఆర్జించే
పెద్ద వ్యాపార సూత్రంగా మారింది.



ముంబైకి చెందిన రజని, నిధి 'గ్రాండ్‌మా సీక్రెట్' పేరుతో సరదాగా ప్రారంభించిన హోమ్ మేడ్ హెయిల్ ఆయిల్ బిజినెస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఉద్యోగంలో వచ్చే జీతం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఆదాయాన్ని చేకూర్చుతోంది. దీనిని బట్టి ఏదైనా పాతకాలం నాటి కబుర్లు చెప్పినా, పాతపద్ధతులు పాటించినా, అంతా పాత చింతకాయ పచ్చడిలే అని తేలిగ్గా తీసేసే వారు ఇకపై ఆచితూచి మాట్లాడాలేమో! ఎందుకంటే

అప్పటి పాత ఫార్ములానే కదా... ఇప్పుడు సక్సెస్ సూత్రంగా మారిపోయింది.

నిధి టుటేజాకి ఆదివారం సెలవును అమ్మమ్మ ఇంటిలో సరదాగా గడపటం అలవాటు. నిధి అమ్మమ్మ రకరకాల ఔషధ మూలికలను మేళవించి ఒక విధమైన తలనూనెను తయారు చేసేది. అలా ఆమె సొంతంగా తయారు చేసిన ఆయిల్‌తో నిధి తలకు మర్దనా చేసి కాసేపటి తర్వాత తలస్నానం చేయించేది. అమ్మమ్మ చేతి నూనె మహాత్మ్యం వల్ల నిధికి తోటి విద్యార్థినులందరూ కుళ్లుకునేంత నల్లటి ఒత్తైన కేశ నిధి ఉండేది. చదువు తర్వాత అమ్మమ్మ ఊరికి వెళ్లడం బాగా తగ్గిపోయింది. ఇంతలో దేశాన్నంతటినీ కుదిపేస్తున్న కోవిడ్ మహమ్మారి గురుగ్రామ్‌ను కూడా వదల్లేదు. అక్కడే ఉన్న నిధిని కూడా అసలు వదల్లేదు. ఫలితంగా నిధి జుట్టు కుచ్చులు కుచ్చులుగా ఊడటం మొదలు పెట్టింది. క్రమంగా ఆమెను ఇతరులెవరూ పోల్చుకోలేనట్లు తయారైంది. అది చూసిన నిధి తల్లికి చాలా బాధ వేసింది. తన అమ్మ నుంచి ఆ నూనె తయారీ ఫార్ములాను తెలుసుకుని, తన అత్తగారు ఈ విషయంలో ఏమైనా సాయం చేయగలరా అని అడిగింది. కోడలు చెప్పిన ఫార్ములాను ప్రయత్నించింది అత్తగారైన రజని. ఎట్టకేలకు తయారైన ఆ ఆయిల్‌ను నిధి తలకు రాసి మర్దనా చెయ్యడం మొదలు పెట్టారు ఆ అత్తాకోడళ్లు.

ఆశ్చర్యం! కొద్దిరోజుల్లోనే ఆ నూనె మంచి ఫలితాన్నిచ్చింది. పోయిన జుట్టు స్థానంలో కొత్త జుట్టు రావడం మొదలైంది. ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని ఇతర ఫ్లాట్ల వాళ్లు అది గమనించి, ఎలా సాధ్యమైంది ఇదంతా అని అడిగి విషయాన్ని తెలుసుకున్నారు. తమకు కూడా అలాంటి ఆయిల్ తయారు చేసి ఇమ్మని అడగడమే కాదు, అడ్వాన్స్‌గా కొంత మొత్తాన్ని చేతిలో పెట్టడం మొదలు పెట్టారు. ఇదేదో బాగుంది అనిపించింది నిధికి. దాంతో తన నానమ్మ రజని సాయంతో, అమ్మ సహకారంతో ఆయిల్ తయారీ ఆరంభించింది. వీరి ఆయిల్ గురించి ఆ నోటా ఈ నోటా కాదు... కొన్ని డజన్ల వాట్సాప్ గ్రూపులలో పడి మొదట్లో కొద్ది లీటర్లకే పరిమితం అయిన ఆయిల్ తయారీ పెద్దఎత్తున తయారు చేయాలన్న నిర్ణయం తీసుకునేలా చేసింది. దాంతో గత సంవత్సరం మార్చిలో నిధి, రజిని దువా కలిసి 'నిధిస్ గ్రాండ్ మా సీక్రెట్' పేరుతో ఒక సరికొత్త ఆయిల్ బ్రాండ్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఫలితంగా అందరి జుట్టు పెరగడం మాట ఎలా ఉన్నా, వీరి ఆదాయం మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది.

ఇప్పుడు నిధి, రజిని తయారు చేస్తున్న ఈ ఆయిల్ 67,000 ఇళ్లకు చేరింది. నెలకు లక్ష బాటిళ్ల తయారీతో నెలకు సుమారు యాభై లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది.

అమ్మమ్మ ఫార్ములా ప్రకారం ఇప్పుడు నిధి, ఆమెతో పాటు ఆమె నానమ్మగారు... స్వచ్ఛమైన కొబ్బరి నూనెలో 13 రకాల వనమూలికల కలగలుపుతో పెద్ద ఇనుప మూకుడులో కొన్ని గంటలపాటు మరగబెడుతూ, కలుపుతూ తయారు చేసిన ఈ హోమ్ మేడ్ ఆయిల్ ఇప్పుడు పెద్దపెద్ద యంత్రాలతో లక్షల బాటిళ్ల తయారీ లక్ష్యాన్ని చేరుకుంది.

పాత కాలం నాటి ఫార్ములాను తేలికగా చూసే వాళ్లు ఇకనైనా ఇలాంటి విద్యను అందిపుచ్చుకుంటే ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడటం సాధ్యం అవుతుందేమో!

వంటిల్లు

చలికాలం...
సగ్గుబియ్యం హల్వా తింటే
జలుబు చేస్తోందా!
అయితే... ఇదే మంచి సమయం.
ఎండల్లో వండుకుందాం.
సగ్గుబియ్యం చలవ చేస్తుంది...
ఎండ తాపాన్ని తగ్గిస్తుంది.
దహీ... కేసర్... కోవాతోపాటు
పొటాటోతోనూ కలిసిపోతుంది.
ఈవెనింగ్ స్నాక్ అవుతుంది...
లంచ్‌లో మెయిన్ కోర్స్ అవుతుంది.
భోజనం తర్వాత డెజర్ట్ గానూ సర్దుకుపోతుంది.

సగ్గుబియ్యం వేసవిలో తిందాం

దహీ సాబుదానా



కావలసినవి: సగ్గుబియ్యం – అరకప్పు; పెరుగు – రెండున్నర కప్పులు; పచ్చిమిర్చి – 3; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; క్యారట్ తురుము – 2 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 3 టీ స్పూన్‌లు; కరివేపాకు – 2 రెమ్మలు; ఇంగువ – చిటికెడు.

తయారీ: ● స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి వేడెక్కిన తర్వాత మంట తగ్గించి, బాణలిలో సగ్గుబియ్యం వేసి వేయించాలి. సగ్గుబియ్యం చిటపట పేలడం మొదలైన తర్వాత బాణలిని స్టవ్ మీద నుంచి దించి పక్కన పెట్టాలి ● పెరుగును పెద్ద పాత్రలో వేసి ఉప్పు కలిపి చిలకాలి. పెరుగు మరీ చిక్కగా ఉంటే చిలికేటప్పుడు కొద్దిగా నీటిని వేయవచ్చు. చల్లారిన సగ్గుబియ్యాన్ని పెరుగులో వేసి కలిపి నాలుగు గంటల సేపు కదిలించకుండా పక్కన పెట్టాలి. పెరుగును పీల్చుకుని సగ్గుబియ్యం మెత్తబడుతుంది. లోపల ఇంకా గట్టిగా ఉన్నట్లనిపిస్తే మరో గంట సేపు నాననివ్వాలి ● ఇప్పుడు బాణలిలో నూనె వేసి వేడి చేసి ఆవాలు, పచ్చి శనగ పప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి, అల్లం, పసుపు, క్యారట్ వేసి అవి వేగిన తరవాత ఇంగువ, కరివేపాకు వేసి దించేయాలి. ఈ పోపును పెరుగులో నానిన సగ్గుబియ్యంలో వేసి కలపాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే దహీ సాబుదానా... అదే సగ్గుబియ్యం పెరుగు పచ్చడి రెడీ. పెరుగన్నం తినడానికి ఇష్టపడని పిల్లలకు ఇది పెట్టండి. ఇష్టంగా తింటారు. ఎండకు వడదెబ్బ తలగకుండా హాయిగా ఆడుకుంటారు.

సాబుదానా కిచిడీ



కావలసినవి: సగ్గుబియ్యం – కప్పు; నీరు – ముప్పావు కప్పు; వేరుశనగపప్పు – అర కప్పు; చక్కెర – టీ స్పూన్ (ఇష్టమైతేనే); ఉప్పు – ముప్పావు టీ స్పూన్; నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; అల్లం – అంగుళం ముక్క (తరగాలి); పచ్చిమిర్చి– 2 (తరగాలి); బంగాళాదుంప– ఒకటి (ఉడికించి, తొక్కతీసి, తరగాలి); నిమ్మకాయ – ఒక ముక్క; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి మంచినీటిలో ఆరు గంటల సేపు నానబెట్టాలి. సగ్గుబియ్యాన్ని రెండు వేళ్లతో పట్టుకుని నొక్కినప్పుడు పూర్తిగా నానిందా లేక లోపల గట్టిగా ఉందా అనేది తెలుస్తుంది. గట్టిగా ఉంటే మరికొన్ని నీటిని పోసి పూర్తిగా నానే వరకు పక్కన ఉంచాలి ● మందపాటి బాణలి వేడి చేసి వేరుశనగపప్పు వేయించాలి. పప్పులు చల్లారిన తర్వాత మిక్సీలో మెత్తగా పొడి చేయాలి ● నానిన సగ్గుబియ్యంలో వేరుశనగపప్పు పొడి, ఉప్పు, చక్కెర వేసి కలపాలి ● బాణలి వేడి చేసి నెయ్యి వేసి, వేడెక్కిన తర్వాత ఆవాలు, జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి, కరివేపాకు, బంగాళాదుంప ముక్కలు వేసి దోరగా వచ్చే వరకు వేయించాలి. ఇప్పుడు సగ్గుబియ్యం మిశ్రమాన్ని వేసి పోపు మొత్తం సమంగా కలిసేటట్లు చెక్క అట్లకాడతో కలపాలి. చివరగా నిమ్మరసం, కొత్తిమీర కలిపి వడ్డించాలి. ఇది వేడిగా తినడానికి బాగుంటుంది. వేడి తగ్గిన తర్వాత కూడా రుచిగానే ఉంటుంది. కాబట్టి లంచ్‌బాక్సు కోసం కూడా చేసుకోవచ్చు.

కేసర్ సాబుదానా



కావలసినవి: సగ్గుబియ్యం– కప్పు; చక్కెర – కప్పు; ఏలకుల పొడి– టీ స్పూన్; కుంకుమ పువ్వు – ఆరు రేకలు; జీడిపప్పు – టేబుల్ స్పూన్; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు; వేడి పాలు – టేబుల్ స్పూన్.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి ఆరు గంటల సేపు నానబెట్టాలి. పట్టుకుని చూసి పూర్తిగా నానినట్లు నిర్ధారించుకుని మిగిలిన నీటిని వడపోసి సగ్గుబియ్యాన్ని ఒక వస్త్రంలో వేసి మూట గట్టాలి ● పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన పెట్టాలి ● పెనంలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయించాలి. అందులో పసుపు, చక్కెర, కుంకుమ పువ్వు కలిపిన పాలు వేసి ఐదు నిమిషాల సేపు మరగనివ్వాలి. ఇప్పుడు సగ్గుబియ్యం వేసి కలిపితే కేసర్ సాబుదానా రెడీ.

సాబుదానా హల్వా



కావలసినవి: సగ్గుబియ్యం– కప్పు; చక్కెర – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు; ఫుడ్ కలర్– చిటికెడు; ఏలకుల పొడి– అర టీ స్పూన్; జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్‌లు; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; పాల కోవా– 2 టేబుల్ స్పూన్‌లు లేదా చిక్కటి పాలు కప్పు; నీరు – 2 కప్పులు.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి నీరు పోసి ప్రెషర్ కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయించాలి. వేగిన జీడిపప్పు, కిస్‌మిస్‌ను తీసి పక్కన పెట్టి అదే బాణలిలో ఉడికిన సగ్గుబియ్యం, చక్కెర, ఫుడ్ కలర్ వేసి కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం దగ్గరయ్యేటప్పుడు పాల కోవా వేసి కలపాలి. కోవా లేకపోతే పాలు పోసి, ఏలకుల పొడి వేసి దగ్గరయ్యే వరకు కలుపుతూ ఉడికించాలి. చివరగా వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి కలిపితే సాబుదానా హల్వా రెడీ.

యువర్స్

● గేమింగ్



సర్వైవల్ హారర్ గేమ్ 'ఎలోన్ ఇన్ ది డార్క్' ఈ నెల 20న విడుదల కానుంది. 'ఎలోన్ ఇన్ ది డార్క్' వీడియో సిరీస్‌లో భాగంగా వస్తున్న 7వ ఇన్‌స్టాల్ ఇది. గేమ్ కథ విషయానికి వస్తే... గత గేమ్‌లలోలాగే ఈ గేమ్‌లో కూడా ఎడ్వర్డ్ కార్న్‌బీ, ఎమిలీ హార్ట్‌వర్డ్‌లు ప్లేబుల్ క్యారెక్టర్స్. ఎమిలీ హార్ట్‌వుడ్ అంకుల్ జెర్మీ హార్ట్‌వుడ్ అదృశ్యమైపోతాడు. అతడి జాడను కనుగొనడానికి ప్రైవేట్ డిటెక్టివ్ ఎడ్వర్డ్ కార్న్‌బీతో కలిసి బయలుదేరుతాడు, ఈ ప్రయాణంలో ఎన్నిప్రమాదాలు ఎదురయ్యాయి, ఎలాంటి సవాళ్లు చుట్టుముట్టాయి అనేదే గేమ్ స్టోరీ. 'న్యూ ఎలోన్ ఇన్ ది డార్క్ సస్పెన్స్‌ఫుల్ ఎక్స్‌ప్లోరేషన్, ఇంటెన్స్ కంబాట్‌తో, చాలెంజింగ్ పజిల్స్‌తో అడుగడుగునా ఆసక్తి రేపుతుంది' అంటున్నారు గేమ్ మేకర్స్.

తేనె పాటల హనియా

● మ్యూజిక్ వరల్డ్


● హనియా

లాక్‌డౌన్ కాలంలో దొరికిన విరామంలో ఎంతోమంది తమలోని క్రియేటివ్ టాలెంట్స్‌ను మెరుగు పరుచుకున్నారు. అలాంటి వారిలో హనియా ఒకరు. కేరళలోని కోచికి చెందిన హనియా నసిఫా లాక్‌డౌన్‌లో ఖాళీ సమయం దొరకడంతో సంగీతం నేర్చుకోవడం ప్రారంభించింది. 'నాకు ఎలాంటి సంగీత నేపథ్యం లేదు. అయితే పాటలను రాసి ట్యూన్ చేస్తున్నప్పుడు ఎంతో సంతోషంగా అనిపించేది. అలా పాటలనేవి నా దిన్యచర్యలో భాగం అయ్యాయి' అంటుంది హనియా. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ట్రాక్స్ వైరల్ అయ్యాయి. ఇది హనియాను లైమ్‌లైట్‌లోకి తీసుకువచ్చింది. 'నా షార్ట్ మ్యూజిక్ క్లిప్స్‌కు వేలల్లో వ్యూస్ రావడం మొదలు కావడంతో మరింత ఉత్సాహం వచ్చింది. ఇక అప్పటి నుంచి పాటలను ప్రొఫెషనల్‌గా రికార్డ్ చేయడం ప్రారంభించాను. మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను అప్‌గ్రేడ్ చేశాను' అంటుంది ఇరవై సంవత్సరాల హనియా. హనియా తన టాలెంట్‌తో సోషల్ మీడియా నుంచి ఫిల్మ్ ఇండస్ట్రీకి రావడానికి ఎంతో కాలం పట్టలేదు. మన తెలుగు సినిమా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'లో 'జిందగీ' అనే పాటను పాడింది.

త్రో ఇన్ ది టవల్

English Idioms

పోరాటాన్ని విరమించడం, ఓటమి, లొంగిపోవడం మొదలైన సందర్భాల్లో ఉపయోగించే మాట...త్రో ఇన్ ది టవల్.

ఉదా: ఆఫ్టర్ హవర్స్ ఆఫ్ స్ట్రగులింగ్ విత్ ది కాంప్లెక్ మ్యాథ్స్ ప్రాబ్లం జాన్ డిసైడెడ్ టు త్రో ఇన్ ఇది టవల్. మూలం: 19వ శతాబ్దంలో బాక్సింగ్ నుంచి పుట్టిన మాట ఇది. బాక్సర్ ఓటమిని అంగీకరించాడని తెలియజేయడానికి ఇన్‌స్ట్రక్టర్లు టవల్‌ను రింగ్‌లోకి విసిరేసేవారు. ఈ ఫ్రేజ్‌కు 'టాస్ ఇన్ ది టవల్' 'ఫ్లింగ్ ఇన్ ది టవల్'లాంటి వేరియేషన్స్ కూడా ఉన్నాయి.

● ఇన్నోవేషన్


● అద్రిత్

లోకం మెచ్చిన కోడింగ్ మాంత్రికుడు

'అబ్బ...ఖాళీ సమయం దొరికింది. ఎంజాయ్ చేయాలి' అనుకునేవారు కొందరు. 'ఖాళీ సమయం దొరికింది....ఏదైనా నేర్చుకోవాలి' అనుకునే వారు మరికొందరు. అద్రిత్‌రావు రెండో కోవకు చెందిన కుర్రాడు. కోవిడ్ మహమ్మారి సమయంలో దొరికిన విరామంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఎన్నో సాంకేతిక విషయాలను స్వయంగా నేర్చుకున్నాడు. కోడింగ్ మాంత్రికుడిగా పేరు తెచ్చుకున్నాడు...

'కోడింగ్ మేధావి'గా పేరుగాంచిన ఇండియన్-అమెరికన్ అద్రిత్‌రావు యాప్ డెవలప్‌మెంట్ వరల్డ్, డిజిటల్ హెల్త్ ఇన్నోవేషన్‌లో తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. కాలిఫోర్నియాకు చెందిన పదహారు సంవత్సరాల అద్రిత్ ఎన్నో యాప్‌లను రూపొందించి టెక్ దిగ్గజం యాపిల్ ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో హెల్త్‌కేర్‌కు సంబంధించిన కట్టింగ్-ఎడ్జ్ రిసెర్చ్‌లో భాగం అయ్యాడు.

ఎనిమిదేళ్ల వయసులో కోడింగ్‌తో ప్రయాణం ప్రారంభించాడు అద్రిత్. 'బ్లాక్ ప్రోగ్రామింగ్'తో కంప్యూటర్ సైన్స్‌తో పరిచయం అయింది. ఆ పరిచయం ఇష్టం అయింది. ఆ ఇష్టం శోధనకు మూలం అయింది.

కంప్యూటర్ సైన్స్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన అద్రిత్ ట్రెడిషనల్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లను గురించి ఆసక్తిగా తెలుసుకోవడం ప్రారంభించి ఆ తరువాత వాటిపై పట్టు సాధించాడు. కోవిడ్ మహమ్మారి సమయంలో అద్రిత్‌కు బోలెడు ఖాళీ సమయం దొరికింది. ఈ ఖాళీ సమయంలో యూట్యూబ్, ఇతర ఆన్‌లైన్ వనరుల ద్వారా యాప్ డెవలప్‌మెంట్ నేర్చుకున్నాడు. పన్నెండేళ్ల వయసులో ఆపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో అద్రిత్‌రావు విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆపిల్ సీఈవో టిమ్ కుక్‌ను కలిసే అరుదైన అవకాశం లభించింది.



వయసు అడ్డంకి కాదు...

కొత్త ఆవిష్కరణలకు వయసు అనేది అడ్డు కాదు. అభిరుచి అనేది ఆవిష్కరణకు ప్రమాణం. మనం ఇష్టపడుతున్న సబ్జెక్ట్‌పై ఎంత ఎక్కువ సమయాన్ని కేటాయిస్తే అంత విజయం సాధించగలం. కాలం అనేది విలువైనది. విలువైన కాలాన్ని వృథా చేయకుండా విలువైన విషయాలపై దృష్టి పెడితే అద్భుతాలు సాధించగలం. మార్పును తీసుకురాగలం.

- అద్రిత్

'అదొక ఉత్తేజకరమైన అనుభవం. యాప్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి నా ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రేరణ ఇచ్చింది' కుక్‌తో జరిగిన మీటింగ్ గురించి చెబుతాడు అద్రిత్.

సినిమాలు, టీవీ షోలను చూడడానికి ప్రేక్షకులకు సహాయపడే యాప్‌ల నుంచి ఆరోగ్య సంరక్షణలో ఉపయోగపడే యాప్‌ల వరకు...అద్రిత్ ఖాతాలో వినూత్న యాప్‌లు ఎన్నో ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది బధిరులు ఉన్నారు, కమ్యూనికేషన్ విషయంలో ఇతరులతో వారికి ఎదురవుతున్న సమస్యల గురించి అధ్యయనం చేసిన అద్రిత్‌కు వారి హావభావాలను ఐఫోన్ కెమెరా ద్వారా స్పీచ్‌గా మార్చాలనే ఆలోచన వచ్చింది. ఆ తరువాత 'సిగ్నర్' అనే యాప్ ద్వారా తన ఆలోచనను నిజం చేసుకున్నాడు.

పదమూడు సంవత్సరాల వయసులో చదివిన ఒక వ్యాసం ద్వారా అద్రిత్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తి పెరిగింది. ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉయోగించాలనే ప్రయత్నంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో రిసెర్చ్ ఇంటెర్న్‌షిప్ ప్రారంభించాడు అద్రిత్.

వ్యాధులను గుర్తించే, స్టాండ్‌ఔట్ ఇన్నోవేషన్‌గా చెప్పబడుతున్న 'ఆటోఏబీఐ'లాంటి ఐఫోన్ యాప్‌లు క్లినికల్ ట్రయల్స్, పేటెంట్ ప్రాసెస్‌లో ఉన్నాయి. పది సైంటిఫిక్ రిసెర్చ్ పేపర్‌లను ప్రచురించిన అద్రిత్ డిజిటల్ హెల్త్ సోల్యూషన్స్‌కు సంబంధించి క్రియాశీల పాత్ర పోషిస్తున్నాడు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్‌లపై పని చేయడానికి సిలికాన్ వ్యాలీలో ఎక్కువ సమయం గడిపినప్పటికీ 'సాంకేతిక సహాయంతో ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఎక్కువ దృష్టి పెట్టాడు అద్రిత్. 'వైద్యుల స్థానాన్ని ఏఐ భర్తీ చేయాలని నేను అనుకోవడం లేదు. అయితే అది వైద్యులకు సహాయపడుతుంది' అంటున్నాడు.

ఈ కోడింగ్ మాంత్రికుడిలోని మరో కోణం...లాభాపేక్ష లేకుండా యంగ్ ఇన్నోవేటర్స్ కోసం పాఠాలు బోధిస్తున్నాడు. ఎంతోమందికి విలువైన సలహాలు ఇస్తున్నాడు.

● టెక్... టాక్

గూగుల్ ఫోటోస్ మ్యాప్ వ్యూ



మోస్ట్ పాపులర్ అప్లికేషన్ 'గూగుల్ ఫోటోస్'లో 'మ్యాప్ వ్యూ' సహాయంతో ఫోటోను ఎక్కడ కాప్చర్ చేశారో తెలుసుకోవచ్చు. దీని కోసం...

- గూగుల్ ఫోటోస్-ఓపెన్ * బాటమ్ బార్‌లోని 'సెర్చ్ సెక్షన్'లోకి వెళ్లాలి.
- 'ప్లేసెస్'లో 'యువర్ మ్యాప్'ను ట్యాప్ చేయాలి.
- మీ ఫోటోల టైమ్‌లైన్, ఎక్కడి నుంచి ఫోటోలు తీసుకున్నారు అనేదానికి సంబంధించి హీట్‌మ్యాప్ కనిపిస్తుంది
- బ్లూ బబుల్స్ పై క్లిక్ చేస్తే ఏ లొకేషన్‌లో ఫోటోలు కాప్చర్ చేశారో తెలుస్తుంది.
- పర్టిక్యులర్ లొకేషన్‌కు సంబంధించి జూమ్ ఔట్ అండ్ జూమ్ ఇన్ చేయవచ్చు.

వివో వి 30




డిస్‌ప్లే	: 6.78 అంగుళాలు
రిజల్యూషన్	: 1260X2800 పిక్సెల్స్
మెమోరీ	: 128జీబి 8జీబి ర్యామ్/ 256 జీబీ 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
ఓఎస్	: ఆండ్రాయిడ్ 14
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్

3డీ హెచ్‌డీ ఫోన్ హోల్టర్



డ్రమ్‌స్టోన్ స్క్రీన్ ఎక్స్‌పాండర్స్ అండ్ స్క్రీన్ మాగ్నిఫైయర్, 3డీ హెచ్ ఫోన్ హోల్డర్
బ్రాండ్: డ్రమ్‌స్టోన్
కలర్: మల్టీ కలర్
మోడల్: న్యూ.3డీ. మ్యాగ్నిఫైయర్- 599
ప్యాకేజ్ డైమెన్షన్స్: 23.3X21.6X1 సీఎం 150 గ్రా.

పోకో ఎక్స్6 నియో



సైజ్	: 6.67 అంగుళాలు
స్టోరేజ్	: 12జీబి ర్యామ్ అండ్ 256 జీబి
రిఫ్రెష్‌రేట్	: 120 హెచ్‌జడ్
సెల్ఫీ కెమెరా	: 16 ఎంపీ
బ్యాటరీ	: 5, 000 ఎంఏహెచ్
కలర్స్	: ఆస్ట్రాల్ బ్లాక్, బ్లూ, మార్షియన్ ఆరేంజ్

సినిమా

తంగలాన్ రెడీ


● విక్రమ్

విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' సినిమా కోసం ఆయన అభిమానులతో పాటు సగటు సినీ ప్రేమికులు ఎదురు చూస్తున్నారు. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో పార్వతి, మాళవికా మోహన్, పశుపతి, హాలీవుడ్ నటుడు డేనియల్ కాల్లాగిరోన్ కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటించారని సమాచారం. ఆ మధ్య విడుదలైన టీజర్‌తో 'తంగలాన్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాది జనవరి 26న తప్పకుండా రిలీజ్ అవుతుందనుకున్నారంతా. కానీ 'తంగలాన్' అప్పుడు వెండితెరపైకి రాలేదు. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'తంగలాన్' విడుదలపై క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు చిత్రదర్శకుడు పా. రంజిత్. ''తంగలాన్' అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సెన్సార్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేశాం. ప్రస్తుతం ఎన్నికల తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. ఎన్నికలు పూర్తయ్యాక ఈ మూవీ రిలీజ్ చేస్తాం. మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది '' అన్నారు పా. రంజిత్. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ,

గుడ్... బ్యాడ్... అగ్లీ


● అజిత్

అజిత్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' టైటిల్ ఖరారైంది. తమిళంలో 'భగీర', 'మార్క్ ఆంటోనీ' వంటి సినిమాలను తీసిన అధిక్ రవి చంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. అజిత్ కెరీర్‌లో 63వ చిత్రంగా రానున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ఈ సినిమాను గురువారం అధికారికంగా ప్రకటించి, 2025 సంక్రాంతికి విడుదల చేస్తామని మేకర్స్ వెల్లడించారు. జూన్‌లో షూటింగ్ ఆరంభిస్తామని, యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందించనున్నామని కూడా తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

యమధీర ముస్తాబు


● శ్రీశాంత్

భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్‌లో నటించిన చిత్రం 'యమధీర'. కోమల్ కుమార్, రిషికా శర్మ జంటగా శంకర్ .ఆర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వేదాల శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు, నిర్మాత అశోక్ కుమార్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''నా స్నేహితుడు వేదాల శ్రీనివాస్ నిర్మాతగా మారి, నిర్మించిన తొలి చిత్రం 'యమధీర' బాగా ఆడాలి'' అన్నారు. ''సినిమాలపై ప్యాషన్‌తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ ఆరంభించి, 'యమధీర' నిర్మించా. త్వరలోనే మా సినిమా రిలీజ్ కానుంది.. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు వేదాల శ్రీనివాస్. అలీ, సత్యప్రకాశ్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రోష్ మోహన్ కార్తీక్, సంగీతం: వరుణ్ ఉన్ని.

పుట్టినరోజుకి జరగండి!


● రామ్‌చరణ్


వైజాగ్ వెళ్లాడు గేమ్‌చేంజర్. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ వైజాగ్‌లో ప్రారంభం కానుంది. ఈ వారంలో ఆరంభం కానున్న ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్ పాల్గొంటారు. రామ్‌చరణ్ పాల్గొనగా కొన్ని ముఖ్య సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట మేకర్స్. అలాగే ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'గేమ్‌చేంజర్' సినిమాలోని 'జరగండి..' పాట లిరికల్ వీడియో విడుదల కానుంది. అంజలి, నవీన్‌చంద్ర, శ్రీకాంత్, సునీల్, జయరాం, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ స్వరకర్త.

నెల ముందే వెనోమ్ 3


● వెనోమ్ 3 పోస్టర్

హాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ 'వెనోమ్' మూడో భాగం 'వెనోమ్ 3' రెడీ అవుతోంది. ఈ సినిమాకు 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్' టైటిల్ ఖరారైంది. ఈ సూపర్ హీరో మూవీని ఈ ఏడాది అక్టోబరు 24న రిలీజ్ చేస్తున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. 'వెనోమ్' ఫ్రాంచైజీలోని తొలి రెండు భాగాలు 'వెనోమ్', 'వెనోమ్: లెట్ దేర్ బీ కార్నేజ్'లకు రచయితగా పని చేసిన కెల్లీ మార్సెల్ మూడో భాగంతో దర్శకురాలిగా మారారు. తొలి రెండు భాగాల్లో హీరోగా నటించిన టామ్ హార్డీయే 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్'లోనూ నటిస్తున్నారు. జూనో టెంపుల్, చివెటిల్ ఎజియోఫర్, క్లార్క్ బాకో ఇతర లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. ఈ సినిమా దర్శకురాలు కెల్లీ మార్సెల్, హీరో టామ్ హార్డీలు 'వెనోమ్: ది లాస్ట్ డ్యాన్స్'కు కథా రచయితలుగా ఉండటంతో పాటు నిర్మాతలుగా కూడా వ్యవహరిస్తుండటం విశేషం. తొలుత ఈ చిత్రాన్ని ఈ ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. తాజాగా ఓ నెల ముందే... అక్టోబరుకి ప్రీ పోన్ చేశారు.

చెన్నైకి వేటగాడు


● రజనీకాంత్

హైదరాబాద్‌లో పని ముగించుకుని చెన్నైకు వెళ్లాడు వేటగాడు. హీరో రజనీకాంత్ టైటిల్ రోల్‌లో టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, రితికా సింగ్, దుషారా విజయన్, మంజు వారియర్ కీలక పాత్రధారులు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన 'వేట్టయాన్' సినిమా షెడ్యూల్ ముగిసింది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, రానా, రితికా సింగ్ ఈ షెడ్యూల్‌లో పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని తెలిసింది. ఓ యాక్షన్ సీక్వెన్స్, ఓ పాటను కూడా చిత్రీకరించారని సమాచారం. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రజనీకాంత్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలవుతుంది.

చరిత్ర తెలియజేసే రజాకార్


● బాబీ సింహా

''రజాకార్' ముస్లింలకు వ్యతిరేకమైన సినిమా కాదు. మన చరిత్ర గురించి తెలియజేసే చిత్రం. నాటి కాలంలో జరిగిన దుర్మార్గాలను ప్రజలకు తెలియజేసేలా తెరకెక్కించిన మూవీ. ఇలాంటి సినిమా తీయాలంటే ధైర్యం కావాలి. దర్శకుడు సత్యనారాయణ, నిర్మాత నారాయణ రెడ్డిలకు ధన్యవాదాలు'' అని నటుడు, దర్శక-నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. బాబీ సింహా, వేదిక, అనుష్యా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే నటీనటులుగా యాటా సత్యనారాయణ దర్శకత్వం వహించిన చిత్రం 'రజాకార్'. గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. గురువారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో యాటా సత్యనారాయణ మాట్లాడుతూ- ''తెలంగాణ చరిత్రపై 'రజాకార్' చేసే చాన్స్ ఇచ్చిన నారాయణరెడ్డిగారికి ధన్యవాదాలు'' అన్నారు. ''మన పోరాట యోధుల గురించి రాబోయే తరాలకు చెప్పాలనే 'రజాకార్' నిర్మించాను'' అన్నారు గూడూరు నారాయణ రెడ్డి.

మూడోసారి ఆ హీరోతో జోడీ?


● పూజ

హీరో అల్లు అర్జున్, హీరోయిన్ పూజా హెగ్డే ముచ్చటగా మూడోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవునంటోంది ఫిల్మ్‌నగర్ సర్కిల్. ఈ ఇద్దరూ 'డీజే దువ్వాడ జగన్నాథమ్' (2019), 'అల వైకుంఠపురములో' (2020) వంటి చిత్రాల్లో జంటగా నటించి, హిట్ పెయిర్‌గా నిలిచారు. ఇక 2002లో విడుదలైన 'ఆచార్య' తర్వాత మరో తెలుగు చిత్రంలో హీరోయిన్‌గా నటించలేదు పూజా హెగ్డే. అయితే 'ఎఫ్ 3' సినిమాలో వెంకటేశ్, వరుణ్ తేజ్‌లతో కలిసి ప్రత్యేక పాటలో కనిపించారు. ఇప్పుడు కథానాయికగా అల్లు అర్జున్ సినిమాకి చాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప 2: ది రూల్' సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఆ తర్వాత ఆయన పని చేయనున్న దర్శకుల జాబితాలో త్రివిక్రమ్, బోయపాటి శ్రీను, అట్లీ కుమార్, సందీప్ రెడ్డి వంగా పేర్లు వినిపిస్తున్నాయి. అయితే అట్లీతోనే తన తర్వాతి చిత్రం చేయనున్నారట అల్లు అర్జున్. ఈ చిత్రంలోనే పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. మరి.. అల్లు అర్జున్‌తో మూడోసారి హీరోయిన్‌గా నటించే అవకాశం పూజా హెగ్డేకి దక్కిందా అనే విషయంపై స్పష్టత రావాలంటే వేచి చూడాలి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
15-03-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	335	73,097
నిఫ్టీ ▲	149	22,146

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి మూడు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,092	▼ 84
డోజోన్స్	38,802	▼ 241
ఎఫ్‌టీఎస్ఈ 100	7,743	▼ 29
డాక్స్	17,942	▼ 19
షాంఘై	3,038	▼ 5
నికాయ్	38,807	▲ 111

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	65,523
బంగారం (99.5 స్వచ్ఛత)	65,261
వెండి (కేజీ)	73,781

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.88	108.12
€	యూరో	ఎస్‌బీఐ	88.12	91.990
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.13	64.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.29



ఫిబ్రవరిలో 0.2 శాతం టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో స్వల్పంగా తగ్గి, 0.2 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌లో ఈ రేటు 0.27 శాతంగా ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ధరల సూచీ మైనస్ (ప్రతి ద్రవ్యోల్బణం)లో ఉంది. నవంబర్‌లో ప్లస్‌లోకి మారి 0.26 శాతంగా నమోదయ్యింది. అయితే ఆహార ధరలు మాత్రం ఫిబ్రవరిలో స్వల్పంగా పెరిగాయి. జనవరిలో 6.85 శాతంగా ఉన్న ఆహార టోకు ధరల స్పీడ్, ఫిబ్రవరిలో 6.95 శాతానికి ఎగసింది. ఇదే సమయంలో కూరగాయల ధరలు 19.71 శాతం (జనవరి) నుంచి 19.78 శాతానికి ఎగశాయి. పప్పు దినుసుల ధరలు 16.06 శాతం నుంచి 18.48 శాతానికి చేరాయి. ఫ్యూయల్ అండ్ లైట్ విభాగానికి వస్తే, రేటు 0.51 శాతం నుంచి 1.59 శాతానికి ఎగసింది. సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ ఉత్పత్తుల ధరలు జనవరిలో 1.13 శాతం తగ్గితే, ఈ తగ్గుదల ఫిబ్రవరిలో 1.27 శాతంగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	418-00
విజయవాడ	418-00
రిటైల్ ధర (డజను)	72.00
14-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు

- చిన్న, మధ్య స్థాయి షేర్లలో రికవరీ
- రాణించిన ఐటీ, ఇంధన రంగ షేర్లు
- మెప్పించిన ద్రవ్యోల్బణ డేటా
- మళ్లీ 73 వేలపైకి సెన్సెక్స్

ముంబై: వాల్యుయేషన్ ఆందోళనలను విస్మరిస్తూ ఇన్వెస్టర్లు కనిష్ట స్థాయిల వద్ద చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు ఆసక్తి చూపడంతో స్టాక్ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 335 పాయింట్లు పెరిగి 73 వేల స్థాయి పైన 73,097 వద్ద నిలిచింది. నిఫ్టీ 149 పాయింట్లు బలపడి 22,100 స్థాయిపైన 22,146 వద్ద ముగిసింది. సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. హోల్‌సేల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 4 నెలల కనిష్టానికి దిగివచ్చినట్లు డేటా వెల్లడి కావడంతో బుధవారం ట్రేడింగ్‌లో పతనమైన షేర్లకు దిగువ స్థాయి లో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సూచీలు క్రమంగా పుంజుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 602 పాయింట్లు పెరిగి 73,364 వద్ద, నిఫ్టీ 207 పాయింట్లు బలపడి 22,205 వద్ద గరిష్టాలను అందుకున్నాయి. ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు మాత్రమే నష్టపోయాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ట్రేడవుతున్నాయి.

- కనిష్ట స్థాయిల్లో చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 3.11%, మిడ్ క్యాప్ ఇండెక్సు 2.28% చొప్పున రాణించాయి. రంగాల వారీగా సర్వీసెస్, టెలికం సూచీలు 4%, యుటిలిటీ, ఆయిల్‌అండ్ గ్యాస్, విద్యుత్, పారిశ్రామిక ఇండెక్స్‌లు 3%, కమోడిటీ సూచీ 2.50% చొప్పున లాభపడ్డాయి.
- భారత సైన్యం, తీర రక్షక దళం కోసం 34 తేలికపాటి హెలికాప్టర్లు, అనుబంధ పరికరాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖతో రూ.8,073 కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ కంపెనీ షేరు 4.2% లాభపడి రూ.3,167 వద్ద స్థిరపడింది.
- సెన్సెక్స్ 335 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో రూ.7.81 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపద బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 379 లక్షల కోట్లకు చేరింది.
- అదానీ గ్రూప్ షేర్లూ ముందడుగేశాయి. ఆదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 11%, అదానీ గ్రీన్ ఎనర్జీ 10%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6%, అదానీ పోర్ట్స్, ఎన్‌డీటీవీ 5% చొప్పున లాభపడ్డాయి. అదానీ విల్మార్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌లు 4%, అదానీ పవర్ 2% రాణించాయి. గ్రూప్‌లో కంపెనీల మార్కెట్ క్యాపిటలేషన్ రూ.15.66 లక్షల కోట్లు పెరిగింది.



గోపాల్ స్నాక్స్ లిస్టింగ్ మెప్పించలేదు. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.401)తో పోలిస్తే 13% డిస్కౌంట్‌తో రూ.350 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. దాదాపు 15% క్షీణించి రూ.342 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 10% నష్టంతో రూ.342 వద్ద ముగిసింది.

ఏపీలో అరబిందో ప్లాంటు సిద్ధం

- వచ్చే నెలలోనే ట్రయల్ రన్
- రూ.2,400 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద కొత్తగా నిర్మిస్తున్న పెన్-జి (పెన్సిలిన్) ప్లాంటు ఏప్రిల్‌లో ట్రయల్ రన్‌కు సిద్ధం అయింది. జూన్‌లోగా వాణిజ్యపరంగా తయారీ కార్యకలాపాలు మొదలవుతాయని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి వెల్లడించారు. పెన్సిలిన్-జి ధర విషయంలో చైనాతో పోటీపడాలన్నది తమ లక్ష్యం అని చెప్పారు. పూర్తిగా దేశీయంగా పెన్సిలిన్ ఉత్పత్తి చేస్తున్నట్టు వివరించారు. ఏటా 15,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఈ కేంద్రం కోసం సంస్థ రూ.2,400 కోట్లు వెచ్చిస్తోంది. ఈ ప్లాంటు జూలై-సెప్టెంబర్ కాలంలో పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకోనుంది. 80-90 శాతం పెన్సిలిన్‌ను కంపెనీ దేశీయంగా విక్రయించనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కింద పెన్సిలిన్ ప్లాంటు ఆమోదం పొందింది.

మరో రూ.1,000 కోట్లు..

అరబిందో ఫార్మా 8-10 ప్లాంట్ల ఏర్పాటుకు గడిచిన మూడు నాలుగేళ్లలో రూ.5,000 కోట్లు ఖర్చు చేసింది. వచ్చే రెండేళ్లలో మరో రూ.1,000 కోట్ల పెట్టుబడి చేయనుంది. చైనాలో ఏర్పాటు చేస్తున్న ఓరల్ సాలిడ్స్ తయారీ ప్లాంటులో వచ్చే త్రైమాసికంలో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని సంస్థ సీఎఫ్‌వో శాంతారామ్ సుబ్రమణియన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అరబిందో టర్నోవర్ 3.4-3.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనాగా పేర్కొన్నారు. డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలంలో టర్నోవర్ 2.6 బిలియన్ డాలర్లు నమోదైంది. అరబిందో ప్రస్తుతం అంటువ్యాధుల విభాగంలో ఐదు వ్యాక్సిన్ల తయారీలో నిమగ్నమైంది. సంస్థ ఖాతాలో 25 తయారీ, ప్యాకింగ్ కేంద్రాలు ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న 10 ప్లాంట్లు ఒకట్రెండేళ్లలో కార్యరూపం దాల్చనున్నాయి.

పీఎస్‌యూ బ్యాంకుల్లో వాటా విక్రయం

- 75 శాతం దిగువకు చేరనున్న ప్రభుత్వ వాటా
- పబ్లిక్‌కు కనీస వాటా నిబంధన అమలుపై దృష్టి
- జాబితాలో ఐవోబీ, యుకోసహా ఐదు బ్యాంకులు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం కొంతమేర వాటాలను విక్రయించనుంది. పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధన(ఎంపీఎస్) అమలులో భాగంగా ఐదు బ్యాంకుల్లో వాటాలను ఆఫర్ చేయనుంది. ఈ జాబితాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ), యుకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్(పీఎస్‌బీ) ఉన్నట్లు ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ వివేక్ జోషీ పేర్కొన్నారు. 2023 మార్చి 31కల్లా మొత్తం 12 పీఎస్‌యూ బ్యాంకుల్లో 4 ఎంపీఎస్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మరో 3 ప్రభుత్వ రంగ బ్యాంకులు 25 శాతం ఎంపీఎస్‌ను సాధించినట్లు పేర్కొన్నారు. ఇకపై మిగిలిన 5 బ్యాంకులు సైతం నిబంధనలను అందుకునే కార్యాచరణకు తెరతీయనున్నట్లు తెలియజేశారు.

ప్రస్తుత తీరిలా: ప్రస్తుతం పీఎస్‌బీలో కేంద్ర ప్రభుత్వం 98.25 శాతం వాటాను కలిగి ఉంది. ఈ బాటలో ప్రభుత్వానికి ఐవోబీలో 96.38 శాతం, యుకో బ్యాంక్‌లో 95.39 శాతం, సెంట్రల్ బ్యాంక్‌లో 93.08 శాతం, బ్యాంక్ మహారాష్ట్రలో 86.46 శాతం చొప్పున వాటాలున్నాయి.


పారామౌంట్ గ్లోబల్‌తో రిలయన్స్ డీల్

వయాకామ్ 18లో పారామౌంట్ వాటాల కొనుగోలు • 13 శాతానికి రూ. 4,286 కోట్లు

న్యూఢిల్లీ: పారామౌంట్ గ్లోబల్ సంస్థ భారత్‌లోని టీవీ వ్యాపార విభాగం వయాకామ్ 18లో తమకున్న 13.01 శాతం వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి విక్రయించనుంది. ఇందుకు సంబంధించి పారామౌంట్ గ్లోబల్‌కి చెందిన రెండు అనుబంధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ తెలిపింది. ఈ డీల్ విలువ రూ. 4,286 కోట్లుగా ఉంటుందని వివరించింది. రిలయన్స్‌కి చెందిన టీవీ18 బ్రాడ్‌కాస్ట్‌కి వయాకామ్18 అనుబంధ సంస్థ. కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల ద్వారా అందులో రిలయన్స్‌కి 57.48 శాతం వాటా ఉంది. పారామౌంట్ గ్లోబల్‌తో ఒప్పందం పూర్తయ్యాక ఇది 70.49 శాతానికి పెరుగుతుంది. తమ కంటెంట్‌కి సంబంధించి వయాకామ్18కి లైసెన్సును ఇకపైనా కొనసాగిస్తామని పారామౌంట్ వెల్లడించింది. నియంత్రణ సంస్థల అనుమతులు, రిలయన్స్-స్టార్ డిస్నీ జాయింట్ వెంచర్ పూర్తి కావడం తదితర అంశాలకు లోబడి ఈ ఒప్పందం ఉంటుందని పేర్కొంది.

మీడియాలో రిలయన్స్ మరింత పటిష్టం..

2014లో నెట్‌వర్క్18లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసిన రిలయన్స్ ఆ తర్వాత నుంచి మీడియా రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. భారత్‌లో తమ మీడియా కార్యకలాపాలను విలీనం చేసుకునేందుకు వాల్ట్ డిస్నీ, రిలయన్స్ కుదుర్చుకున్న ఒప్పందం ఇందుకు దోహదపడనుంది. సదరు జాయింట్ వెంచర్‌లో రిలయన్స్ రూ. 11,500 కోట్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సోనీ, నెట్‌ఫ్లిక్స్‌కు గట్టి పోటీనిచ్చేందుకు రిలయన్స్ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం రిలయన్స్‌కి చెందిన మీడియా వెంచర్స్ అన్నీ నెట్‌వర్క్18 కింద ఉన్నాయి. ఇది టీవీ18 బ్రాండ్ పేరిట న్యూస్ చానళ్లు, ఇతరత్రా స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ చానల్స్‌ని నిర్వహిస్తోంది. అలాగే, మనీకంట్రోల్‌డాట్‌కామ్, బుక్‌మైషో వంటి సంస్థల్లోనూ నెట్‌వర్క్18కి వాటాలు ఉన్నాయి. వీటితో పాటు రిలయన్స్‌కి జియోస్టూడియోస్ అనే సినిమా నిర్మాణ సంస్థ ఉంది. రెండు లిస్టెడ్ కేబుల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో (డెన్, హాథ్‌వే) మెజారిటీ వాటాలు ఉన్నాయి.



సాక్షి స్పోర్ట్స్



సింగిల్స్ క్వార్టర్స్‌లో రష్మిక... డబుల్స్ సెమీస్‌లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణులు శ్రీవల్లి రష్మిక సింగిల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి, డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... సహజ యామలపల్లి సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయి, డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఇండోర్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రష్మిక 6-1, 2-6, 6-1తో మర్యాయోవా (స్లొవేకియా)పై గెలిచింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-3, 6-4తో అకికో ఒమాయి-మె యామగుచి (జపాన్) జోడీపై నెగ్గింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 1-6, 4-6తో మనన్‌చాయ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ-జీల్ దేశాయ్ (భారత్) జోడీ 6-1, 6-2తో సౌమ్య (భారత్)-మె హసెగావ (జపాన్) జంటపై గెలిచింది.



ఢిల్లీని 'ఢీ' కొట్టేదెవరు?

- నేడు ముంబై, బెంగళూరు మధ్య ఎలిమినేటర్ పోరు
- రాత్రి గం. 7:30 నుంచి 'స్పోర్ట్స్-18'లో ప్రత్యక్ష ప్రసారం


హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అమీతుమీకి అర్హత సాధించేందుకు ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు సమరానికి సిద్ధమయ్యాయి. శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఇరుజట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ ముంబై టైటిల్ నిలబెట్టుకునే పనిలో ఉండగా, గత సీజన్‌లో నిరాశపరిచిన బెంగళూరు కొత్తగా ఫైనల్ చేరేందుకు తహతహలాడుతోంది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన బృందం గెలిస్తే గత రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ముంబై గెలిస్తే మాత్రం 2023 సీజన్ ఫైనల్ పునరావృతం అవుతుంది. ఇక ఈ సీజన్ విషయానికొస్తే బెంగళూరు మెరుగుపడింది. లీగ్ ఆరంభ దశలో యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్‌లపై వరుస విజయాలతో టచ్‌లోకి వచ్చింది. అయితే గత ఫైనలిస్టులతో తలపడిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైనప్పటికీ అడపాదడపా విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానాన్ని పదిలపర్చుకుంది. దీంతో పాటు ఆఖరి మ్యాచ్‌లో ముంబైలాంటి ప్రత్యర్థిని చిత్తుగా ఓడించడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆర్‌సీబీ స్టార్ ఎలీస్ పెరీ ఆల్‌రౌండ్ షో ముంబైని ముంచేసింది. కీలకమైన పోరులో ఓపెనర్లు స్మృతి, సోఫీలు విఫలమైనా బ్యాట్‌తోనూ పెరీ జట్టును నడిపించింది. హిట్టింగ్‌తో రిచా ఘోష్ జట్టులో కీలకపాత్ర పోషిస్తోంది. సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్‌లు కూడా ధాటిగా ఆడితే ముంబై బౌలర్లకు కష్టాలు తప్పవు. ఈ సీజన్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్‌ను మినహాయించి ఓవరాల్‌గా చూసుకుంటే ముంబై డిఫెండింగ్ చాంపియన్ పాత్రకు న్యాయం చేసేలా ఆడింది. హేలీ మాథ్యూస్, సజన, నటాలీ సీవర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, అమెలియా కెర్‌లతో కూడిన బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. బౌలింగ్ విభాగంలో స్పీడ్‌స్టర్ షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, అమెలియాలు రాణిస్తే బెంగళూరును ఓడించడం ఏమంత కష్టం కానేకాదు. ఐదు జట్లు పోటీపడ్డ డబ్ల్యూపీఎల్‌లో లీగ్ దశలో 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంది.

'రంజీ' రారాజు ముంబై...

42వసారి టైటిల్ సొంతం

- ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ విజేత
- ఫైనల్లో 169 పరుగులతో విదర్భపై ఘన విజయం



విదర్భ ఇన్నింగ్స్‌లో 135వ ఓవర్... అప్పటికే 9 వికెట్లు పడ్డాయి... కెరీర్‌లో చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడుతున్న ముంబై పేసర్ ధవల్ కులకర్ణి ఇంత సుదీర్ఘ ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లే వేశాడు... ఒక్కసారిగా ధవల్ చేతికి కెప్టెన్ రహానే బంతిని అందించాడు... మూడో బంతికి ఉమేశ్ యాదవ్ క్లీన్‌బౌల్డ్... ముంబై శిబిరంలో సంబరాలు షురూ... వెరసి దేశవాళీ క్రికెట్ దిగ్గజం ఖాతాలో మరో రంజీ ట్రోఫీ చేరింది. ముంబై జట్టు ఏకంగా 42వ సారి రంజీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఎనిమిదేళ్ల తర్వాత టీమ్ ఖాతాలో మరో కప్ చేరగా... ధవల్ ఐదో రంజీ విజయంలో భాగంగా నిలిచి సగర్వంగా ఆటకు వీడ్కోలు పలికాడు.


తనుష్ కొటియన్


ముషీర్ ఖాన్

ముంబై: భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీని ముంబై జట్టు సొంతం చేసుకుంది. గురువారం ముగిసిన ఐదు రోజుల ఫైనల్లో ముంబై 169 పరుగుల తేడాతో రెండుసార్లు చాంపియన్ విదర్భపై ఘన విజయం సాధించింది. విదర్భ చివరి రోజు వరకు పోరాడినా అసాధ్యమైన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైంది. 538 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 248/5తో ఆట కొనసాగించిన విదర్భ 368 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (199 బంతుల్లో 102; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ పూర్తి చేసుకోగా... హర్ష్ దూబే (128 బంతుల్లో 65; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. అక్షయ్, హర్ష్ చాలాసేపు ముంబై బౌలర్లకు లొంగకుండా ఇబ్బంది పెట్టారు. అయితే ఎట్టకేలకు తనుష్ బౌలింగ్‌లో అక్షయ్ వికెట్ల ముందు దొరికిపోవడంతో ముంబై గెలుపు బాట పట్టింది. మిగిలిన నాలుగు వికెట్లను 15 పరుగుల వ్యవధిలోనే తీసి ముంబై చాంపియన్‌గా అవతరించింది. సెంచరీ సాధించడంతో పాటు 2 వికెట్లు తీసిన ముషీర్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతనికి రూ. 50 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. టోర్నీ మొత్తంలో 502 పరుగులు, 29 వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన ముంబై ఆటగాడు తనుష్ కొటియన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. తనుష్‌కు రూ. 2 లక్షల 50 వేలు ప్రైజ్‌మనీ లభించింది. 1934-35 సీజన్‌లో తొలిసారి విజేతగా నిలిచిన ముంబై (బాంబే) జట్టు ఈ టైటిల్‌కు ముందు 2015-16 సీజన్‌లో చివరిసారి ట్రోఫీని అందుకుంది.

ఆటగాళ్లపై కోట్లాభిషేకం...

ప్రైజ్‌మనీలో ముంబై డబుల్ ధమాకా కొట్టింది. సీజన్ విజేతకు బీసీసీఐ రూ. 5 కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వగా... ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) తమ క్రికెటర్లకు ప్రత్యేకంగా రూ.5 కోట్ల నజరానా ప్రకటించింది. దీంతో తాజా రంజీ విజేతకు వచ్చిన ప్రైజ్‌మనీ రెట్టింపైంది. 'ఈ సీజన్‌లో మా జట్లు బాగా ఆడాయి. బీసీసీఐ నిర్వహించిన వయో విభాగాల టోర్నీలన్నింటిలోనూ ఫైనల్ చేరాయి. దీంతో ఎంసీఏ ప్రోత్సాహకంగా రూ. 5 కోట్ల బహుమతి ఇస్తోంది' అని కార్యదర్శి అజింక్య నాయక్ తెలిపారు.

సింధు ఏడో'సారీ'...

ఆన్ సె యంగ్ చేతిలో మళ్లీ ఓటమి



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. గత ఐదేళ్లుగా తనకు కొరకరాని కొయ్యగా మారిన దక్షిణ కొరియా ప్లేయర్ ఆన్ సె యంగ్ చేతిలో సింధు వరుసగా ఏడోసారి ఓడిపోయింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ సింధు 19-21, 11-21తో ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్, డిఫెండింగ్ చాంపియన్ ఆన్ సె యంగ్ చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 80 నిమిషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 24-22, 11-21, 21-14తో ప్రపంచ 3వ ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను ఓడించాడు.

శరత్ కమల్ జోరు

సింగపూర్: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 41 ఏళ్ల శరత్ కమల్ గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ 11-4, 11-8, 12-10తో ప్రపంచ 22వ ర్యాంకర్ ఒమర్ అసర్ (ఈజిప్ట్)పై గెలుపొందాడు. శరత్ క్వార్టర్ ఫైనల్లో ఫెలిక్స్ లుబ్రాన్ (ఫ్రాన్స్)తో తలపడతాడు.



సబలెంకాకు షాక్



కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంకర్, బెలారస్ స్టార్ సబలెంకాకు ఊహించని పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంకా 3-6, 6-3, 2-6తో ప్రపంచ 23వ ర్యాంకర్ ఎమ్మా నవారో (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

గుజరాత్‌పై తెలంగాణ ఘనవిజయం

పుణే: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు తొలి విజయం నమోదు చేసింది. పూల్ 'హెచ్'లో భాగంగా గుజరాత్‌తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 12-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించింది. తెలంగాణ తరఫున కెప్టెన్ ఈదుల జ్యోతి (24వ, 26వ, 27వ ని.లో) 'హ్యాట్రిక్' సాధించగా... గంధపు శ్రీచందన (9వ, 37వ ని.లో), హర్లీన్ కౌర్ సర్దాని (14వ, 47వ ని.లో), ప్రీతి దార్ల (25వ, 57వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. చెక్కల అనూష (44వ ని.లో), అఖిల మాండ్లా (45వ ని.లో), ముప్పాల వర్షిత (56వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. తమిళనాడుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది.



కోహ్లి లేకుండా ఆర్‌సీబీ శిబిరం



బెంగళూరు: ఐపీఎల్ టోర్నీ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ గురువారం శిబిరానికి శ్రీకారం చుట్టింది. అయితే జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కాస్త ఆలస్యంగా శిబిరానికి హాజరు కానున్నాడు. ఫ్రాంచైజీల వ్యవహారాల్ని పరిశీలిస్తున్న బీసీసీఐ... వ్యక్తిగత కారణాలతో ఆటకు దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్న కోహ్లి త్వరలోనే జట్టుతో కలుస్తాడని వెల్లడించింది. కొత్త హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, క్రికెట్ డైరెక్టర్ మో బొబట్‌లు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.